జాతీయ తెలుగు దినపత్రిక

# ప్రజాజ్యోతి

ప్రతి అక్షరం ప్రజల కోసం

ఆదిలాబాద్, హైదరాబాద్ | ఆదివారం 02 ఆగస్టు 2026 | సంపుటి: 19 | సంచిక: 148 | పేజీలు: 12 | వెల: రూ.3 | RNI No : TELTEL/2008/24799

పరాభవ నామ సంవత్సరం , శ్రావణ మాసము , తిథి: తృతీయ - 23:09:45 వరకు నక్షత్రంశతభిష - 20:46:16 వరకు కరణంవణిజ - 10:55:14 వరకు, విష్టి - 23:09:45 వరకు పక్షంకృష్ణ యోగంశోభన - 23:22:39 వరకు

Published from ADILABAD, RANGAREDDY (HYDERABAD), NIZAMABAD, WARANGAL http://www.prajajyothinews.com Mail: prajajyothidaily@gmail.com

### వీసా బాండ్ కొనసాగించనున్న అమెరికా

**గరిష్ఠ బాండ్ పరిమితిని 20వేల డాలర్లకు పెంపు**

**బాండ్ పరిధిలో భారత్ లేకపోవడంతో ఊరట**

వాషింగ్టన్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): గతంలో ప్రయోగాత్మకంగా ప్రవేశపెట్టిన వీసా బాండ్ విధానాన్ని కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. శాశ్వత ప్రాతిపదికన ఈ విధానాన్ని అమలు చేసేందుకు నిర్ణయించింది. గతంలో నిర్వహించిన పైలట్ ప్రాజెక్టు విజయవంతం కావడంతో అమెరికా విదేశాంగ శాఖ ఈ నిర్ణయం


మిగతా 2లో..

### గ్రీన్ కారిడార్‌గా ఉపయోగపడ్డ మెట్రో

**అవయవ మార్పిడి కోసం అవయవాల తరలింపు**

హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): హైదరాబాద్ మెట్రో రైలు కేవలం నగరవాసులను గమ్యస్థానాలకు చేర్చే రవాణా వ్యవస్థగానే కాకుండా, అత్యవసర సమయాల్లో ప్రాణాలు కాపాడే సంజీవనిలా మరోసారి తన మానవతా దృక్పథాన్ని చాటుకుంది. తీవ్రమైన ట్రాఫిక్ చిక్కులను అధిగమించి, అవయవ మార్పిడి చికిత్స

మిగతా 2లో..



## భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి

# కొత్త రన్‌వే

- స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి కీలకమైన రోజు
- నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయి
- చంద్రబాబు విజన్‌తో ఏపీ అభివృద్ధిలో పరుగెడుతోంది
- 12 ఏళ్లలో దేశంలో కొత్తగా 166 విమానాశ్రయాలు
- విమానం ఎక్కాలన్న పేదల కల సాకారం చేస్తున్నాం
- భోగాపురం ఎయిర్‌పోర్టును ప్రారంభించిన మోడీ
- పలు అభివృద్ధి పనులకు ప్రధాని మోడీ శ్రీకారం



విజయనగరం,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): స్వర్ణాంధ్ర విజన్-2047 సాకారానికి నేడు కీలకమైన రోజు అని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అన్నారు. రూ.18 వేల కోట్లతో శనివారం అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టామని పేర్కొన్నారు. ఈ ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయని ఆయన చెప్పుకొచ్చారు. భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయాన్ని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుతో కలిసి ప్రధాని మోదీ ప్రారంభించారు. అనంతరం జరిగిన భారీ బహిరంగ సభలో మోదీ మాట్లాడుతూ.. 'ఈ నూతన ప్రాజెక్టులు ఏపీని మరింత ముందుకు తీసుకెళ్తాయన్నారు. కొత్త ప్రాజెక్టులు ఎయిర్, రోడ్ కనెక్టివిటీని పెంపొందిస్తాయి. సింహాచలం అప్పన్న, పైడితల్లి అమ్మవారికి ప్రణామాలు చేస్తున్నా. 13 వేల మంది గిరిజన మహిళల నృత్యం అద్భుతంగా ఉంది. అభివృద్ధితోపాటు థింసా నృత్యంలోనూ సరికొత్త చరిత్ర సృష్టించారు. ఇది చంద్రబాబు విజన్‌కు మరో సాక్ష్యం' అని పేర్కొన్నారు. విమానాశ్రయాన్ని ప్రారంభించి జాతికి అంకితం చేశారు. గిరిజన సంప్రదాయ నృత్యం థింసాను చూసి మధురానుభూతికి లోనయ్యా. అభివృద్ధిలో రికార్డులతో పాటు థింసా నృత్యం కూడా రికార్డు సృష్టించింది. ఒకేసారి

మిగతా 2లో..

## కొత్త శిఖరాలకు తెలంగాణ

# ఆర్థికాభివృద్ధి



**తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిక**

**ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెల్లడి**



హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): తెలంగాణ ఆర్థికాభివృద్ధి కొత్త శిఖరాలను అధిరోహిస్తోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో రాష్ట్ర తలసరి ఆదాయం రూ.4,18,931కు చేరిందని, గతేడాదితో పోలిస్తే రూ.38,900 పెరిగిందని ఆయన వెల్లడించారు. ఒకే ఏడాదిలో 10.23 శాతం వృద్ధి నమోదు చేయడం తెలంగాణ ఆర్థిక వృద్ధికి నిదర్శనమని అన్నారు. దేశంలో అత్యుత్తమ పనితీరు కనబరిచిన రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచిందని పేర్కొంటూ.. పెట్టుబడుల ఆకర్షణ, ఉపాధి కల్పన, పరిశ్రమల అభివృద్ధి, ఆర్థిక వృద్ధి కారణంగానే ఈ ఫలితాలు సాధ్యమయ్యాయని తెలిపారు. విధానపరమైన పాలన, పారదర్శక నిర్ణయాలు, పెట్టుబడులకు అనుకూల వాతావరణం వల్ల తెలంగాణ అభివృద్ధి వేగంగా సాగుతోందని రేవంత్ రెడ్డి అన్నారు. ఈ అభివృద్ధి ఫలాలు ముఖ్యంగా మహిళలు, రైతులు, యువతకు చేరుతున్నాయని ఆయన పేర్కొన్నారు. గత దశాబ్దంలో నెలకొన్న నిరాశను తొలగించి ప్రజల్లో కొత్త ఆశావాదాన్ని నింపామని, తెలంగాణను దేశంలో అభివృద్ధికి ఆదర్శ రాష్ట్రంగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం కృషి చేస్తోందని తెలిపారు. రానున్న సంవత్సరాల్లో మరిన్ని పెట్టుబడులు, ఉపాధి అవకాశాలతో తెలంగాణ మరింత పురోగతి సాధిస్తుందని సీఎం ఆశాభావం వ్యక్తం చేశారు.

### పెట్టుబుడులు లక్ష్యంగా సీఎం విదేశీ టూర్

**ఆగస్ట్ 20 నుంచి పది రోజుల పాటు వివిధ దేశాల్లో పర్యటన**

హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): తెలంగాణకు భారీ పెట్టుబడులు తీసుకురావడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి త్వరలో విదేశీ పర్యటనకు వెళ్లనున్నారు. ఆగష్టు 20 నుంచి సెప్టెంబరు 8 వరకు దాదాపు 20 రోజులపాటు వివిధ దేశాల్లో సీఎం

మిగతా 2లో..

## సోషల్ మీడియాతో పాత్ర

# మరువలేనిది

**ఎన్నో వార్తలను వాటిద్వారానే వెలుగు చూస్తున్నాయి**

**బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్**



హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): యువతరం కొత్త తరహాలో ఢిల్లీలో కదం తొక్కిందని బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ అన్నారు. ప్రధాని మోదీ ఎవరితో పెట్టుకోవద్దో వారితోనే పెట్టుకున్నారని చెప్పారు. వాట్సాప్ అంకుల్స్.. ఇన్‌స్టా పిల్లల్లో ఎవరు గెలిచారో చూశాం. అర్ధరాత్రి ప్రధాని మోదీ ఇన్‌స్టాగ్రామ్‌లో వీడియో పోస్టు చేశారు. సోషల్ మీడియా లేకపోతే జవాబుదారీతనం వచ్చేది కాదు. వచ్చే ఎన్నికల్లో 50 శాతంపైగా జెన్‌జీలు ఓట్లు వేయబోతున్నారు. 18 నుంచి 24 ఏళ్ల మధ్య పిల్లలు పేపర్లు, టీవీలు చూడటం లేదు. నేటి యువత న్యూస్‌ను రీల్స్ రూపంలో చూస్తోందని కేటీఆర్ అన్నారు. తెలంగాణలోనే ఎన్నో సందర్భాల్లో వార్తను వార్తలా రాయలేని

మిగతా 12లో..

## కారణాలు చెప్పకుండా జడ్జిల

# నియామకమా?

**పారదర్శకత, రాజ్యాంగ విలువలు కాపాడాలి**

**కొలీజియం సిఫార్సులపై జస్టిస్ ఉజ్జల్ భుయాన్**



న్యూఢిల్లీ,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): న్యాయమూర్తుల నియామక ప్రక్రియలో అత్యంత పారదర్శకత తప్పనిసరి అని సుప్రీం కోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఉజ్జల్ భుయాన్ అభిప్రాయపడ్డారు. కొలీజియం చేసే సిఫారసులకు తగిన కారణాలు వెల్లడించకపోవడం వల్ల అర్హత కలిగిన జడ్జిల సేవలకు తగిన గుర్తింపు లభించకపోవడమే కాకుండా అన్యాయం జరుగుతుందని అన్నారు. ఇంకా రాజ్యాంగ విలువలకు విరుద్ధంగా వ్యవహరించే శక్తులు కూడా న్యాయవ్యవస్థలోకి

మిగతా 12లో..

### పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

**పార్లమెంట్ ఆమోదించిన బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం**

న్యూఢిల్లీ,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): దేశంలో పేపర్ లీకేజీలను అరికట్టేలా కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన యాంటీ పేపర్ లీక్ అమెండ్‌మెంట్ బిల్లును రాష్ట్రపతి ద్రౌపది ముర్ము శనివారం ఆమోదించారు. దీంతో ఇకపై ఈ బిల్లు చట్టంగా అమలులోకి రానుంది. 'పబ్లిక్ ఎగ్జామినేషన్స్ (ప్రివెన్షన్ ఆఫ్ అన్‌ఫెయిర్ మీన్స్) అమెండ్‌మెంట్ బిల్,

మిగతా 2లో..



## తెలంగాణ రైజింగ్-2047'లో

# భాగస్వామ్యం అవ్వండి

**ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టి కృషితోనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి**

**సీఎస్ఆర్ ద్వారా కీలక పాత్ర పోషించాలని కార్పొరేట్ సంస్థలకు పిలుపు**

**సథరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'లో మంత్రి శ్రీధర్ బాబు**

హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): కార్పొరేట్ సామాజిక బాధ్యత(సీఎస్ఆర్) ద్వారా 'తెలంగాణ రైజింగ్-2047' లక్ష్యసాధనలో భాగస్వామ్యం కావాలని కార్పొరేట్ సంస్థలకు రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు పిలుపునిచ్చారు. ప్రభుత్వం, పరిశ్రమలు, సమాజం సమష్టిగా కృషి చేస్తేనే రాష్ట్ర సమగ్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. ది ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా (ఐసీఎస్ఐ), హైదరాబాద్ ఛాప్టర్ ఆధ్వర్యంలో కొండాపూర్ లోని తెలంగాణ కాంట్రాక్టర్స్ కల్చరల్ క్లబ్ లో రెండ్రోజుల పాటు నిర్వహించనున్న '50వ సదరన్ ఇండియా రీజినల్ కాన్ఫరెన్స్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్'ను

మిగతా 12లో..

### రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

**విద్వేషపూరిత ప్రసంగాలపై అసెంబ్లీలో బిల్లు: పొన్నం**

హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): తెలంగాణ అసెంబ్లీ స్పీకర్ ఛాంబర్లో సెలక్ట్ కమిటీ సమావేశం శనివారం జరిగింది. సెలక్ట్ కమిటీ చైర్మన్ మంత్రి పొన్నం ప్రభాకర్ అధ్యక్షతన ఈ భేటీ నిర్వహించారు. ఈ సమావేశంలో పలు కీలక అంశాలపై చర్చించారు. రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చించింది. అసెంబ్లీ వర్షాకాల సమావేశాలు ముగిసేలోపు ఓ నివేదికను సమర్పించే దిశగా ఈ కమిటీ కార్యాచరణ రూపొందించనుంది. ఈ సమావేశంలో అసెంబ్లీ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్, కమిటీ సభ్యులు

మిగతా 12లో..

## స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు



**సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ముఖ్యమే**

**చట్టాన్ని గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి**

**జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్య**

**దోవల్‌కు అమిత్ షా చేతుల మీదుగా తిలక్ జాతీయ పురస్కారం అందచేత**

ముంబై,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): ఇటీవల దేశంలో యువత చేపట్టిన నిరసనలపై జాతీయ భద్రతా సలహాదారు, ఇండియన్ జేమ్స్ బాండ్ అజిత్ దోవల్ సంచలన వ్యాఖ్యలు చేశారు. స్వేచ్ఛ అంటే ఇష్టమొచ్చింది చేయడం కాదని యువతకు చురకలటించారు. స్వేచ్ఛతో పాటు సమాజం, దేశం పట్ల బాధ్యతలు కూడా ఉంటాయని యువత గుర్తుంచుకోవాలని హితవు పలికారు. స్వేచ్ఛ, నిరసన తెలిపే హక్కు

మిగతా 12లో..



### ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

**గోదావరి పరివాహక ప్రాంతాల్లో ఉత్తమ్ పర్యటన**

**పూడికతీత పనులను అధ్యయనం చేస్తున్నట్లు వెల్లడి**

హైదరాబాద్,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): తెలంగాణ నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి నిజామాబాద్ జిల్లాలోని శ్రీరాంసాగర్ (ఎస్సారెస్పీ) ప్రాజెక్టును సందర్శించి, గోదావరి పరివాహక ప్రాంతాల్లోని ప్రాజెక్టుల పరిస్థితులను సమీక్షించారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణమని,

మిగతా 12లో..

# సంపాదకీయం

## ఉత్తరాంధ్రకు మణిహారం భోగాపురం !

పోర్టులు, ఎయిర్‌పోర్టులు, సువిశాల సముద్రతీరం కలిగి ఉండడం ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కలసి వచ్చే అంశం. రోడ్లు గ్రామాలను అనుసంధానిస్తే, రైల్వేలు పరిశ్రమలను కలుపుతాయి. ఓడరేవులు దేశాల మధ్య వ్యాపారాన్ని విస్తరిస్తే, విమానాశ్రయాలు ప్రపంచ స్థాయి అవకాశాలను ముంగిట్లోకి తీసుకొస్తాయి. నేటి గ్లోబల్ ఎకానమిలో అంతర్జాతీయ స్థాయి ఏవియేషన్ రవాణా వ్యవస్థ ఉంటేనే విదేశీ పెట్టుబడులు, పర్యాటకం, పారిశ్రామిక ఎగుమతులు, రియల్ ఎస్టేట్, ఉద్యోగావకాశాలు విస్తరిస్తాయి. దీంతో అభివృద్ధి వేగంగా సాగడానికి దోహదపడుతుంది. ఎపిలో అనేక సహజ వనరులు ఉన్నప్పటికీ గతంలో నిర్లక్ష్యం చేశారు. టిడిపి కూటమి అధికారంలోకి వచ్చాక అనేక రంగాల్లో అభివృద్ధి కళ్లకు కనిపిస్తోంది. ఓ వైపు భోగాపురం ఎయిర్‌పోర్ట్ అందుబాటులోకి వచ్చింది. ప్రధాని మోడీ దీనిని ప్రారంభించడం ద్వారా ఉత్తరాంధ్ర కు గేట్‌వేను తెరిచారు. అమరావతలి రాజధాని నిర్మాణం కూడా శరవేగంగా సాగుతోంది. అలాగే పోలవరం పూర్తి కావస్తోంది. ఇవన్నీ నిజానికి జగన్ హయాంలోనే పూర్తి కావాల్సిన ప్రాజక్టులు. కానీ జగన్ నిర్లక్ష్యం కారణంగా వీటిని పక్కన పెట్టారు. మనమెంతకాలం ఉంటామన్నది పక్కన పెట్టి అభివృద్ధిలో మనదైన ముద్ర వేస్తే చిరకాలం ప్రజలు గుర్తుంచుకుంటారు. దశాబ్దాలుగా విశాఖపట్నం ఉత్తరాంధ్రకు ఆర్థిక, వాణిజ్య కేంద్రంగా వర్ధిల్లుతున్నా, ప్రస్తుతం ఉన్న విశాఖ విమానాశ్రయం పూర్తిస్థాయి పౌర విమానాశ్రయం కాదు. ఇది నావల్ డాక్ వారి విమానాశ్రయం కావడంతో చంద్రబాబు భోగాపురంలో అంతర్జాతీయ విమానాశ్రయా నికి నిర్ణయించారు. విశాఖ పట్టణానికి ఇది దగ్గరగా ఉండడ, ఉత్తరాంధ్రకు కూడా కలసి వచ్చే అంశం. విశ్వాఖ పూర్తిస్తాయి విమానాశ్రయం కాకపోవడంతో ప్రముఖ ఎయిర్‌లైన్స్ సంస్థలు విశాఖకు తగినన్ని సర్వీసులు నడపలేక పోయాయి. విశాఖపట్నం ఐటీ, ఫార్మా, వైద్యం, విద్య పర్యాటక రంగాల్లో అంతర్జాతీయ స్థాయి కేంద్రంగా ఎదుగుతున్న వేళ, ఒక పూర్తిస్థాయి పౌర అంతర్జాతీయ విమానాశ్రయం అవసరం ఏర్పడింది. అందుకే ఎపి విభజన తరవాత చంద్రబాబు భోగాపురం కోసం నిర్ణయించారు. 2014లో విశాఖ సమీపంలోని భోగాపురాన్ని గ్రీన్ ఫీల్డ్ విమానాశ్రయానికి అనువైన ప్రాంతంగా గుర్తించారు. 2019 ఫిబ్రవరిలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. కేవలం విమానాశ్రయమే కాకుండా ఏరోసిటీ, విమానాల మరమ్మతులు, పైలట్ శిక్షణ కేంద్రాలతో కూడిన లాజిస్టిక్స్ హబ్‌గా దీనిని డిజైన్ చేశారు. భూసేకరణ చేపట్టి, ఇళ్లు కోల్పోయిన 390 కుటుంబాలకు ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీతో పాటు ప్రత్యేక కాలనీలు నిర్మించారు. అన్నింటికి మించి రామ్మోహన్ నాయుడును ఎన్‌డిఎలో పౌర విమానయాన శాఖ మంత్రిగా నియించయుకోవడం ద్వారా పనులు చకచకా చేయించుకోగలిగారు. చంద్రబాబు సిఎంగా కొనసాగివుంటే 2019లోనే ఇది పూర్తయ్యేది. దాదాపు 12 ఏళ్ల తరవాత మళ్లీ రెండోదఫా చంద్రబాబు అధికారంలోకి వచ్చాక భోగాపురం వేగం పుంజుకుని చకచకా పనులు పూర్తి చేసుంది. ఇలా చరిత్రలో 2026 ఆగస్టు 1 నూతన అధ్యాయానికి నాంది పలికింది. ఉత్తరాంధ్ర ప్రజల దశాబ్దాల నిరీక్షణకు తెరదించుతూ, భోగాపురంలో నిర్మించిన 'అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయాన్ని' ప్రధానమంత్రి నరేంద్ర మోదీ జాతికి అంకితం చేయడం విశేషం. సాధారణంగా విమానాశ్రయాలు రవాణా సౌకర్యాలను మెరుగుపరుస్తాయి. కానీ కొన్ని ప్రాజెక్టులు మాత్రమే ఒక ప్రాంత ఆర్థిక రూపురేఖలను పూర్తిగా మార్చేసే సామర్థ్యాన్ని కలిగి ఉంటాయి. భోగాపురం ఇంటర్నేషనల్ ఎయిర్‌పోర్ట్ సరిగ్గా అటువంటి ప్రాజెక్టే! మౌలిక సదుపాయాల కల్పన ఏ ప్రాంత ఆర్థికాభివృద్ధికైనా పునాది వంటిది. ఈ ఆలోచనా సరళితోనే కూటమి ప్రభుత్వం భోగాపురం విమానాశ్రయాన్ని అత్యాధునిక వసతులతో తీర్చిదిద్దింది. నిజానికి ఇది 2019లోపే పూర్తయి వుంటే పరిస్తితి మరోలా ఉండేది. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో దేశ మౌలిక వసతుల విప్లవంలో భోగాపురం ప్రాజెక్టు ఒక మచ్చుతునక! జాతీయ రహదారులు, రైల్వేలు, పోర్టులు, ఎయిర్‌పోర్టుల అనుసంధానం ద్వారా దేశాన్ని ఆర్థికంగా బలోపేతం చేసే క్రమంలో ఇది మరో చరిత్రాత్మక విజయం. ఆంధ్రప్రదేశ్ ప్రజలకు భోగాపురం అనేది కేవలం ఒక కనెక్టివిటీ మాత్రమే కాదు. ఆత్మవిశ్వాసానికి, సరికొత్త అవకాశాలకు, ఉన్నత ఆశయాలకు సంకేతం. గ్లోబల్ ఇన్వెస్ట్‌మెంట్‌కు, పారిశ్రామిక ఆవిష్కరణలకు ఉత్తరాంధ్ర ఇప్పుడు చిరునామాగా నిలవనుంది. 2024లో ఎన్డీయే కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టగానే ఈ ప్రాజెక్టు మళ్లీ శరవేగంగా పట్టాలెక్కింది. ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రత్యేక దృష్టి సారించగా, కేంద్ర విమానయానశాఖ మంత్రి రామ్మోహన్ నాయుడు క్షేత్రస్థాయిలో నిరంతరం సమీక్షలు నిర్వహిస్తూ రాత్రింబవళ్లు పనులు జరిగేలా చర్యలు తీసుకున్నారు. సుమారు రూ. 4,700 కోట్ల భారీ వ్యయంతో 2,700 ఎకరాలకు పైగా విస్తీర్ణంలో నిర్మించిన భోగాపురం విమానాశ్రయం దేశంలోనే అత్యంత ఆధునిక గ్రీన్ ఫీల్డ్ ఎయిర్‌పోర్టులలో ఒకటి. ఇక్కడ నిర్మించిన 3.8 కిలోమీటర్ల సుదీర్ఘ 'కోడ్ 4ఈ' రన్‌వే ద్వారా భారీ అంతర్జాతీయ విమానాలు కూడా సునాయాసంగా ల్యాండ్ అవుతాయి. ప్రాథమికంగా ఏడాదికి 60 లక్షల మంది ప్రయాణికులను నిర్వహించేలా ఈ టెర్మినల్ రూపుదిద్దుకుంది. ప్రకృతి విపత్తులను సైతం తట్టుకునేలా అత్యున్నత ప్రమాణాలతో దీనిని నిర్మించారు. ఈ విమానాశ్రయం అందుబాటులోకి రఆవడంతో ఉత్తరాంధ్రలోని ఫార్మా, సీఫుడ్, పండ్లు, పూలు, వస్త్ర పరిశ్రమల ఎగుమతులకు అవకాశాలు పెరగడంతో పాటు యువతకు పెద్ద ఎత్తున ప్రత్యక్షంగా, పరోక్షంగా ఉపాధి అవకాశాలు లభిస్తాయి.

## పెట్టుబడులు లక్ష్యంగా సీఎం విదేశీ టూర్

పర్యటించనున్నారు. అమెరికా, యూకే సహా మరికొన్ని కీలక దేశాలకు ఆయన వెళ్లనున్నట్టు సమాచారం. అయితే ఆయా దేశాల్లోని కంపెనీల ప్రతినిధులు, అపాయింట్‌మెంట్‌ల నేపథ్యంలో సీఎం టూర్ షెడ్యూల్ ఆగష్టు 20-23 తేదీల మధ్య ఉండవచ్చని కూడా అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ పర్యటనలో ప్రపంచ ప్రఖ్యాత కంపెనీల ప్రతినిధులు, పారిశ్రామికవేత్తలు, పెట్టుబడి సంస్థలు, ప్రవాస భారతీయులతో సీఎం సమావేశాలు నిర్వహించనున్నారు. ఐటీ, ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్, డేటా సెంటర్లు, సెమీ కండక్టర్లు, ఎలక్ట్రానిక్స్ తయారీ, లైఫ్ సైన్సెస్, ఫార్మా, గ్రీన్ ఎనర్జీ, ఏరోస్పేస్, డిఫెన్స్ తయారీ రంగాల్లో పెట్టుబడులను ఆకర్షించడమే లక్ష్యంగా సీఎం టూర్ ఉండొచ్చని సమాచారం. అమెరికాలో చిప్ తయారీ, క్లౌడ్ కంప్యూటింగ్, ఏఐ కంపెనీలతో, లండన్‌లో గ్లోబల్ ఫైనాన్షియల్ ఇన్వెస్టర్లు, విద్యా సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపే అవకాశం ఉంది. అలాగే గతంలో విదేశీ పర్యటనల సంద ర్భంగా పలు అంతర్జాతీయ సంస్థలతో తెలంగాణ ప్రభుత్వం అవగాహన ఒప్పందాలు కుదుర్చుకున్న నేపథ్యంలో.. ఆయా కంపెనీల ప్రతినిధులతోనూ రేవంత్ భేటీ అయ్యే అవకాశాలున్నాయి. చట్టసభల్లోకి ప్రవేశించే వయసును 21కి తగ్గించాలని అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి పంపుతామని ఇటీవల సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ అంశంపై తీర్మానం చేసేందుకు ఆగష్టు 17-18 తేదీల్లో ఒక రోజు ప్రత్యేక అసెంబ్లీ సెషన్ నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించినట్టు తెలిసింది. ఇక వర్షాకాల సమావేశాలను సెప్టెంబరు మూడో వారంలో వారంపాటు నిర్వహించే అవకాశం ఉందని సమాచారం. ఆగస్టులో సీఎం విదేశీ పర్యటనకు ప్రాథమిక షెడ్యూల్ ఖరారైన నేపథ్యంలో.. సెప్టెంబరు రెండో వారం వరకు ఆయన తిరిగి రాష్ట్రానికి వస్తారని, మూడో వారంలో అసెంబ్లీ సమావేశాలు ఉంటాయనే చర్చ సచివాలయంలో జరుగుతోంది.

## అప్పుల బాధ తట్టుకోలేక వ్యాపారి ఆత్మహత్య

హైదరాబాద్,ఆగస్ట్1(ప్రజాజ్యోతి): నగరంలోని మల్లాపూర్ ప్రాంతంలో తీవ్ర విషాదకర సంఘటన చోటుచేసుకుంది. వ్యాపారంలో వచ్చిన నష్టాలు, రోజురోజుకూ పెరుగుతున్న అప్పుల భారం తట్టుకోలేక ఓ కూరగాయల వ్యాపారి తీవ్ర మనస్తాపానికి గురయ్యాడు. అప్పులు తీర్చే మార్గం కనిపించక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై.. ఇంట్లో ఎవరూ లేని సమయంలో కిటికీ గ్రిల్‌కు చున్నీతో ఉరివేసుకుని ప్రాణాలు తీసుకున్నాడు. సమాచారం అందుకున్న నాచారం పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు ఘటనా స్థలంలో ఆధారాలు సేకరించి దర్యాప్తు చేస్తున్నారు. తన భర్త బాధ పడటం చూడలేకపోయిన భార్య.. ఆయనకు ఆర్థికంగా సాయం చేసేందుకు తీవ్రంగా యత్నించింది. డబ్బును సర్దుబాటు చేసుకుని ఇంటికి తిరిగి వచ్చేలోపు ఈ దారుణం జరిగిపోయింది. తన భర్త అప్పుల భారం తట్టుకోలేకే ఈ కఠిన నిర్ణయం తీసుకున్నాడని నాచారం పోలీస్ స్టేషన్‌లో మృతుని భార్య ఫిర్యాదు చేసింది. చేతికి డబ్బులు అంది భర్త కష్టాలు తీరుతాయనుకున్నలోపే ఇలా ప్రాణాలు కోల్పోవడం స్థానికులను తీవ్రంగా కలచివేసింది.

### భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి

# కొత్త రన్‌వే

13వేల మంది గిరిజన మహిళల నృత్యం నిజంగా అద్భుతం. చంద్రబాబు విజన్‌కు హృదయపూర్వక అభినందనలు. భోగాపురం ఎయిర్ పోర్టు.. ఉత్తరాంధ్ర అభివృద్ధికి కొత్త రన్‌వేగా పనిచేస్తుంది. ఈ ఎయిర్‌పోర్టు.. ఆంధ్రా యువత ఉజ్వల భవిష్యత్తుకు కొత్త లాంచ్‌పాడ్‌లా పనిచేస్తుంది. గతంలో ఎక్కడ విమానాశ్రయం నిర్మించినా ఒక్క కుటుంబం పేర్లే ఉండేవి. అయోధ్యలో ఎయిర్‌పోర్టుకు వాల్మీకి పేరు, పంజాబ్‌లో సంత్ రవిదాస్ పేరు పెట్టాం. భోగాపురం ఎయిర్‌పోర్టుకు అల్లూరి సీతారామరాజు పేరు పెట్టాం. 2014కు ముందు మన దేశంలో 74 విమానాశ్రయాలే ఉండేవి. మేం వచ్చాక 12 ఏళ్లలో 166 విమానాశ్రయాలు వచ్చాయి. సామాన్యులకు కూడా విమాన ప్రయాణాన్ని చేరువ చేశాం. విమానం ఎక్కాలన్న పేద, మధ్యతరగతి కలలు సాకారం చేశాం. తమ ప్రాంతం నుంచే విమానం ఎక్కేలా కొత్త అనుభూతి తీసుకొస్తు?న్నాం. ఉడాన్ ద్వారా దేశ విమానయానరంగంలో పెనుమార్పులు వచ్చాయి. దేశంలో బ్లూ ఎకానమీ అభివృద్ధి చేస్తున్నాం. విశాఖపట్నం నుంచి కృష్ణపట్నం వరకు పాత పోర్టులు అభివృద్ధి చేస్తున్నాం. మూలపేట, రామాయపట్నంలో కొత్త పోర్టులు నిర్మిస్తున్నాం. పోర్టుల అభివృద్ధితో పాటు హైవే ఎక్స్‌ప్రెస్‌లు సరికొత్త వేగాన్ని అందిస్తున్నాయి. ఏపీలో రూ.లక్ష కోట్ల విలువైన రైల్వే ప్రాజెక్టుల పనులు జరుగుతున్నాయి. ఈ రాష్ట్ర ప్రజలు ఎప్పుడూ భవిష్యత్తు వైపు చూస్తారు. సాఫ్ట్‌వేర్, ఐటీ సెక్టార్‌లో తెలుగువాళ్లకు మంచి పేరుంది. దేశ, విదేశాల్లో తెలుగువాళ్లు తమ సత్తా చాటుతున్నారు. ప్రతిభావంతులైన యువత సామర్థ్యం దేశానికి ఉపయోగపడాలి. చంద్రబాబు సారథ్యంలో మ్యానుఫ్యాక్చరింగ్ హబ్‌గా ఏపీ మారుతోంది. ప్రపంచంలో అనేక ప్రముఖ కంపెనీల పెట్టుబడులు రాష్ట్రానికి వస్తున్నాయి. ఏపీలో గ్రోత్ ఎకో సిస్టం నిర్మిస్తున్నాం. సెమీకండక్టర్, డేటా సెంటర్ రంగాల్లో వేగంగా పనులు జరుగుతున్నాయి. కేంద్రం.. నక్కపల్లిలో భారీ ఫార్మా కంపెనీ నిర్మిస్తోంది. డబుల్ ఇంజిన్ సర్కార్ వల్లే డబుల్ స్పీడ్‌తో ఏపీ అభివృద్ధి' అని మోదీ తెలిపారు. అనంతరం పలు ప్రాజెక్టులకు ప్రధాని శ్రీకారం చుట్టారు. రూ.17,912 కోట్ల అభివృద్ధి ప్రాజెక్టులను ప్రధాని మోదీ వర్చువల్‌గా ప్రారంభించారు. రూ.4,727 కోట్లతో భోగాపురం ఎయిర్‌పోర్ట్ నిర్మించారు. విశాఖపట్నం తర్లువాడలో సెమీకండక్టర్ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేశారు. సెమీకండక్టర్ ప్యాకేజింగ్, టెస్టింగ్ యూనిట్ తొలిదశకు శ్రీకారం చుట్టారు. రూ.468 కోట్ల వ్యయంతో సెమీకండక్టర్ ప్రాజెక్టును ప్రారంభించారు. కర్నూలు జిల్లాలో 4 రెన్యువబుల్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు ప్రధాని మోదీ శంకుస్థాపన చేశారు. రూ.5,550 కోట్ల వ్యయంతో పవర్‌గ్రిడ్ ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టుకు శ్రీకారం చుట్టారు. కర్నూలు విండ్, సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ వ్యవస్థ ప్రారంభించారు. రూ.3,547 కోట్ల వ్యయంతో కర్నూలు ట్రాన్స్‌మిషన్ ప్రాజెక్టు, అనంతపురం, కర్నూలులో రూ.823 కోట్ల వ్యయంతో.. చేపట్టిన సోలార్ ఎనర్జీ జోన్ ట్రాన్స్‌మిషన్ పథకం ప్రారంభించారు. రూ.27 కోట్లతో పెంచలకోన-ఎర్రపాడు హైలెవల్ బ్రిడ్జికి శంకుస్థాపన చేశారు. రూ.763 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-4, రూ.933 కోట్లతో ఖమ్మం-దేవరపల్లి గ్రీన్‌ఫీల్డ్ హైవే ప్యాకేజీ-5 ప్రారంభించారు. రూ.160 కోట్లతో తాడిపత్రి 4 లేన్ బైపాస్ నిర్మాణానికి ప్రధాని మోదీ శ్రీకారం చుట్టారు. కార్యక్రమంలో గవర్నర్ జస్టిస్ నజీర్, సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, కేంద్రమంత్రులు, రాష్ట్రమంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు పాల్గొన్నారు.




# ధరణి అక్రమాలపై ఉక్కుపాదం

**అక్రమాల బట్టబయలుకు ఫాస్ట్‌ట్రాక్ విచారణ**

**పేదల భూములు కాజేసిన వారిని వదిలిపెట్టం**

**నిషేధిత జాబితాలో కొత్తగా అంగులం భూమి కూడా చేర్చలేదు**

**భూముల ధరల సవరణతో ఆదాయం 20శాతం వరకు పెరుగుదల**

**త్వరలో అసైన్డ్ భూములపై సమగ్ర విధాన నిర్ణయం**

**కేంద్రం నిధులు ఇవ్వకపోయినా ఇందిరమ్మ ఇళ్ల బిల్లులు చెల్లిస్తాం**

**మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి**

హైదరాబాద్,ఆగస్ట్1(ప్రజాజ్యోతి): ధరణి అక్రమాలపై ఉక్కుపాదం మోపుతున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. ధరణి నుంచి భూభారతి వరకు లావాదేవీలపై



విచారణ జరుపుతున్నట్లు తెలిపారు. పేదల భూములను కాజేసిన వారిని వదిలిపెట్టే ప్రసక్తే లేదని హెచ్చరించారు. నిషేధిత జాబితాలో కొత్తగా అంగుళం భూమి కూడా చేర్చలేదన్నారు. మరోవైపు భూముల ధరల సవరణతో రిజిస్ట్రేషన్ల ఆదాయం 20శాతం వరకు పెరిగిందని పొంగులేటి తెలిపారు. సచివాలయంలో ఆయన మీడియాతో చిట్‌చాట్‌గా మాట్లాడారు. ధరణి పోర్టల్‌ను అడ్డుపెట్టుకుని పేదల భూములు, ప్రభుత్వ భూములను అక్రమంగా కాజేసిన వారిపై ప్రభుత్వం ఉక్కుపాదం మోపుతుందని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి స్పష్టం చేశారు. ధరణి నుంచి భూభారతి వరకు జరిగిన ప్రతి భూ లావాదేవీని ఫాస్ట్‌ట్రాక్ విధానంలో విచారిస్తున్నామని, అక్రమాలకు పాల్పడిన వారెవరైనా చట్టం ముందు నిలబెట్టడం ఖాయమని హెచ్చరించారు. ధరణి పోర్టల్‌ను అడ్డుగా చేసుకుని భారీ స్థాయిలో భూ అక్రమాలు, అక్రమ మ్యుటేషన్లు, ప్రభుత్వ భూముల బదిలీలు జరిగాయని అన్నారు. ప్రస్తుతం ప్రతి వ్యవహారాన్ని ఆధారాలతో సహా పరిశీలిస్తున్నామని, నిజాలను ప్రజల ముందుంచుతామని తెలిపారు. అంతేగాక ఎవరి హయాంలో ఎంత భూమి నిషేధిత జాబితాలో చేరిందో తేలుస్తామన్నారు. తాము అధికారంలోకి వచ్చినప్పుడు నిషేధిత జాబితాలో ఎంత భూమి ఉంది? ఆ భూములను ఎవరు, ఎప్పుడు, ఏ కారణాలతో చేర్చారు? తర్వాత ఎందుకు తొలగించారు? అనే ప్రతి అంశంపై సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. ప్రతిపక్షాలు చేస్తున్న ఆరోపణలను కూడా అదే స్థాయిలో పరిశీలిస్తున్నామని స్పష్టం చేశారు.కొత్తగా ఒక్క సెంటు భూమి కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదు. ప్రస్తుత ప్రభుత్వం కొత్తగా అంగుళం భూమిని కూడా నిషేధిత జాబితాలో చేర్చలేదని మంత్రి స్పష్టం చేశారు. హైకోర్టు ఆదేశాల మేరకు ధరణి పోర్టల్‌లో ఉన్న జాబితానే కోర్టుకు సమర్పించామని, వివాదాలు లేని ప్రైవేట్ ఆస్తులు లేదా ప్లాట్లను ప్రభుత్వం నిషేధిత జాబితాలో చేర్చిందన్న ప్రచారం పూర్తిగా అసత్యమని పేర్కొన్నారు. రాష్ట్రంలో భూ వివాదాలకు శాశ్వత పరిష్కారం చూపాలనే లక్ష్యంతో ప్రభుత్వం రీసర్వే చేపట్టిందని తెలిపారు. ఇప్పటికే 276 గ్రామాల్లో సర్వే పూర్తైందని, ప్రతి సర్వే నంబర్‌కు ఆధార్ తరహాలో ప్రత్యేక భూధార్ నంబర్ కేటాయిస్తామని చెప్పారు. ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోందని, కేవలం రెండు శాతం మాత్రమే అభ్యంతరాలు వచ్చాయని వివరించారు. రాష్ట్రంలో సుమారు 85 వేల ఎకరాల అసైన్డ్ భూములు ఉన్నాయని, వాటి విషయంలో సమగ్ర విధాన నిర్ణయం తీసుకోవాల్సి ఉందన్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల అవసరాలను దృష్టిలో ఉంచుకుని అన్ని కోణాల్లో ప్రభుత్వం చర్చిస్తోందని తెలిపారు. ప్రభుత్వ భూముల పరిరక్షణలో ఎలాంటి రాజీ ఉండదని, ఎవరికీ అనుకూలంగా లేదా వ్యతిరేకంగా వ్యవహరించే ప్రశ్నే లేదని మంత్రి స్పష్టం చేశారు. నిబంధనల ప్రకారమే ప్రతి నిర్ణయం తీసుకుంటామని తెలిపారు. క్యూర్ పరిధిలో ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ టవర్స్‌ను చూసి బీఆర్‌ఎస్ నాయకులు జీర్ణించుకోలేక విమర్శలు చేస్తున్నారని మంత్రి విమర్శించారు. కొల్లూరులో గత ప్రభుత్వం నిర్మించిన 2బీహెచ్‌కే ఇళ్లలో వర్షం వస్తే నీళ్లు కారుతున్నాయని మీడియా దృష్టికి వచ్చిన విషయాన్ని ప్రస్తావిస్తూ, అది గత ప్రభుత్వ నాణ్యతకు నిదర్శనమని ఎద్దేవా చేశారు. అయినప్పటికీ ప్రజల ఇబ్బందులను దృష్టిలో ఉంచుకుని ఆ ఇళ్లను కూడా మరమ్మతులు చేయిస్తామని చెప్పారు. గ్రామీణ ప్రాంతాల్లో నిర్మించిన ఇందిరమ్మ ఇళ్లకు కేంద్ర ప్రభుత్వం నిధులు విడుదల చేయకపోయినా, లబ్ధిదారులు ఇబ్బంది పడకుండా రాష్ట్ర ప్రభుత్వమే ÷నైల్ బిల్లులు చెల్లిస్తుందని మంత్రి ప్రకటించారు. భూముల మార్కెట్ విలువల సవరణ తర్వాత ప్రభుత్వం అంచనా వేసిన దానికంటే 10 నుంచి 20 శాతం వరకు అధిక ఆదాయం వచ్చిందని మంత్రి తెలిపారు. స్టాంప్స్ / రిజిస్ట్రేషన్స్ శాఖ ఆదాయం కూడా గణనీయంగా పెరిగిందన్నారు. ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పుడు వార్షిక ఆదాయం సుమారు రూ.13 వేల కోట్లు ఉండగా, గత ఏడాది అది రూ.15 వేల కోట్లకు చేరిందని, ఈ ఆర్థిక సంవత్సరంలో రూ.18 వేల కోట్లకు చేరుకునే అవకాశం ఉందని వెల్లడించారు. రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్య కూడా గణనీయంగా పెరిగిందని మంత్రి పొంగులేటి తెలిపారు.

## గోదావరి జలాలపై తెలంగాణకు నష్టం

హైదరాబాద్,ఆగస్ట్1(ప్రజాజ్యోతి): గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తెలంగాణ హక్కులను దెబ్బతీసే ప్రయత్నాలు చేస్తోందని టీఆర్‌ఎస్ అధినేత్రి కల్వకుంట్ల కవిత ఆరోపించారు. రాష్ట్ర విభజన తర్వాత గోదావరి జలాల్లో తెలంగాణకు దక్కాల్సిన వాటాను అడ్డుకునేలా ఎత్తుగడలు వేస్తోందని విమర్శించారు. తమకు అనుకూలంగా వ్యవహరిస్తున్న తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మద్దతుతో గోదావరి జలాలను మళ్లించే కుట్రలు వేగవంతమయ్యాయని ఆరోపించారు. బచావత్ ట్రిబ్యునల్ కేటాయింపులను ప్రశ్నిస్తూ ఫిర్యాదులు చేయడం ద్వారా గోదావరి రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (జీఆర్ఎంబీ) కూడా ఆంధ్రప్రదేశ్ వైఖరికి అనుగుణంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. గోదావరి నదిలో తెలంగాణకు 964 టీఎంసీల జలాలపై హక్కు ఉందని, ట్రిబ్యునల్ రక్షణ కలిగిన కేటాయింపులు చెల్లవని పేర్కొంటూ తెలంగాణ ప్రాజెక్టులకు కేంద్ర జల సంఘం (సీడబ్ల్యూసీ) ఇచ్చిన అనుమతులను రద్దు చేయాలని ఆంధ్రప్రదేశ్ కోరడం తెలంగాణ హక్కులను కాలరాయడమేనని కవిత అన్నారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇప్పటికైనా స్పందించి గోదావరి జలాల విషయంలో ఆంధ్రప్రదేశ్ చేస్తున్న ప్రయత్నాలకు మద్దతు ఇవ్వకుండా, తెలంగాణ ప్రజల హక్కులను పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. లేకపోతే తెలంగాణ ప్రజల హక్కుల పరిరక్షణ కోసం తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు.

## వీసా బాండ్ కొనసాగించనున్న అమెరికా

తీసుకుంది. విజిటర్ వీసాల కోసం దరఖాస్తు చేసుకునే వారు ముందుగా 15 వేల డాలర్ల వరకూ బాండ్ సమర్పించాలంటూ ఏడాది క్రితం అమెరికా ప్రయోగాత్మకంగా ఈ విధానాన్ని తీసుకొచ్చింది. బీ-1 (బిజినెస్), బీ-2 (టూరిస్ట్) వీసాలకు దరఖాస్తు చేసుకునే వారు ఈ బాండ్ సమర్పించాల్సి ఉంటుంది. దరఖాస్తుదారులు ఈ బాండ్ సమర్పించాలా? వాద్దా? అనేది కాన్సులార్ ఆఫీసర్లు నిర్ణయిస్తారు. వీసా గడువులోపు విదేశీయులు అమెరికాను వీడితే ఈ మొత్తాన్ని తిరిగిచ్చేస్తారు. లేకపోతే డబ్బును కోల్పోవాల్సి ఉంటుంది. అక్రమ వలసలను నిరోధించేందుకు అమెరికా ఈ విధానాన్ని ప్రవేశపెట్టింది. పైలట్ ప్రాజెక్టులో భాగంగా దరఖాస్తుదారులు 5 వేలు, 10 వేలు లేదా 15 వేల డాలర్ల బాండ్స్‌ను సమర్పించేవారు. ప్రస్తుతం అమలు చేయనున్న విధానంలో మాత్రం 5 వేల బాండ్ ఆప్షన్‌ను అమెరికా తొలగించింది. అంతేకాకుండా, గరిష్ఠ బాండ్ పరిమితిని 20 వేల డాలర్లకు పెంచింది. ఏడాది పాటు పైలట్ ప్రాజెక్టు ఫలితాలను పరిశీలించిన అనంతరం ఈ విధానాన్ని శాశ్వతంగా కొనసాగించేందుకు అమెరికా విదేశాంగ శాఖ నిర్ణయించింది. ఆగస్టు 3 నుంచి ఇది అమల్లోకి రానుంది. మొత్తం 50 దేశాల వారికి ఈ బాండ్ విధానం వర్తిస్తుందని అమెరికా తెలిపింది. అయితే, ఈ జాబితాలో భారత్ లేకపోవడంతో ఇండియన్స్‌కు ఉపశమనం దక్కింది. అయితే, ఈ విధానాన్ని వలసదారుల హక్కుల కార్యకర్తలు, సంస్థలు మాత్రం విమర్శిస్తున్నాయి. బాండ్ భారంగా మారి అర్హులైన వారు అమెరికాకు దూరమయ్యే అవకాశం ఉందని హెచ్చరిస్తున్నాయి.

## గ్రీన్ కారిడార్‌గా ఉపయోగపడ్డ మెట్రో

కోసం దాత నుంచి సేకరించిన గుండె, ఊపిరితిత్తులను సురక్షితంగా , వేగంగా ఆసుపత్రికి తరలించేందుకు ప్రత్యేక 'గ్రీన్ కారిడార్'గా మారింది. గచ్చిబౌలిలోని కేర్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న దాత నుంచి సేకరించిన గుండె , ఊపిరితిత్తులను సికింద్రాబాద్ పరిధిలోని కిమ్స్ ఆసుపత్రికి అత్యవసరంగా తరలించాల్సి వచ్చింది. రోడ్డు మార్గంలో వెళ్తే ట్రాఫిక్ సమస్యల వల్ల సమయం వృథా అయ్యే ప్రమాదం ఉండటంతో వైద్యులు మెట్రో అధికారులను ఆశ్రయించారు. వెంటనే స్పందించిన హైదరాబాద్ మెట్రో అధికారులు రాయదుర్గ్ మెట్రో స్టేషన్ నుంచి రసూల్‌పురా వరకు ప్రత్యేకంగా మెట్రో ట్రాన్సిట్‌ను ఏర్పాటు చేశారు. మార్గమధ్యలో ఉన్న 13 స్టేషన్లను దాటుకుంటూ, కేవలం 25 నిమిషాల్లోనే 14 కిలోమీటర్ల దూరాన్ని అత్యంత వేగంగా పూర్తి చేసి



అవయవాలను సురక్షితంగా చేర్చారు. అవయవ మార్పిడి చికిత్సల్లో ప్రతి నిమిషం ఎంతో విలువైనది. ఈ విషయాన్ని గుర్తించిన వైద్య బృందాలు , మెట్రో సిబ్బంది పరస్పరం పూర్తి సమన్వయంతో వ్యవహరించి ఈ మిషన్‌ను విజయవంతం చేశారు. ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బంది కలగకుండా, అదే సమయంలో అత్యవసర అవయవాల రవాణాకు ఎలాంటి అంతరాయం కలగకుండా అధికారులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. సరైన సమయానికి డోనర్ అవయవాలు కిమ్స్ ఆసుపత్రికి చేరడంతో బాధితుడికి అవయవ మార్పిడి శస్త్రచికిత్సను విజయవంతంగా నిర్వహించేందుకు మార్గం సుగమమైంది. అత్యవసర వైద్య సేవలకు నిరంతరం అండగా నిలుస్తున్న హైదరాబాద్ మెట్రో సేవలకు నగరవాసుల నుంచి, వైద్య వర్గాల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి. నిమిషాల విలువను గుర్తించి, కచ్చితమైన ప్రణాళికతో సమయానికి అవయవాలను చేర్చి ఒక ప్రాణాన్ని నిలబెట్టడంలో మెట్రో పోషించిన పాత్ర ప్రశంసనీయం. వేగవంతమైన ప్రయాణానికే కాదు, మానవతా దృక్పథంతో ప్రాణాలు కాపాడటంలోనూ తాను ఎప్పుడూ ముందే ఉంటానని హైదరాబాద్ మెట్రో మరోసారి నిరూపించింది.

## పేపర్ లీకేజీ బిల్లుకు చట్టబద్ధత

2026' పేరుతో రూపొందిన ఈ బిల్లును ఈ వారంలోనే పార్లమెంట్ ఆమోదించింది. అటు లోక్‌సభలో చర్చ అనంతరం ఆమోదం పొందగా, మరుసటి రోజు రాజ్యసభలో కూడా ఆమోదం లభించింది. దీంతో వెంటనే ఈ బిల్లు ఆమోదం కోసం రాష్ట్రపతి ద్రౌపది ముర్ము వద్దకు పంపింది ప్రభుత్వం. ఇటీవల నీట్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా సీజేపీ ఆధ్వర్యంలో ఢిల్లీలో జరిగిన ఆందోళన గురించి తెలిసిందే. ఈ ఉద్యమం నేపథ్యంలో కేంద్రం పేపర్ లీకేజీలను అరికట్టేలా కొత్త బిల్లును తీసుకొచ్చింది. ఇదే అంశంలో 2024లో తెచ్చిన బిల్లుకు సవరణలు తెస్తూ కొత్త బిల్లును ప్రవేశపెట్టింది.

**CHANGE OF NAME**

I, **SAWAPURE PRANEETH S/O SAWAPURE VIJAY KUMAR** (Old Name) born on 04-03-1995 at sawapur earlier was holding passport no. **N5994389** DT: 18-12-2015 hereby changing my name and henceforth in future I would be known as **SAWAPURE PRANEETH KUMAR S/O SAWAPURE VIJAY KUMAR** (New name) HNo. 2-54 SAWAPUR, Dist. Adilabad 504309 Telangana.

**DECLARANT.**

**Place: SAWAPUR**
**Date: 01-08-2026**

**SAWAPURE PRANEETH KUMAR S/O SAWAPURE VIJAY KUMAR**

## మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- రూ. 10 లక్షలతో మండలంలోనే తొలి భవనం నిర్మించడం అభినందనీయం
- అభివృద్ధి పనుల్లో సవర్గావ్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి



**నేరడిగొండ ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) :** మండలంలోని సవర్గావ్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని శనివారం బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... నేరడిగొండ మండలంలోనే మొట్టమొదటి మహిళా సంఘ భవనం సవర్గావ్ గ్రామంలోనే పూర్తికావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, చురుకైన సర్పంచులు ఉన్నప్పుడే గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసుకోవడంలో ఇతర గ్రామాలు సవర్గావ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మండలంలో నిలిచిపోయిన మిగతా సమాఖ్య భవనాల నిర్మాణాలను కూడా రానున్న రోజుల్లో త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు. భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామంలోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## బాలల భద్రతే 'ఆపరేషన్ ముస్కాన్' లక్ష్యం

- పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా










**మంచిర్యాల, 1,ఆగస్టు (ప్రజాజ్యోతి) :** బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనతో పాటు పిల్లల భద్రతను పరిరక్షించడమే 'ఆపరేషన్ ముస్కాన్' ప్రధాన లక్ష్యమని రామగుండం పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా తెలిపారు. ప్రతి ఏడాది రెండుసార్లు నిర్వహించే ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాల ద్వారా తప్పిపోయిన, వదిలివేయబడిన, బాల కార్మికులుగా పనిచేస్తున్న చిన్నారులను గుర్తించి రక్షించి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ నిర్వహించి అప్పగించడం లేదా అవసరమైతే బాలల సంరక్షణ గృహాలకు తరలిస్తున్నట్లు తెలిపారు . జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రామగుండం పోలీస్ కమిషనరేట్ పరిధిలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్--XII కార్యక్రమాన్ని పెద్దపల్లి, మంచిర్యాల జిల్లాల పోలీసు అధికారులు, సిబ్బంది, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, కార్మిక శాఖ, విద్యాశాఖ, బాలల సంరక్షణ శాఖ, వైద్య ఆరోగ్య శాఖ తదితర ప్రభుత్వ విభాగాల సమన్వయంతో విజయవంతంగా నిర్వహించినట్లు తెలిపారు .ఈ కార్యక్రమం కోసం కమిషనరేట్ పరిధిలోని ప్రతి డివిజన్‌కు ఒక ఎస్ఐతో పాటు నలుగురు పోలీసు సిబ్బందితో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, ప్రభుత్వేతర స్వచ్ఛంద సంస్థల సహకారంతో హోటళ్లు, మెకానిక్ షాపులు, కిరాణా దుకాణాలు, పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, రోడ్లపై భిక్షాటన చేస్తున్న బాలలను గుర్తించేందుకు విస్తృత స్థాయిలో తనిఖీలు చేపట్టినట్లు తెలిపారు. ఆపరేషన్ ముస్కాన్--శ××లో కమిషనరేట్ వ్యాప్తంగా మొత్తం 278 మంది బాలబాలికలను రక్షించారు. ఇందులో పెద్దపల్లి జిల్లా పరిధిలో 130 మంది బాలురు, 21 మంది బాలికలు కలిపి 151 మంది బాలలను గుర్తించి రక్షించగా, 11 కేసులు నమోదు చేసి 12 మందిని అరెస్టు చేశారు. మంచిర్యాల జిల్లా పరిధిలో 102 మంది బాలురు, 25 మంది బాలికలు కలిపి 127 మంది బాలలను రక్షించగా, 6 కేసులు నమోదు చేసి 7 మందిని అరెస్టు చేసినట్లు వివరించారు. బాలల హక్కులను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా పేర్కొన్నారు. బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ బాధ్యతాయుతంగా కృషి చేయాలని పిలుపునిచ్చారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం ఆపరేషన్ స్మైల్, ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తామని తెలిపారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్నట్లు, బాల కార్మికులుగా పనిచేయిస్తున్నట్లు లేదా తప్పిపోయిన, వదిలివేయబడిన బాలల సమాచారం తెలిసిన వెంటనే చైల్డ్ హెల్ప్‌లైన్--1098 లేదా డయల్--100కు సమాచారం అందించాలని ప్రజలను కోరారు. బాల కార్మికులను నియమించిన వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆపరేషన్ ముస్కాన్--శ×× విజయవంతానికి సహకరించిన వివిధ ప్రభుత్వ శాఖల అధికారులు, సిబ్బంది, పోలీసు సిబ్బందిని పోలీస్ కమిషనర్ అభినందించారు.

## ఫీజుల బకాయిలు, స్కాలర్‌షిప్‌ల విడుదల వరకు పోరాటం కొనసాగుతుంది

బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ





**మంచిర్యాల, 1,ఆగస్టు (ప్రజాజ్యోతి) :** బీజేవైఎం రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు, బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్ సూచనలతో శనివారం మంచిర్యాల జిల్లా కేంద్రంలోని పలు డిగ్రీ కళాశాలల్లో "ఫీజుల బకాయి -- బీజేపీ లడాయి" కార్యక్రమాన్ని బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు శివకృష్ణ ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి సంతకాల సేకరణ (సిగ్నేచర్ క్యాంపెయిన్) చేపట్టి, ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా శివకృష్ణ మాట్లాడుతూ, రాష్ట్రంలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నప్పటికీ ప్రభుత్వం వారి సమస్యలను పట్టించుకోవడం లేదని విమర్శించారు. పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ నిధులను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థులను అవమానించేలా ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు బాధాకరమని పేర్కొంటూ, విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వానికి యువత తగిన సమయంలో గుణపాఠం చెబుతుందని అన్నారు. స్కాలర్‌షిప్ నిధులు పూర్తిగా విడుదలయ్యే వరకు భారతీయ జనతా యువమోర్చా ఆధ్వర్యంలో రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు కొనసాగుతాయని తెలిపారు. విద్యార్థుల హక్కుల సాధన కోసం బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు రఘునాథ్, జిల్లా అధ్యక్షులు వెంకటేశ్వర్ గౌడ్ నాయకత్వంలో చేపట్టే ప్రతి కార్యక్రమానికి విద్యార్థులు, యువత పెద్ద ఎత్తున మద్దతు ఇవ్వాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మంచిర్యాల కార్పొరేషన్ జోనల్ అధ్యక్షులు రాజు, స్వామిరెడ్డి, చక్రి, బీజేవైఎం నాయకులు అశోక్, సాయి, వెంకటేష్, రవీందర్, విష్ణు, సాయికృష్ణ, సీనియర్ నాయకులు దేవేందర్, ప్రవీణ్, శివ తదితరులు పాల్గొన్నారు. కార్యక్రమం ముగింపులో కార్యకర్తలు "భారత్ మాతాకీ జై" నినాదాలతో తమ నిరసనను వ్యక్తం చేశారు.

# ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో బిఆర్ఎస్‌లో చేరిన కుంటాల (బి)సర్పంచ్, గ్రామస్తులు





**నేరడిగొండ ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) :** మండలంలోని కుంటాల (బి) గ్రామ సర్పంచ్ గంగారాంతో పాటు పలువురు గ్రామస్తులు శనివారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ సమక్షంలో తిరిగి బీఆర్ఎస్ పార్టీలో చేరారు. ఎమ్మెల్యే అనిల్ జాదవ్ వారికి గులాబీ కండువాలు కప్పి, సాధరంగా పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గంగారాం మాట్లాడుతూ... "గతంలో వేరే పార్టీలో చేరి పొరపాటు చేశాం. మా గ్రామాభివృద్ధికి నిరంతరం శ్రమిస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్ తో కలిసి నడవడమే సరైన నిర్ణయమని భావించాం. గ్రామ పెద్దలతో చర్చించిన అనంతరమే మళ్లీ బిఆర్ఎస్ పార్టీలో చేరడం జరిగింది" అని తెలిపారు. గ్రామాభివృద్ధి ఒక్క అనిల్ జాదవ్ తోనే సాధ్యమవుతుందని గ్రామస్తులు స్పష్టం చేశారు.

**ఎల్లప్పుడూ మీకు అండగా ఉంటా - ఎమ్మెల్యే అనిల్ జాదవ్ :**

పార్టీలోకి ఆహ్వానించిన అనంతరం ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... "గిరిజన గ్రామాల సమగ్ర అభివృద్ధికి నేను ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటాను. ఈ మండల వాసిగా, మీ ఇంటి బిడ్డగా నిరంతరం మీ శ్రేయస్సు కోసమే పనిచేస్తాను. గ్రామంలో ఎలాంటి సమస్య వచ్చినా నేరుగా నన్ను కలవవచ్చు, మీకు ఎల్లవేళలా అండగా ఉంటాను" అని ధైర్యాన్నిచ్చారు. ఈ కార్యక్రమంలో మండల స్థాయి నాయకులు, ప్రజాప్రతినిధులు మరియు కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## మహిళా సమాఖ్య భవనాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే అనిల్ జాదవ్

- రూ. 10 లక్షలతో మండలంలోనే తొలి భవనం నిర్మించడం అభినందనీయం
- అభివృద్ధి పనుల్లో సవర్గావ్ గ్రామాన్ని ఆదర్శంగా తీసుకోవాలి





**నేరడిగొండ ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) :** మండలంలోని సవర్గావ్ గ్రామంలో రూ. 10 లక్షల వ్యయంతో నూతనంగా నిర్మించిన మహిళా సమాఖ్య భవనాన్ని శనివారం బోథ్ శాసనసభ్యులు అనిల్ జాదవ్ ముఖ్యఅతిథిగా హాజరై రిబ్బన్ కట్ చేసి ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే అనిల్ జాదవ్ మాట్లాడుతూ... నేరడిగొండ మండలంలోనే మొట్టమొదటి మహిళా సంఘ భవనం సవర్గావ్ గ్రామంలోనే పూర్తికావడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు. గ్రామాభివృద్ధిలో సర్పంచుల పాత్ర కీలకమని, చురుకైన సర్పంచులు ఉన్నప్పుడే గ్రామాలు శరవేగంగా అభివృద్ధి చెందుతాయని అన్నారు. అభివృద్ధి పనులు వేగవంతంగా పూర్తి చేసుకోవడంలో ఇతర గ్రామాలు సవర్గావ్‌ను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. మండలంలో నిలిచిపోయిన మిగతా సమాఖ్య భవనాల నిర్మాణాలను కూడా రానున్న రోజుల్లో త్వరితగతిన పూర్తి చేసేందుకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.

భూగర్భ జలాల పరిరక్షణకు ప్రతీ ఒక్కరూ భాగస్వాములు కావాలని, గ్రామంలోని ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఇంకుడు గుంతలను నిర్మించుకోవాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో ఆయా గ్రామాల సర్పంచులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వివిధ పార్టీల నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘాల ప్రతినిధులు మరియు గ్రామస్థులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# భవిష్యత్ అవసరాలకు నీటిని నిల్వ చేయాలి









- కడెం ప్రాజెక్టును పరిశీలించిన రాష్ట్ర మంత్రుల బృందం

**కడెం, ఆగస్టు 1(ప్రజా జ్యోతి) :** భవిష్యత్తు తాగునీరు, సాగునీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని ప్రాజెక్టుల్లో నీటిని ప్రణాళికాబద్ధంగా నిల్వ చేయాలని రాష్ట్ర నీటిపారుదల, పౌరసరఫరాల శాఖ మంత్రి ఎన్ ఉత్తమ్ కుమార్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల నేపథ్యంలో ప్రాజెక్టుల పరిస్థితిని సమీక్షించేందుకు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి, ఐటీ శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు, కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్ వెంకటస్వామిలతో కూడిన మంత్రుల బృందం శనివారం కడెం ప్రాజెక్టును సందర్శించింది. ప్రాజెక్టు వద్ద ఏర్పాటు చేసిన ఎల్ఈడీ తెరపై అధికారులు పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పూర్తి స్థాయి నీటిమట్టం(ఎఫ్ఆర్ఎల్),ప్రస్తుత ఇన్‌ఫ్లో, ఔట్‌ఫ్లో, గేట్ల ద్వారా దిగువకు విడుదల చేస్తున్న నీటి పరిమాణం, ప్రస్తుత పరిస్థితులను మంత్రులకు వివరించారు. భవిష్యత్తులో తాగునీరు, సాగునీటి అవసరాలపై కూడా సమగ్ర సమాచారం అందించారు.

ఈ సందర్భంగా మంత్రులు మాట్లాడుతూ, ఎల్‌నినో ప్రభావం, భవిష్యత్తు నీటి అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి నిర్వహణకు శాస్త్రీయ విధానాన్ని అనుసరించాలని సూచించారు. ప్రజలకు ఎట్టి పరిస్థితుల్లోనూ తాగునీటి ఇబ్బందులు తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రాజెక్టుల నీటిమట్టాలు, పరిస్థితులను ప్రభుత్వం నిరంతరం సమీక్షిస్తుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ భవేష్ మిశ్రా కడెం ప్రాజెక్టు ప్రస్తుత పరిస్థితి, నీటిమట్టం, నీటి నిల్వ సామర్థ్యం, సిల్టేషన్ సమస్యలు, నీటి పారుదల నిర్వహణపై మంత్రులకు వివరించారు. భవిష్యత్తు అవసరాలను దృష్టిలో ఉంచుకొని నీటి వినియోగాన్ని శాస్త్రీయంగా నిర్వహిస్తూ సాగునీటి అవసరాలను తీర్చేందుకు చర్యలు చేపడుతున్నామని తెలిపారు.

ప్రాజెక్టులో సిల్టేషన్ ప్రధాన సమస్యగా మారిందని, సుమారు 7.5 టీఎంసీల సామర్థ్యం కలిగిన ప్రాజెక్టులో దాదాపు 50 శాతం వరకు పూడిక పేరుకుపోయినట్లు వివరించారు. దీనివల్ల నిల్వ సామర్థ్యం తగ్గుతున్న నేపథ్యంలో సమస్య పరిష్కారానికి దీర్ఘకాలిక కార్యాచరణ రూపొందిస్తున్నామని తెలిపారు. నీటిమట్టం 674--675 మీటర్లకు చేరినప్పుడు పరిస్థితులకు అనుగుణంగా ప్రత్యామ్నాయ రోజుల్లో నీటి విడుదల చేపట్టే విధంగా ప్రణాళిక సిద్ధం చేసినట్లు చెప్పారు. పూడిక సమస్యను దశలవారీగా తగ్గించి ప్రాజెక్టు నిల్వ సామర్థ్యాన్ని పెంచేందుకు అవసరమైన సాంకేతిక చర్యలు చేపడుతున్నామని కలెక్టర్ పేర్కొన్నారు.

ఈ పర్యటనలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, జగిత్యాల ఎమ్మెల్యే డాక్టర్ సంజయ్ కుమార్, జిల్లా ఎస్పీ జానకి షర్మిల, అదనపు కలెక్టర్లు బి.వెంకటేశ్వర్లు, కిషోర్ కుమార్, ఏఎస్పీ సాయి కిరణ్, ప్రజాప్రతినిధులు, ఇరిగేషన్ శాఖ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# జెన్‌కోను వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకోండి..

- పీకే-2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలి
- సింగరేణి మనుగడ, కార్మికుల ఉపాధి, తెలంగాణ ప్రయోజనాల పరిరక్షణే ప్రభుత్వ బాధ్యత
- ఏఐటీయూసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్




**మంచిర్యాల, 1,ఆగస్టు (ప్రజాజ్యోతి) :** మణుగూరు పీకే--2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణి సంస్థకే కేటాయించాలని, జెన్‌కోను వేలంపాట (ఆక్షన్) ప్రక్రియలో పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వం తక్షణ చర్యలు తీసుకోవాలని ఏఐటీయూసీ గుర్తింపు సంఘం అధ్యక్షుడు వాసిరెడ్డి సీతారామయ్య, ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్‌కుమార్ డిమాండ్ చేశారు. హైదరాబాదులోని ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏఐటీయూసీ గుర్తింపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఈ సందర్భంగా సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి, కొత్తగూడెం ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు రాష్ట్ర ప్రభుత్వానికి రాసిన లేఖలు సింగరేణి కార్మికుల ఆకాంక్షలను ప్రతిబింబిస్తున్నాయని పేర్కొన్నారు. సింగరేణి సంస్థ భవిష్యత్తును దృష్టిలో పెట్టుకుని రాష్ట్ర ప్రభుత్వం వెంటనే సానుకూల నిర్ణయం తీసుకుని పీకే--2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించాలని కోరారు. మణుగూరు పీకే--2 డీప్ సైడ్ బ్లాక్ సింగరేణి మనుగడకు అత్యంత కీలకమైన బొగ్గు నిల్వల ప్రాంతమని, వేలాది మంది కార్మికుల ఉపాధి, భద్రత, భవిష్యత్తు ఈ బ్లాక్‌పైనే ఆధారపడి ఉందని తెలిపారు. ఈ బ్లాక్‌ను సింగరేణికి ఇవ్వకుండా ఇతర సంస్థలకు అవకాశాలు కల్పించడం తెలంగాణ ప్రజల ప్రయోజనాలకు, కార్మికుల సంక్షేమానికి తీవ్ర విరుద్ధమని స్పష్టం చేశారు. ముఖ్యంగా జెన్‌కోను వేలంపాట (ఆక్షన్) ప్రక్రియలో పాల్గొనకుండా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు తీసుకోవాలని వారు ఘాటుగా డిమాండ్ చేశారు. జెన్‌కో పేరుతో వేలంపాటలో ప్రవేశపెట్టి చివరకు ప్రైవేట్ కంపెనీలకు మార్గం సుగమం చేసే కుట్రలను ఏఐటీయూసీ ఎట్టి పరిస్థితుల్లోనూ సహించదని హెచ్చరించారు. పీకే--2 డీప్ సైడ్ బ్లాక్‌ను నేరుగా సింగరేణికే కేటాయించేలా ప్రభుత్వం కృషి చేయాలని కోరారు. ఒకవైపు సింగరేణిని బలోపేతం చేస్తామని చెబుతూ, మరోవైపు కీలక బొగ్గు బ్లాక్‌ల విషయంలో అనిశ్చితి సృష్టించడం ప్రభుత్వ ద్వంద్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. సింగరేణి సంస్థకు తగినంత బొగ్గు నిల్వలు లేకుంటే భవిష్యత్తులో బొగ్గు ఉత్పత్తి తగ్గిపోవడంతో పాటు వేలాది మంది కార్మికుల ఉపాధి ప్రమాదంలో పడే పరిస్థితి ఏర్పడుతుందని, తెలంగాణ ఆర్థిక వ్యవస్థపై కూడా తీవ్ర ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి, ఎమ్మెల్యే కూనంనేని సాంబశివరావు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లిన అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, పీకే--2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికి కేటాయించేలా ప్రభుత్వం తక్షణ నిర్ణయం తీసుకోవాలని వారు కోరారు. కార్మికుల, ప్రజల, తెలంగాణ ప్రయోజనాలను కాపాడే బాధ్యత రాష్ట్ర ప్రభుత్వంపైనే ఉందన్నారు. సింగరేణి సంస్థను బలహీనపరిచే ఎలాంటి చర్యలనైనా ఏఐటీయూసీ తీవ్రంగా వ్యతిరేకిస్తుందని, అవసరమైతే కార్మికులతో కలిసి ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సింగరేణి హక్కులను కాపాడేందుకు అన్ని ప్రజాస్వామ్య పద్ధతుల్లో పోరాటాన్ని విస్తరించేందుకు సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. చివరగా జెన్‌కోను వేలంపాటలో పాల్గొనకుండా అడ్డుకుని, మణుగూరు పీకే--2 డీప్ సైడ్ బ్లాక్‌ను సింగరేణికే కేటాయించేలా రాష్ట్ర ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టాలని వాసిరెడ్డి సీతారామయ్య, కొరిమి రాజ్‌కుమార్ ప్రభుత్వాన్ని గట్టిగా డిమాండ్ చేశారు. "సేవ్ సింగరేణి - సేవ్ మణుగూరు" నినాదంతో కార్మికుల హక్కులు, సింగరేణి భవిష్యత్తు పరిరక్షణ కోసం పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ విలేకరుల సమావేశంలో ఆళవందార్ వేణుమాధవ్, ఏఐటీయూసీ నాయకులు కె. వెంకటేష్, రాష్ట్ర ఆటో వర్కర్స్ యూనియన్ ప్రధాన కార్యదర్శి ఎస్. నర్సింగ్ రావు, కె.బీరయ్య, ఏ.ప్రభాకర్, ఎం.రాజనర్సు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ఆటో డ్రైవర్ల దినోత్సవం

ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసం ప్రత్యేక చర్యలు తీసుకోవాలి

**నేరడిగొండ, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) :** ప్రపంచ ఆటో డ్రైవర్ల దినోత్స వాన్ని పురస్కరించుకుని శనివారం రోజున మండలంలోని కుప్టి, కుమారి, తర్నం గ్రామాలకు చెందిన ఆటో డ్రైవర్లు కుప్టి బస్టాండ్ ఆవరణలో వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆటో డ్రైవర్లు మాట్లాడుతూ... ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉచిత బస్సు ప్రయాణ పథకం వల్ల తాము తీవ్రంగా నష్టపోతున్నామని తమ ఆవేదన వ్యక్తం చేశారు. నిత్యం ప్రయాణికులు లేక జీవనోపాధి కోల్పోయి ఆర్థికంగా చితికిపోతున్నామని ఆవేదన చెందారు. ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి తమ ఇబ్బందు లను గుర్తించాలని, ఆటో డ్రైవర్ల సంక్షేమానికి తగిన న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆటో డ్రైవర్లు ఓరగంటి సాయిలు, అగ్గిమల్ల భూమేష్, అత్రం శ్రీనివాస్, సాట్ల భూమేష్, ఇట్టపురపు సాయికిరణ్, చాకలి మహేష్, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాలు బిడ్డకు అమృతంతో సమానం



**జన్నారం, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి) :** తల్లిపాలు పుట్టిన పిల్లలకు అమృతంతో సమానమని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం హెల్త్ అసిస్టెంట్ కొల్లూరి కమలాకర్ అన్నారు. జన్నారం మండలంలోని రాంపూర్ గ్రామంలో శనివారం రోజున తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లిపాలు బిడ్డకు వ్యాధి నిరోక శక్తి పెంచుతుందని, నిమోనియా, నీళ్ల విరోచనాలు వ్యాధులకు గురి కాకుండా, తల్లి బిడ్డల అనుబంధం పెరుగుతుందని, పిల్లలలో భద్రతాభావం పెరుగుతుందని అన్నారు. తల్లులు బిడ్డలకు పాలు ఇవ్వడం వలన గర్భాశయ క్యాన్సర్,రొమ్ము క్యాన్సర్ రాకుండా కాపాడుతుందని, ప్రసవానంతరం వెంటనే రక్తస్రావం తగ్గడానికి, గర్భాశయం సాధారణ స్థితికి రావడానికి మరియు వెంటనే గర్భం దాల్చకుండా తాత్కాలిక కుటుంబ నియంత్రణ విధానంగా పనిచేస్తుందని కావున తల్లులు తమ పిల్లలకు ఆరు నెలల వరకు తప్పకుండా పాలు ఇవ్వాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ నూతి రామయ్య, ఉపసర్పంచ్ వెంకటేష్, పంచాయతీ సెక్రెటరీ రమేష్, హెల్త్ అసిస్టెంట్ మాధవి, ఆశా కార్యకర్తలు రాజమణి, వసంత అంగన్వాడీ కార్యకర్తలు సంధ్యారాణి, విజయ, సుశీల గ్రామస్తులు పాల్గొన్నారు.

## బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలి

జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య










**మంచిర్యాల, 1,ఆగస్టు (ప్రజాజ్యోతి) :** బాలల హక్కుల పరిరక్షణపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని జిల్లా ప్రధాన న్యాయమూర్తి, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ చైర్మన్ వీరయ్య అన్నారు. శనివారం జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సమావేశ మందిరంలో జిల్లా న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో బాలల హక్కుల పరిరక్షణ, పోక్సో చట్టంపై ఒకరోజు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్, డి.సి.పి. ఎ. భాస్కర్, జిల్లా అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) పి. చంద్రయ్య, జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి రామ్ మోహన్ రెడ్డి, అదనపు జూనియర్ సివిల్ జడ్జి కె. నిరోషా, స్పెషల్ జ్యుడీషియల్ మేజిస్ట్రేట్ (ఎక్సైజ్) బి. కృష్ణ తేజ, జిల్లా సంక్షేమ శాఖ అధికారి రౌఫ్ ఖాన్, మంచిర్యాల బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొత్త సత్తయ్య తదితరులు హాజరయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ప్రధాన న్యాయమూర్తి వీరయ్య మాట్లాడుతూ, రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో ప్రభుత్వ పాఠశాలల్లో బాలల హక్కుల పరిరక్షణ అధికారులను నియమించామని తెలిపారు. ప్రస్తుత సమాజంలో విపరీతమైన పోకడలు, సోషల్ మీడియా ప్రభావంతో చిన్నారులు చిన్న వయసులోనే దారి తప్పే పరిస్థితులు ఏర్పడుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పిల్లలకు వారి హక్కులు, చట్టాలపై అవగాహన కల్పించడంతో పాటు చెడు వ్యసనాల వల్ల కలిగే దుష్పరిణామాలను వివరించాలని సూచించారు. సమాజం పట్ల బాధ్యతలను చిన్నప్పటి నుంచే పిల్లలకు నేర్పించాలని, సమ సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర అనిర్వచనీయమని అన్నారు. విద్యార్థులు మద్యపానం, మత్తు పదార్థాలకు బానిస కాకుండా ఉపాధ్యాయులు, అధ్యాపకులు బాధ్యతగా వారిని సన్మార్గంలో నడిపించాలని ఆయన సూచించారు. బాలల హక్కుల పరిరక్షణ కోసం స్పెషల్ జువైనల్ పోలీస్ యూనిట్ అందుబాటులో ఉంటుందని తెలిపారు. జిల్లా కలెక్టర్ కుమార్ దీపక్ మాట్లాడుతూ, చిన్నతనం నుంచే పిల్లలకు మంచి అలవాట్లు నేర్పించాల్సిన అవసరం ఉందన్నారు. గుడ్ టచ్--బ్యాడ్ టచ్ గురించి ప్రతి చిన్నారికి అవగాహన కల్పించాలని సూచించారు. పిల్లలకు వారి హక్కులు, జువైనల్ జస్టిస్ (జె.జె.), పోక్సో చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని, బాల కార్మికులను గుర్తించి రక్షించి వారికి నిర్బంధ విద్య అందిస్తున్నామని తెలిపారు. లైంగిక వేధింపులు, దాడులకు గురైన బాధితులను గుర్తించడం, వారికి చట్టపరమైన సహాయం అందించడం, నిందితులపై కేసులు నమోదు చేయడంపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు తెలిపారు .డి.సి.పి. ఎ. భాస్కర్ మాట్లాడుతూ, దేశ భవిష్యత్తు తరగతి గదిలోనే నిర్మితమవుతుందని పేర్కొన్నారు. బాలల హక్కుల పరిరక్షణను ప్రతి ఒక్కరూ బాధ్యతగా తీసుకోవాలని, ఉపాధ్యాయులు విద్యార్థులను సన్మార్గంలో నడిపించేందుకు కృషి చేయాలని సూచించారు. షీ టీమ్స్ ఆధ్వర్యంలో బాలికలకు చట్టాలపై అవగాహన కల్పిస్తున్నామని, భరోసా కేంద్రాల ద్వారా బాధితులకు న్యాయం అందిస్తున్నామని తెలిపారు. సోషల్ మీడియాలో వచ్చే అసాంఘిక అంశాల నుంచి పిల్లలను దూరంగా ఉంచేందుకు తల్లిదండ్రులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారులు, బాలల హక్కుల పరిరక్షణ సమితి అధికారులు, వివిధ శాఖల అధికారులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# "అనుమతి లేని సభలకు చెక్.. నెలరోజులు 30 పోలీస్ యాక్ట్!"

- ఆగస్టు 31 వరకు 30 పోలీస్ యాక్ట్ అమలు
- నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన కఠిన చర్యలు: ఎస్పీ సునితారెడ్డి



వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి): జిల్లాలో శాంతిభద్రతల పరిరక్షణే లక్ష్యంగా ఆగస్టు 1 నుంచి 31 వరకు 30 పోలీస్ యాక్ట్–1861 అమల్లో ఉంటుందని జిల్లా ఎస్పీ సునితారెడ్డి తెలిపారు. ముందస్తు పోలీసు అనుమతి లేకుండా బహిరంగ సభలు, ర్యాలీలు, ధర్నాలు, నిరసనలు, ఊరేగింపులు, భారీ సమావేశాలు నిర్వహించరాదని స్పష్టం చేశారు. ప్రజల సాధారణ జీవనానికి అంతరాయం కలగకుండా, అవాంఛనీయ సంఘటనలను నివారించేందుకు ఈ చర్యలు చేపట్టినట్లు పేర్కొన్నారు. నిబంధనలను ఉల్లంఘించే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఏ సంస్థ, సంఘం లేదా వ్యక్తి బహిరంగ కార్యక్రమాలు నిర్వహించాలనుకుంటే సంబంధిత పోలీసు అధికారుల నుంచి ముందస్తు అనుమతి తప్పనిసరిగా పొందాలని సూచించారు. చట్టాలను గౌరవించడం ప్రతి పౌరుడి బాధ్యత అని, ప్రజల సహకారంతోనే జిల్లాలో ప్రశాంత వాతావరణాన్ని మరింత బలోపేతం చేయగలమని ఎస్పీ పేర్కొన్నారు.

# రూ.3.40 కోట్ల పనులకు శ్రీకారం

- ఏదులలో తహసీల్దార్ భవనం..
- రేవల్లిలో ఎక్స్‌రే యూనిట్ ప్రారంభం: ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి): గ్రామాల సమగ్రాభివృద్ధే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి అన్నారు. శనివారం ఏదుల, రేవల్లి మండలాల్లో రూ.3.40 కోట్ల విలువైన పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు,



ప్రారంభోత్సవాలు నిర్వహించారు. ఏదుల మండల కేంద్రంలో రూ.2.25 కోట్ల వ్యయంతో నిర్మించనున్న నూతన తహసీల్దార్ కార్యాలయ భవన సముదాయానికి ఎమ్మెల్యే శంకుస్థాపన చేశారు. దీంతో రెవెన్యూ సేవలు ప్రజలకు మరింత వేగంగా అందుబాటులోకి వస్తాయని తెలిపారు. అనంతరం రూ.65 లక్షలతో ఆల్టర్నేట్ విద్యుత్ లైన్ పనులు, రూ.24 లక్షలతో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధి పనులకు శ్రీకారం చుట్టారు. గ్రామ పారిశుద్ధ్యాన్ని మెరుగుపర్చేందుకు రూ.8 లక్షలతో అండర్ డ్రైనేజీ నిర్మాణ పనులకు కూడా శంకుస్థాపన చేశారు. రేవల్లి కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో రూ.18 లక్షలతో ఏర్పాటు చేసిన అత్యాధునిక ఎక్స్‌రే యూనిట్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. దీంతో గ్రామీణ ప్రజలకు స్థానికంగానే మెరుగైన వైద్య నిర్ధారణ సేవలు అందుబాటులోకి వస్తాయని, జిల్లా కేంద్రానికి వెళ్లాల్సిన అవసరం తగ్గుతుందని చెప్పారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ విద్యుత్, వైద్యం, ప్రభుత్వ కార్యాలయాలు, మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యం ఇస్తోందన్నారు. పారదర్శక పాలనతో ప్రతి రూపాయి ప్రజల సంక్షేమం, అభివృద్ధికే ఖర్చు చేస్తున్నామని పేర్కొన్నారు. వనపర్తి నియోజకవర్గంలోని ప్రతి గ్రామాన్ని అన్ని రంగాల్లో ఆదర్శంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని, ఇచ్చిన హామీలను దశలవారీగా అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ అధ్యక్షుడు వెంకటేష్, ఉపాధ్యక్షుడు సత్యశీలారెడ్డి, ఆర్డీవో సుబ్రహ్మణ్యం, జిల్లా గృహనిర్మాణశాఖ అధికారి విటోబా, సింగిల్ విండో అధ్యక్షుడు రఘు, మండల అధ్యక్షుడు సుఖేందర్ రెడ్డి, సర్పంచ్ పరుశురాం, కొంకి వెంకటేష్, కోళ్ల వెంకటేష్ తదితర ప్రజాప్రతినిధులు, అధికారులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# తెలంగాణలో జనసేన బలోపేతమే లక్ష్యం..

## – పాలమూరులో పార్టీ భారీ శక్తి ప్రదర్శన

మహబూబ్‌నగర్, ఆగస్టు 1 ( ప్రజా జ్యోతి బ్యూరో ): తెలంగాణలో జనసేన పార్టీని క్షేత్రస్థాయి నుంచి బలోపేతం చేసి ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా తీర్చిదిద్దడమే తమ ప్రధాన లక్ష్యమని పార్టీ ప్రధాన కార్యదర్శి తాళ్లూరి రామ్ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా భూత్‌పూర్ రోడ్డులోని ఏ ఎస్.ఎన్. కన్వెన్షన్ హాల్‌లో






శనివారం నిర్వహించిన మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థాయి కార్యకర్తల ఆత్మీయ సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. జిల్లా ఇన్‌చార్జ్ మేడ రామకృష్ణ నాయకత్వంలో పాలమూరులో పార్టీ బలోపేతానికి జరుగుతున్న కృషిని తాళ్లూరి రామ్ ప్రత్యేకంగా అభినందించారు. పార్టీ ఆవిర్భావం నుంచి సిద్ధాంతాలకు కట్టుబడి పనిచేస్తున్న కార్యకర్తలే జనసేనకు బలమని పేర్కొంటూ, ప్రజా సమస్యల పరిష్కారానికి తెలంగాణలో పార్టీ గొంతుక మరింత బలంగా వినిపించాలని పిలుపునిచ్చారు.
పార్టీ ప్రచార కార్యదర్శి సాగర్ ఆర్.కె. నాయుడు మాట్లాడుతూ యువత భాగస్వామ్యంతో రాబోయే రోజుల్లో తెలంగాణ రాజకీయాల్లో జనసేన కీలక పాత్ర పోషిస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. సమావేశానికి ముందు అమరవీరుల స్థూపం నుంచి సమావేశ ప్రాంగణం వరకు జనసైనికులు భారీ బైక్ ర్యాలీ నిర్వహించారు. అనంతరం అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించి, డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ప్రముఖ నాయకుడు చిల్లా జనార్దన్ రెడ్డి తన సుమారు 250 మంది అనుచరులు, మద్దతుదారులతో కలిసి జనసేన పార్టీలో చేరారు. వారికి తాళ్లూరి రామ్, మేడ రామకృష్ణ పార్టీ కండువాలు కప్పి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నాయకులు దుంపటి శ్రీనివాస్, ఎం. దామోదర్ రెడ్డి, మేకల సతీష్ రెడ్డి, ముమ్మారెడ్డి ప్రేమ్ కుమార్, డాక్టర్ గడల శ్రీనివాస్, పీ ఆర్ రఘు, అల్లాడి తనీష్, చిరాగ్ ప్రజీత్ గౌడ్, మచ్చా సుధాకర్, తనుజా రెడ్డి, లక్ష్మణ్ గౌడ్, ప్రేమ్ గాంధీ, సంతోష్ నాయక్‌తో పాటు జిల్లా నాయకులు, వీర మహిళలు, జనసైనికులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తల్లిపాలే శిశువు తొలి టీకా.. ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు బలమైన పునాది: కలెక్టర్ ఖుష్బూ గుప్తా

మహబూబ్‌నగర్, ఆగస్టు 1( ప్రజా జ్యోతి బ్యూరో ): నవజాత శిశువుకు తల్లిపాలే సంపూర్ణ పోషకాహారమని, ఆరోగ్యవంతమైన జీవితానికి తొలి పునాది తల్లిపాలేనని జిల్లా కలెక్టర్ ఖుష్బూ గుప్తా పేర్కొన్నారు. ప్రపంచ తల్లిపాల




వారోత్సవాలు–2026 సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం మహబూబ్‌నగర్ ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో తల్లిపాల ప్రాముఖ్యతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆమె ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, శిశువు జన్మించిన తొలి గంటలోనే తల్లిపాలను ప్రారంభించడం అత్యంత అవసరమని చెప్పారు. పుట్టిన తొలి ఆరు నెలల పాటు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే అందించాలని, అనంతరం వయస్సుకు తగిన పౌష్టికాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాలు శిశువులో వ్యాధి నిరోధక శక్తిని పెంపొందించడమే కాకుండా అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని వివరించారు. తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతి కుటుంబంలో అవగాహన పెంపొందించాలని, గర్భిణులు, బాలింతలకు శాస్త్రీయ అవగాహన కల్పించేందుకు వైద్యులు, ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ సూచించారు. ఆరోగ్యవంతమైన సమాజ నిర్మాణంలో తల్లి, శిశు ఆరోగ్య సంరక్షణకు తల్లిపాల ప్రోత్సాహం కీలకమని ఆమె పేర్కొన్నారు. అలాగే, శిశువుకు అవసరానికి మించి తల్లిపాలు లభిస్తే వాటిని వృథా చేయకుండా సుషేనా ఫౌండేషన్ – దాత్రి మిల్క్ బ్యాంక్‌కు దానం చేయాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ఆ పాలు తల్లిపాలు అందని నవజాత శిశువులకు ప్రాణాధారంగా నిలుస్తాయని తెలిపారు. కార్యక్రమానికి ముందు ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి ఆవరణలో నిర్వహించిన తల్లిపాల అవగాహన ర్యాలీలో కలెక్టర్ పాల్గొన్నారు. తల్లిపాల ప్రాముఖ్యతను చాటి చెప్పే ప్లకార్డులు, నినాదాలతో సాగిన ర్యాలీలో తల్లులు, వైద్యులు, వైద్య విద్యార్థులు, నర్సింగ్ విద్యార్థినులు, ఆరోగ్య సిబ్బంది ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ జనరల్ ఆసుపత్రి సూపరింటెండెంట్ డా. రంగా అజ్మీరా, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా. ఏ. శ్రీనివాసులు, జిల్లా సంక్షేమ అధికారి జరీనా, వైద్యులు, నర్సింగ్ సిబ్బంది, వైద్య విద్యార్థులు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

# శారీరక దృఢత్వమే సమర్థ పోలీసింగ్‌కు బలమైన పునాది

వారాంతపు కవాతులో జిల్లా ఎస్పీ జానకి ఐపీఎస్ స్పష్టమైన సందేశం

క్రమశిక్షణ, ఫిట్‌నెస్, అంకితభావంతో ప్రజలకు నాణ్యమైన సేవలు అందించాలని పోలీసు సిబ్బందికి పిలుపు

మహబూబ్‌నగర్, ఆగస్టు 1( ప్రజా జ్యోతి బ్యూరో ): పోలీసు విధుల్లో సమర్థత, ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే ప్రతి పోలీసు అధికారి శారీరకంగా దృఢంగా, మానసికంగా






అప్రమత్తంగా ఉండాలని జిల్లా ఎస్పీ దరావత్ జానకి పేర్కొన్నారు. శనివారం జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయం కవాతు మైదానంలో నిర్వహించిన వారాంతపు కవాతుకు ఎస్పీ హాజరై పరేడ్‌ను పరిశీలించారు. అనంతరం పోలీసు అధికారులు, సిబ్బందిని ఉద్దేశించి మాట్లాడుతూ, పోలీసింగ్ అనేది అత్యంత బాధ్యతాయుతమైన సేవ అని, దానిని సమర్థవంతంగా నిర్వహించాలంటే శారీరక దృఢత్వం, క్రమశిక్షణ, అప్రమత్తత అత్యవసరమని స్పష్టం చేశారు. ప్రతి పోలీసు అధికారి, సిబ్బంది ప్రతిరోజూ వ్యాయామం, పరేడ్, ఫిట్‌నెస్ కార్యక్రమాల్లో క్రమం తప్పకుండా పాల్గొని తమ శారీరక సామర్థ్యాన్ని పెంపొందించుకోవాలని సూచించారు. శారీరక ఆరోగ్యంతో పాటు మానసిక దృఢత్వం కూడా ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించడంలో కీలక పాత్ర పోషిస్తుందని పేర్కొన్నారు. విధుల నిర్వహణలో సమయపాలన, నిజాయితీ, అంకితభావం, క్రమశిక్షణ పాటించడంతో పాటు ప్రజలతో స్నేహపూర్వకంగా, బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ప్రతి పోలీసు సిబ్బంది తమ సేవల ద్వారా పోలీసు శాఖ ప్రతిష్ఠను మరింత ఉన్నత స్థాయికి తీసుకెళ్లేలా కృషి చేయాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) ఎన్.బి. రత్నం, ఏఆర్ అదనపు ఎస్పీ సురేష్ కుమార్, డీఎస్పీ వెంకటేశ్వర్లు, డీసీఆర్‌బీ డీఎస్పీ రమణా రెడ్డి, వన్‌టౌన్ ఇన్‌స్పెక్టర్ అప్పయ్య, ఆర్ఐలు కృష్ణయ్య, నగేష్, అశోక్ కుమార్, రూరల్ ఎస్ఐ విజయ్ కుమార్‌తో పాటు పలువురు అధికారులు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# సర్పంచు నుంచే వచ్చా... ప్రజా సమస్యలన్నీ తెలుసు!

## – నిర్లక్ష్య అధికారులకు మెమోలు తప్పవు

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి): ప్రజా సమస్యల పరిష్కారంలో నిర్లక్ష్యం వహించే అధికారులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని వనపర్తి ఎమ్మెల్యే తూడి మేఘారెడ్డి హెచ్చరించారు. శనివారం రేవల్లి, ఏదుల మండల సర్వసభ్య సమావేశాల్లో పాల్గొన్న ఆయన అన్ని ప్రభుత్వ శాఖల పనితీరును



శాఖలవారీగా సమీక్షించారు. సమావేశంలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన ఏఈ, ఎంఈఓలపై మెమోలు జారీ చేయాలని అధికారులను ఆదేశించారు. గ్రామాల్లో నెలకొన్న సమస్యలను సర్పంచులే ప్రత్యక్షంగా సభ దృష్టికి తీసుకొస్తున్నారని, వాటి పరిష్కారంలో అధికారులు బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. సంక్షేమ పథకాలు క్షేత్రస్థాయిలో సమర్థంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. యూరియా పంపిణీలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, ఆన్‌లైన్ సాంకేతిక సమస్యలను వెంటనే పరిష్కరించాలని వ్యవసాయ అధికారులకు సూచించారు. ఎల్‌నీనో పరిస్థితులను ఎదుర్కొనేందుకు రైతులు ఇంకుడు గుంతలు, ఫార్మ్‌పాండ్లు నిర్మించుకునేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని పేర్కొన్నారు. పిల్లలకు ఆస్తులు కూడబెట్టడం కంటే ఉన్నత విద్య అందించడం ముఖ్యమని ఎమ్మెల్యే అన్నారు. ప్రభుత్వ పాఠశాలలను రాష్ట్ర ప్రభుత్వం అత్యాధునిక సౌకర్యాలతో అభివృద్ధి చేస్తోందని, ప్రైవేట్ పాఠశాలలపై లక్షలు ఖర్చు చేయకుండా ప్రభుత్వ పాఠశాలల్లోనే పిల్లలను చేర్పించాలని తల్లిదండ్రులకు విజ్ఞప్తి చేశారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అత్యాధునిక పరికరాలు అందుబాటులోకి వచ్చాయని, వైద్య సేవల్లో నిర్లక్ష్యం చేసే అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వనపర్తి నియోజకవర్గంలో గత 30 నెలల్లో విద్యుత్ శాఖ ద్వారా రూ.140 కోట్ల పనులు పూర్తయ్యాయని, మరో రూ.40 కోట్ల పనులు కొనసాగుతున్నాయని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు ఎలాంటి ఇబ్బందులు కలిగించొద్దని, మట్టి, ఇసుక రవాణాపై ఆంక్షలు విధించవద్దని అధికారులను ఆదేశించారు.వేల కోట్లు ఖర్చు చేసినా గ్రామాల్లో తాగునీటి సమస్యలు కొనసాగుతున్నాయని, అది ప్రజలకు కాకుండా "కమిషన్ భగీరథ"గా మిగిలిపోయిందని విమర్శించారు. ధరణి స్థానంలో తీసుకొచ్చిన భూభారతితో రైతుల భూ సమస్యలను వేగంగా పరిష్కరించాలని రెవెన్యూ అధికారులను ఆదేశించారు. ప్రతి 45 రోజులకు సర్వసభ్య సమావేశాలు నిర్వహిస్తామని, సమావేశాలకు గైర్హాజరయ్యే లేదా నిర్లక్ష్యం ప్రదర్శించే అధికారులపై క్రమశిక్షణ చర్యలు తప్పవని స్పష్టం చేశారు. సమావేశాల్లో ఆర్డీవో సుబ్రహ్మణ్యం, ఎంపీడీవోలు, ఎమ్మార్వోలు, వివిధ శాఖల అధికారులు, సర్పంచులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆపరేషన్ ముస్కాన్–XII ఘన విజయం

- 80 మంది చిన్నారులకు కొత్త జీవితం..
- నెల రోజుల ప్రత్యేక ఆపరేషన్‌లో మహబూబ్‌నగర్ జిల్లా పోలీసుల విజయం
- 79 కేసులు నమోదు.. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటనపై ఉక్కుపాదం – ఎస్పీ జానకి

మహబూబ్‌నగర్, ఆగస్టు 1( ప్రజా జ్యోతి బ్యూరో ): చిన్నారుల రక్షణ, వారి హక్కుల పరిరక్షణకు మహబూబ్‌నగర్ జిల్లా పోలీసులు చేపట్టిన ఆపరేషన్ ముస్కాన్–XII విజయవంతంగా ముగిసింది. నెల రోజుల పాటు అన్ని ప్రభుత్వ శాఖలు, చైల్డ్‌లైన్, స్వచ్ఛంద సంస్థల సమన్వయంతో నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో 80 మంది చిన్నారులను రక్షించినట్లు జిల్లా ఎస్పీ దరావత్ జానకి వెల్లడించారు. జూలై 1 నుంచి జూలై 31 వరకు అదనపు ఎస్పీ ఎన్.బి. రత్నం పర్యవేక్షణలో నిర్వహించిన ఈ ప్రత్యేక ఆపరేషన్‌లో 76 మంది బాలురు, 4 మంది బాలికలను రక్షించగా, వీరిలో ఇతర రాష్ట్రాలకు చెందిన 18 మంది




చిన్నారులు కూడా ఉన్నట్లు తెలిపారు. బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, భిక్షాటన, విద్యకు దూరమైన చిన్నారులను గుర్తించి సురక్షిత వాతావరణంలోకి తీసుకురావడమే ఈ కార్యక్రమం ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఆపరేషన్ సందర్భంగా 79 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు ఎస్పీ తెలిపారు. రక్షించిన చిన్నారులను సంబంధిత అధికారుల సమక్షంలో వారి తల్లిదండ్రులు లేదా సంరక్షకులకు అప్పగించడంతో పాటు, అవసరమైన పునరావాస చర్యలు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలో బాల కార్మికత్వం, బాల్య వివాహాలు, చిన్నారుల అక్రమ రవాణా, భిక్షాటన వంటి సామాజిక సమస్యలపై పోలీసులు నిరంతరం ప్రత్యేక నిఘా కొనసాగిస్తున్నారని ఎస్పీ పేర్కొన్నారు. ప్రతి చిన్నారి విద్య, భద్రత, సంక్షేమాన్ని కాపాడటం సమాజంలోని ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు. బాల కార్మికులు లేదా ప్రమాదంలో ఉన్న చిన్నారులు ఎక్కడైనా కనిపిస్తే వెంటనే సమీప పోలీస్ స్టేషన్‌కు, డయల్–100 లేదా చైల్డ్ హెల్ప్‌లైన్–1098కు సమాచారం అందించాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తులో కూడా అన్ని శాఖల సమన్వయంతో ఆపరేషన్ ముస్కాన్‌ను మరింత సమర్థవంతంగా అమలు చేస్తామని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమాన్ని మహిళా పోలీస్ స్టేషన్ ఇన్‌స్పెక్టర్ కృష్ణయ్య ఆధ్వర్యంలో విజయవంతంగా నిర్వహించడంలో కృషి చేసిన డివిజనల్ బృందం సభ్యులు ఎస్ఐ లెనిన్, ఏఎస్ఐ విలియం మార్క్, పీసీలు శ్రీహరి, శివకుమార్, మహిళా పోలీసు కానిస్టేబుల్ శిల్ప, చైల్డ్‌లైన్ ప్రతినిధులు అంజాద్, ఆర్డీఎస్ విజయభారతి, అలాగే మానవ అక్రమ రవాణా నిరోధక విభాగం సిబ్బంది, ఇతర శాఖల అధికారులు, సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. చిన్నారుల రక్షణ, సంక్షేమం కోసం ఇదే సేవా స్ఫూర్తితో ముందుకు సాగాలని పిలుపునిచ్చారు.

# బాలలను పనిలో పెట్టుకుంటే కఠిన చర్యలు: ఎస్పీ సునితారెడ్డి

- 82 మంది బాల కార్మికులకు విముక్తి
- ఆపరేషన్ ముస్కాన్-12లో వనపర్తి పోలీసుల విజయవంతమైన చర్య
- 26 మంది యజమానులపై కేసులు నమోదు

వనపర్తి ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి): వనపర్తి జిల్లాలో నిర్వహించిన ఆపరేషన్ ముస్కాన్–12లో 82 మంది బాల కార్మికులను రక్షించినట్లు జిల్లా ఎస్పీ సునితారెడ్డి, ఐపీఎస్ తెలిపారు. జూలై 1 నుంచి 31 వరకు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 78 మంది బాలురు, నలుగురు బాలికలను గుర్తించి విముక్తి కల్పించినట్లు వెల్లడించారు. బాలలను చట్టవిరుద్ధంగా పనిలో పెట్టుకున్న 26 మంది యజమానులపై కేసులు నమోదు




చేసి చట్టపరమైన చర్యలు తీసుకున్నామని పేర్కొన్నారు. రక్షించిన బాలలకు సంబంధిత శాఖల సమన్వయంతో పునరావాసం కల్పించి, తల్లిదండ్రులకు బాలల హక్కులు, నిర్బంధ విద్య, బాల కార్మిక వ్యవస్థ దుష ్ఫరిణామాల పై అవగాహన కల్పించినట్లు తెలిపారు. బాలలను తిరిగి పాఠశాలల్లో చేర్పించేలా కౌన్సెలింగ్ నిర్వహించామని చెప్పారు. ఆపరేషన్ ముస్కాన్ విజయవంతానికి పోలీసు, కార్మిక, జిల్లా బాలల పరిరక్షణ విభాగం, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ, విద్య, వైద్యశాఖల అధికారులు సమన్వయంతో పనిచేశారని ఎస్పీ అభినందించారు. 18 ఏళ్లలోపు పిల్లలను పనిలో పెట్టుకోవడం, వెట్టిచాకిరి చేయించడం, బలవంతపు భిక్షాటనకు గురిచేయడం, హోటళ్లు, మెకానిక్ షాపులు, కిరాణా దుకాణాలు, ఇటుక బట్టీలు, పౌల్ట్రీ ఫారాలు, పరిశ్రమలు తదితర ప్రాంతాల్లో పనిచేయించడం చట్టరీత్యా నేరమని హెచ్చరించారు. జిల్లాలో ఎక్కడైనా బాల కార్మికులు కనిపించినా లేదా బాలలపై వేధింపులు, దోపిడీ జరుగుతున్నట్లు తెలిసినా చైల్డ్ హెల్ప్‌లైన్–1098 లేదా డయల్–100కు సమాచారం అందించాలని కోరారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

# లాఠీలతో యువత గొంతు నొక్కలేరు.. కాంగ్రెస్ ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తోంది : భండారి శాంతికుమార్

మహబూబ్‌నగర్, ఆగస్టు 1( ప్రజా జ్యోతి బ్యూరో ): ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులపై చేసిన ఉపాధ్యక్షులు భండారి శాంతికుమార్ తీవ్రంగా ఖండించారు. ఆయన మాట్లాడుతూ,



వ్యాఖ్యలను నిరసిస్తూ మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో బీజేపీ, బీజేపీ యువమోర్చా (బీజేవైఎం) ఆధ్వర్యంలో నిర్వహించిన ఆందోళన సందర్భంగా విద్యార్థులు, యువమోర్చా నాయకులు, కార్యకర్తలపై పోలీసులు లాఠీచార్జ్ చేయడాన్ని బీజేపీ రాష్ట్ర ప్రజాస్వామ్యంలో ప్రశ్నించడం నేరం కాదని, నిరసన వ్యక్తం చేయడం ప్రతి పౌరుడి రాజ్యాంగబద్ధ హక్కు అని అన్నారు. తమ హక్కులు, ఆత్మగౌరవం కోసం గొంతెత్తిన విద్యార్థులు, యువతకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం వారిపై లాఠీలు ప్రయోగించడం అత్యంత దురదృష్టకరమని విమర్శించారు. మహబూబ్‌నగర్ తెలంగాణ చౌరస్తా వద్ద జరిగిన లాఠీచార్జ్‌ను తీవ్రంగా ఖండిస్తున్నామని, లాఠీలతో యువత గొంతును అణచివేయలేరని స్పష్టం చేశారు. విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలను పరిష్కరించాల్సిన ప్రభుత్వం వారిపై పోలీసు బలాన్ని ప్రయోగించడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని శాంతికుమార్ మండిపడ్డారు. యువత అడిగే ప్రశ్నలకు సమాధానం చెప్పాల్సిన ప్రభుత్వం పోలీసు బలంతో భయపెట్టాలని చూడడం సరైన విధానం కాదన్నారు. అధికారం శాశ్వతం కాదని, లాఠీ దెబ్బలతో ప్రజల ప్రశ్నలను ఆపలేరని, ప్రతి లాఠీ దెబ్బ యువతలోని పోరాట స్ఫూర్తిని మరింత పెంచుతుందని వ్యాఖ్యానించారు. విద్యార్థులు, నిరుద్యోగులకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టకుండా, ప్రశ్నించిన వారిని అణచివేసే ప్రయత్నం కాంగ్రెస్ ప్రభుత్వ అప్రజాస్వామిక వైఖరికి నిదర్శనమని ఆరోపించారు. ఒకవైపు విద్యార్థుల ఆత్మగౌరవాన్ని దెబ్బతీసే వ్యాఖ్యలు చేయడం, మరోవైపు వాటిని నిరసిస్తూ రోడ్డెక్కిన



యువతపై లాఠీలు ప్రయోగించడం కాంగ్రెస్ చెప్పే ప్రజాపాలన కాదని విమర్శించారు. లాఠీచార్జ్ ఘటనపై తక్షణమే సమగ్ర విచారణ జరిపి బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. అలాగే విద్యార్థులపై చేసిన వ్యాఖ్యల విషయంలో ముఖ్యమంత్రి అనుముల రేవంత్ రెడ్డి బహిరంగంగా క్షమాపణ చెప్పాలని కోరారు. విద్యార్థులు, నిరుద్యోగుల హక్కుల పరిరక్షణ విషయంలో బీజేపీ వెనక్కి తగ్గదని, యువత గొంతుకగా ప్రజాస్వామ్యబద్ధంగా తమ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని భండారి శాంతికుమార్ స్పష్టం చేశారు. లాఠీలతో ఉద్యమాలను అణచివేయగలమని కాంగ్రెస్ ప్రభుత్వం భావిస్తే అది కేవలం భ్రమ మాత్రమేనని ఆయన వ్యాఖ్యానించారు.

## ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు..

### ఇద్దరికి తీవ్ర గాయాలు



పర్వతగిరి, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోమారం, గుంటూరుపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయ పడ్డారు. ఎదురెదురుగా వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఒక్కసారిగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఢీకొన్న తీవ్రతకు ఇద్దరూ రోడ్డుపై ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గుంటూరుపల్లి గ్రామానికి చెందిన లవడ్యా గణేష్ (40) కుడికాలు విరగగా, పర్వతగిరి పట్టణానికి చెందిన సిరికొండ ప్రశాంత్ (35) ఎడమ చేయి విరిగింది. ప్రమాదాన్ని చూసిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి రాజు నాయక్, పైలట్ రవీందర్ అత్యంత వేగంగా ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందించారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని వరంగల్ ఎంజీఎం ఆసుపత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమై ఉండొచ్చని స్థానికులు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

## తల్లిపాల వారోత్సవాలు

- తల్లిపాలే శిశువుకు సంజీవని
- ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి
- డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య





హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి): గర్భం దాల్చిన నాటి నుంచే తల్లులకు అవసరమైన ఆరోగ్య జాగ్రత్తలతో పాటు తల్లిపాల ప్రాముఖ్యతపై సమగ్ర అవగాహన కల్పించాలని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ ఎ. అప్పయ్య సూచించారు. ఆగస్టు 1 నుంచి 7 వరకు నిర్వహిస్తున్న ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. పుట్టిన బిడ్డకు మొదటి గంటలోనే ముర్రుపాలు పట్టించడం అత్యంత కీలకమని, పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఎలాంటి పై ఆహారం ఇవ్వొద్దని సూచించారు. ఆరోగ్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు క్షేత్రస్థాయిలో గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై విస్తృతంగా అవగాహన కల్పించాలని కోరారు. ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ విజయలక్ష్మి మాట్లాడుతూ.. ప్రసవానంతరం వచ్చే పసుపు రంగు చిక్కటి పాలను ముర్రుపాలు (కొలస్ట్రం) అంటారని, ఇందులో రోగనిరోధక శక్తిని పెంచే ప్రోటీన్లు, విటమిన్--ఎ, బి, ఐరన్ సమృద్ధిగా ఉంటాయని తెలిపారు. ముర్రుపాలు శిశువుకు తొలి రక్షణ కవచమని, వాటిని తప్పనిసరిగా పట్టించాలని సూచించారు. జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ శ్రీకృష్ణారావు, శిశు వైద్య నిపుణుడు డాక్టర్ సుభాష్ మాట్లాడుతూ.. తల్లిపాలు శ్వాసకోశ వ్యాధులు, అలర్జీలు, ఆస్తమా, చర్మవ్యాధుల నుంచి శిశువును రక్షిస్తాయని తెలిపారు. బిడ్డకు పగలు, రాత్రి కలిపి రోజుకు 8 నుంచి 10 సార్లు పాలివ్వాలని, రెండు స్తనాల నుంచి పాలు తాగించేలా చూడాలని సూచించారు. అనంతరం డీఎంహెచ్‌వో డాక్టర్ అప్పయ్య వెల్‌నెస్ సెంటర్, పట్టణ కుటుంబ సంక్షేమ కేంద్రాన్ని సందర్శించి అందిస్తున్న వైద్య సేవలు, వ్యాధి నిరోధక టీకాల కార్యక్రమాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో వైద్యులు, నర్సింగ్ అధికారులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాలకు బియ్యం నిత్యావసరాలు ఆర్థిక సహా యం

### పరూపాటి శ్రీనివాస్ రెడ్డి





రాయపర్తి ఆగస్టు 1 ప్రజా జ్యోతి : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం కాట్రపల్లి గ్రామంలో బీ ఆర్ ఎస్ పార్టీ నాయకులు ఎండీ అబ్బాస్ ఇటీవల అనారోగ్యంతో మరణించగా, శనివారం వారి కుటుంబ సభ్యులను రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు పరామర్శించి ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో 50 కేజీల బియ్యం, ఆయిల్ క్యాన్ ను సహాయం చేసిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. అలాగే మండలంలోని వేరుక వేడు గ్రామంలో గారే బిక్షపతి రోడ్డు ప్రమాదంలో కాలు విరిగిపోగా అతనినీ పరామర్శించి 3000 రూపాయల ఆర్థిక సహాయం అందించారు. ఈ సహాయంను వారి కుటుంబ సభ్యులకు అందించిన రాయపర్తి మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, కర్ర రవీందర్ రెడ్డి, చిట్యాల వెంకన్న, సంకినేని ఎల్లస్వామిస్థానిక నాయకులు అయిన ఎండీ అన్వార్, మొర్రి రాజేందర్, ముద్రబోయిన శ్రీనివాస్, ఎండీ కలిల్ ఎండీ అబ్బాస్, ఎండీ నాసర్, చిడిమిళ్ల అశోక్ బూడిద సోమయ్య, బూడిద శ్రీధర్, బూడిద యాకయ్య, వెలుపుగొండ బిక్షపతి, కందుకూరి శ్రవణ్ తదితరులు పాల్గొన్నారు.

## రియాన్ను మొదటి జన్మదిన వేడుకల్లో పాల్గొని శుభాకాంక్షలు తెలిపిన మండల పార్టీ నాయకులు



రాయపర్తి ఆగస్టు 01 ప్రజా జ్యోతి : వరంగల్ జిల్లా రాయపర్తి మండలం పోతిరెడ్డి పల్లి' గ్రామంలోబీఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు చెంగల ఇందిర కుమారుడు చెంగలా రాజేష్ కూతురు రియాన్స్ మొదటి పుట్టినరోజు వేడుకలలో రాష్ట్ర మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్ రావు ఆదేశాల మేరకు శనివారం వేడుకలలోపాల్గొని ఎస్ ఆర్ ఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో గిఫ్ట్ ప్యాక్ ను అందించి, శుభాకాంక్షలు తెలిపిన ఫౌండేషన్ చైర్మన్, బిఆర్ఎస్ పార్టీ జిల్లా నాయకులు పరుపటి శ్రీనివాస్ రెడ్డి. మరియు రాయపర్తి మండల మాజీ ఎంపీపీ జినుగు అనిమి రెడ్డి, మాజీ మండల పార్టీ ప్రధాన కార్యదర్శి పూస మధు, మండల పార్టీ నాయకులు లేతకుల రంగా రెడ్డి, అశ్రఫ్ పాషా, సంకినేని ఎల్లస్వామి స్థానిక సర్పంచ్ లకావత్ రెడ్డి నాయక్, సర్పంచ్ ఇస్లావత్ సంతోష్, మాజీ గ్రామ పార్టీ అధ్యక్షులు మందపురి సతీష్ పార్టీ ముఖ్య నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# ఎదురెదురుగా ఢీకొన్న రెండు బైక్‌లు..

### ఇద్దరికి తీవ్ర గాయాలు



పర్వతగిరి, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) : వరంగల్ జిల్లా పర్వతగిరి మండలం సోమారం,గుంటూరుపల్లి శివారులో శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు యువకులు తీవ్రంగా గాయపడ్డారు. ఎదురెదురుగా వేగంగా వస్తున్న రెండు ద్విచక్ర వాహనాలు ఒక్కసారిగా ఢీకొనడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ఢీకొన్న తీవ్రతకు ఇద్దరూ రోడ్డుపై ఎగిరిపడి తీవ్ర గాయాలపాలయ్యారు. ప్రమాదంలో గుంటూరుపల్లి గ్రామానికి చెందిన లవడ్యా గణేష్ (40) కుడికాలు విరగగా, పర్వతగిరి పట్టణానికి చెందిన సిరికొండ ప్రశాంత్ (35) ఎడమ చేయి విరిగింది. ప్రమాదాన్ని చూసిన స్థానికులు వెంటనే స్పందించి 108 అంబులెన్స్‌కు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది ఈఎంటి రాజు నాయక్, పైలట్ రవీందర్ అత్యంత వేగంగా ఘటనాస్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రథమ చికిత్స అందిం చారు. అనంతరం మెరుగైన వైద్యం కోసం వారిని వరంగల్ ఎంజీఎం ఆసు పత్రికి తరలించారు. ప్రమాదానికి అతివేగమే కారణమై ఉండొచ్చని స్థాని కులు అభిప్రాయపడుతున్నారు. ఘటనపై పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ముస్కాన్‌తో చిన్నారులకు విముక్తి

- వరంగల్ కమిషనరేట్‌లో 314 మంది రక్షణ
- బాల కార్మికులను పనిలో పెట్టుకున్న 55 మందిపై కేసులు



హన్మకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి) : బాల కార్మిక వ్యవస్థ నిర్మూలనే లక్ష్యంగా వరంగల్ పోలీస్ కమిషనరేట్ ఆధ్వర్యంలో నిర్వహించిన 'ఆపరేషన్ ముస్కాన్--12'లో 314 మంది చిన్నారులను రక్షించినట్లు పోలీస్ కమిషనర్ ఎన్. శ్వేత తెలిపారు. జులై 1 నుంచి 31 వరకు చేపట్టిన ప్రత్యేక తనిఖీల్లో 269 మంది బాలురు, 45 మంది బాలికలు గుర్తించి సురక్షితంగా బయటకు తీసుకువచ్చినట్లు వెల్లడించారు.

రక్షించబడిన వారిలో 226 మంది బాల కార్మికులు, 85 మంది బడి మానేసిన (డ్రాప్‌అవుట్) చిన్నారులు ఉన్నారని తెలిపారు. వీరిని వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల చైల్డ్ వెల్ఫేర్ కమిటీల ఎదుట హాజరుపరిచి, తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి అప్పగించినట్లు పేర్కొన్నారు. రక్షించబడిన చిన్నారుల్లో బీహార్, మహారాష్ట్ర, కర్ణాటక, రాజస్థాన్, ఆంధ్రప్రదేశ్, పశ్చిమ బెంగాల్, ఉత్తరప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, అస్సాం రాష్ట్రాలకు చెందిన 130 మంది ఉన్నట్లు వివరించారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న యజమానులపై కమిషనరేట్ పరిధిలో 55 ఎఫ్ఐఆర్‌లు నమోదు చేసినట్లు తెలిపారు.

కార్మిక శాఖ అధికారులు 92 తనిఖీ నివేదికలు నమోదు చేయగా, వివిధ పోలీస్ స్టేషన్ల జనరల్ డైరీల్లో 118 మంది చిన్నారుల వివరాలు నమోదు చేసినట్లు వెల్లడించారు.

ఈ ఆపరేషన్ కోసం కమిషనరేట్ పరిధిలో 9 ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసి, యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్, మహిళా--శిశు సంక్షేమ శాఖ, చైల్డ్ హెల్ప్‌లైన్, కార్మిక శాఖ, చైల్డ్ వెల్ఫేర్ కమిటీతో పాటు స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృతంగా తనిఖీలు నిర్వహించినట్లు కమిషనర్ తెలిపారు.

**"పిల్లలు బడిలో ఉండాలి..** పనిలో కాదు. బాల కార్మిక వ్యవస్థను ప్రోత్సహించే వారిపై కఠిన చర్యలు తప్పవు. ఎక్కడైనా బాల కార్మికులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలి" అని కమిషనర్ ఎన్. శ్వేత ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

# ఎస్ఐఆర్‌కు సహకారం అభినందనీయం

- ఆగస్టు 10 వరకు గడువు
- పారదర్శకంగా కొనసాగుతున్న ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ
- ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్.రవి





హనుమకొండ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి) : జిల్లాలో ఓటర్ల జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) ప్రక్రియ అధికారులు, బీఎల్‌వోలు, బీఎల్ఏలు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీల ప్రతినిధుల సహకారంతో పారదర్శకంగా, పకడ్బందీగా కొనసాగుతోందని హనుమకొండ జిల్లా ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి తెలిపారు. శనివారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఎస్ఐఆర్ పురోగతిపై రాజకీయ పార్టీల ప్రతినిధులకు వివరించారు. మరణించిన ఓటర్లు, శాశ్వతంగా ఇతర ప్రాంతాలకు వలస వెళ్లిన ఓటర్ల వివరాలపై రాజకీయ పార్టీల ప్రతినిధులు అడిగిన ప్రశ్నలకు ఇన్‌చార్జి కలెక్టర్ ఎన్. రవి, వరంగల్ పశ్చిమ ఈఆర్‌వో, హనుమకొండ ఆర్డీవో వెంకటేష్ సమగ్ర వివరణ ఇచ్చారు. భారత ఎన్నికల సంఘం తొలుత నిర్ణయించిన ఆగస్టు 3 గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిందని ఎన్. రవి తెలిపారు. రాష్ట్రంలోని ఇతర జిల్లాలతో పోల్చితే హనుమకొండ జిల్లా ఎస్ఐఆర్ అమలులో మంచి పురోగతి సాధించిందన్నారు. జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి నిరంతర పర్యవేక్షణలో బీఎల్‌వోలు సేకరించిన దరఖాస్తుల డిజిటలైజేషన్ వేగంగా జరుగుతోందని, ప్రతి పోలింగ్ కేంద్రం పరిధిలో మరణించిన, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను రీ–వెరిఫికేషన్ చేస్తున్నట్లు చెప్పారు. ఇంకా ఎస్ఐఆర్ ఫారాలు సమర్పించని ఓటర్లు ఆగస్టు 10లోగా సంబంధిత బీఎల్‌వోలకు అందజేయాలని సూచించారు. సందేహాల నివృత్తికి తహసీల్దార్ కార్యాలయం, ఆర్డీవో కార్యాలయం లేదా జిల్లా కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌లను సంప్రదించాలని కోరారు. సమావేశంలో వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల విభాగం అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలి

- వివిధ శాఖల అధికారులు సమన్వయంతో పని చేయాలి
- జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా



జనగామ జిల్లా ప్రతినిధి, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) : ఈ నెల 15వ తేదీన స్వాతంత్ర్య దినోత్సవాన్ని పురస్కరించుకొని వివిధ శాఖల అధికారులు వారికి కేటాయించిన బాధ్యతలను సమన్వయంతో నిర్వర్తించాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం, జిల్లా సమీకృత కార్యాలయాల భవన సముదాయంలోని కలెక్టర్ ఛాంబర్ లో డీసీపీ రాజ మహేంద్ర నాయక్, రెవెన్యూ అదనపు కలెక్టర్ బెన్షాలోమ్ తో కలిసి జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల ఏర్పాట్లపై సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 15న జరుపుకొనే స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల్లో జాతీయ భావం ఉట్టిపడేలా ఘనంగా నిర్వహించాలని, అందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లను అధికారులు పకడ్బందీగా నిర్వహించాలని సూచించారు. స్వాతంత్ర్య దినోత్సవం రోజున జాతీయ పతాకావిష్కరణలో భాగంగా కలెక్టరేట్ లో చేపట్టనున్న నేపథ్యంలో పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణకు చర్యలు తీసుకోవాలన్నారు. వివిధ శాఖల తరపున స్టాల్స్ ను ఏర్పాటు చేయాలని, ప్రముఖులకు, పుర ప్రముఖులకు, అతిథులకు స్వాతంత్ర్య దినోత్సవ ఆహ్వాన పత్రాలను అందజేయాలన్నారు. జిల్లా ప్రగతిపై రూపొందించే సందేశం కాపీలను సీపీఓ, డీపీఆర్ఓ సంయుక్తంగా కలిసి తయారు చేయాలని కలెక్టర్ పేర్కొన్నారు. సాంస్కృతిక కార్యక్రమాల నిర్వహణ బాధ్యతలను విద్యా శాఖ అధికారులు చేపట్టాలన్నారు. జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయాలని, విద్యుత్తు సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా నిరంతరం సరఫరా చేసే విధంగా విద్యుత్ శాఖ అధికారులు ఇప్పటి నుంచే ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని, ఎలాంటి పొరపాట్లకు ఆస్కారం ఇవ్వకుండా సంబంధిత శాఖల అధికారులు అవసరమైన అన్ని ఏర్పాట్లను సమన్వయంతో ముందస్తు జాగ్రత్తలతో చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టం చేశారు. అగ్నిమాపక యంత్రాలను సిద్ధంగా ఉంచాలని, తాగునీరు, స్నాక్స్ వంటి మౌలిక సదుపాయాలను కల్పించాలని, స్టేజ్ అలంకరణ, పూలమొక్కల ఏర్పాటు, తివాచీలను, బ్యారికేడ్ లను పటిష్టంగా ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు సూచించారు. పోలీసు బందోబస్తు, గౌరవ వందనం, పోలీసు బ్యాండ్ వంటి ఏర్పాట్లను పకడ్బందీగా నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో జనగామ ఆర్డీఓ గోపీరాం, కలెక్టరేట్ ఏవో రవి కిరణ్, సిపిఓ చినకోట్యా నాయక్, విద్యా శాఖ ఏడీ శ్రీనివాస్ వివిధ శాఖల జిల్లా అధికారులు, పోలీసు అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# గోదావరి ప్రవాహాన్ని పరిశీలించిన మంత్రి సీతక్క





వరద భాధితులకు ఇందిరమ్మ ఇళ్ళు.
పునరావాస కేంద్రాల్లోని భాదితులకు అన్ని వసతులు కల్పించాలి.
వరద భాదితులకు అండగా ఉంటాం

మంగపేట, ఆగస్టు 1(ప్రజాజ్యోతి) : మంగపేట మండలం పొదుమూరు వద్ద గోదావరి నీటి ప్రవాహాన్ని శనివారం పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, గ్రామీణ నీటి సరఫరా, మహిళా, శిశు సంక్షేమ శాఖల మంత్రి సీతక్క, జిల్లా కలెక్టర్ బోర్కడే హేమంత్ సహదేవరావు, జిల్లా ఎస్పీ సుధీర్ రామ్నాథ్ కేకన్, ఐటిడిఏ పిఓ లెనిన్ వస్సల్ టోప్పో లతో కలిసి పరిశీలించారు. అలాగే మండలంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాన్ని సందర్శించారు. ఈ సందర్భముగా మంత్రి వరద ముంపు ప్రాంతాల బాధితులతో మాట్లాడి వారికి భరోసా కల్పించారు. అనంతరం మంగపేట గోదావరి కరకట్ట నిర్మాణ పనుల పురోగతిని పరిశీలించి, బ్యాక్‌వాటర్ ప్రభావంతో ముంపునకు గురయ్యే ప్రాంతాలకు చెందిన 28 కుటుంబాల 112 మందిని పునరావాస కేంద్రాలకు తరలించి కల్పించిన సౌకర్యాలపై ఆరా తీశారు. ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాల కారణంగా గోదావరి నదిలో వరద ప్రవాహం క్రమంగా పెరుగుతున్నందున, నది పరివాహక ప్రాంతాల్లోకి వరద నీరు చేరే అవకాశం ఉందని మంత్రి తెలిపారు. ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, అధికారులు ఎప్పటికప్పుడు ప్రజలకు అందుబాటులో ఉంటూ సహాయక చర్యలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆదేశించారు.

పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న వరద బాధితులకు ఆహారం, తాగునీరు, వైద్య సేవలు, పారిశుద్ధ్య సౌకర్యాలు సహా అన్ని మౌలిక వసతులు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధితులకు అవసరమైన అన్ని సౌకర్యాలు అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. ముంపు బాధితులకు శాశ్వత ప్రాతిపదికన ఇళ్ల నిర్మాణానికి ప్రభుత్వం చర్యలు చేపడుతుందని హామీ ఇచ్చారు. ప్రజలు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. ప్రస్తుత వర్షాకాలంలో రవాణా సౌకర్యం నిలిచిపోయిన వాగులు, వంకల వద్ద ప్రజల సౌకర్యార్థం బోట్లను ఏర్పాటు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంధాలయ సంస్థ చైర్మన్ బానోతు రవిచందర్, మార్కెట్ కమిటీ చైర్పర్సన్ రేగ కళ్యాణి, మండల కాంగెస్ పార్టీ అధ్యక్షుడు చెట్టుపల్లి వెంకటేశ్వర్లు, జిల్లా అధికార ప్రతినిధి అయ్యోరి యానయ్య, ఆర్డీవో కృష్ణవేణి, తహసిల్దార్ తోట రవీందర్, ఎంపీడీఓ భద్రు, స్థానిక ప్రజా ప్రతినిధులు, అధికారులు పాల్గొన్నారు.

## ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం




ములుగు జిల్లా స్టాఫ్ రిపోర్టర్ (ప్రజాజ్యోతి) : ములుగు జిల్లా కేంద్రంలో ప్రపంచ తల్లిపాల వారోత్సవాల ప్రారంభోత్సవ కార్యక్రమం జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ సందర్భంగా జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ గోపాల్ రావు మాట్లాడుతూ నా బిడ్డకు నా పాలు మాత్రమే ఇస్తాననే భావనతో తన బిడ్డకు పాలు ఇచ్చినట్లయితే తల్లి బిడ్డల మాతృత్వ మాతృత్వ బంధం పెంపొందించడంతో పాటు మంచి సమాజ ఏర్పాటుకు ఉపయోగపడు తుందని అన్నారు. తల్లి పాలు అమృతంతో సమానమని. ప్రసవం

అయిన గంటలోపే బిడ్డకు తన ముర్రుపాలను ఇచ్చినట్లయితే ముర్రుపాలు లో ఉండే వ్యాధి నిరోధక శక్తి వలన బిడ్డకు అనేక వ్యాధుల నుండి రక్షిస్తుందని తెలిపారు. తల్లిపాల వల్ల బిడ్డకు, తల్లికి ఇరువురికి అపారమైన ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన జిజిహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ.. తల్లి పాలు మొదటి స్థిరమైన ఆహారం అనే ఈసంవత్సరం థీమ్‌తో ఈ కార్యక్రమం జరుగుతుందని, స్థిరమైన ఆహారం అనగా పునరుత్పాదక శక్తి కొనసాగే వనరులుగా ఈ తల్లిపాలు ఉపయోగించే పద్ధతి అని తల్లిపాల వల్ల గర్భాశయ ముఖద్వారా క్యాన్సర్ ను నివారించవచ్చునని అన్నారు. తల్లిపాలు ఇవ్వడం మూలంగా గర్భనిరోధకంగా పనిచేసే ఆరు నెలలపాటు తల్లిపాలు ఇచ్చినట్లయితే గర్భం దాల్చకుండా ఉంటుందని తల్లి అనారోగ్యంతో ఉన్నప్పటికీ బిడ్డకు పాలు ఇవ్వాలని తెలిపారు. జిజి హెచ్ పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ అనిల్ మాట్లాడుతూ.. తల్లి బిడ్డకు పాలు ఇచ్చే విధానాలను టెక్నిక్లను క్షుణ్ణంగా వివరించారు. జిల్లా శిశు ఆరోగ్యం, వ్యాధి నిరోధక టీకాల నియంత్రణాధికారి డాక్టర్ నాగన్వేష్ మాట్లాడుతూ.. ప్రపంచ తల్లి పాల వారోత్సవ కార్యక్రమం అన్ని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వారం రోజులు నిర్వహిస్తామని, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలోని ఏఎన్సి క్లినిక్ లలో, అంగన్వాడీ సెంటర్లలో, గర్భిణీ స్త్రీలు, పాలిచ్చే తల్లులకు ఇచ్చే రేషన్ పంపిణీకార్యక్రమంలో తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా మాత సంరక్షణ, పోషకాహార ప్రోగ్రాం అధికారి డాక్టర్ శ్రీకాంత్, మాస్ మీడియా అధికారి సంపత్, జిజిహెచ్ నర్సింగ్ సూపరింటెండెంట్ ఆఫీసర్, నర్సింగ్ ఆఫీసర్స్, మానిటరింగ్ సూపర్వైజర్ సురేష్ బాబు, ఆరోగ్య కార్యకర్తలు రవీందర్, ఆశా కార్యకర్తలు, గర్భిణీ స్త్రీలు, పాలు ఇచ్చే తల్లులు తదితరులు పాల్గొన్నారు.

## దళితుల భూములు... మరెవరి ఆధీనంలో..?

- పర్వతగిరిలో అసైన్డ్ భూములపై తీవ్ర అనుమానాలు
- రికార్డుల్లో దళితుల పేర్లు... పొలాల్లో మరొకరా?
- అధికారిక విచారణకు పెరుగుతున్న డిమాండ్



పర్వతగిరి, ఆగస్టు 10 (ప్రజాజ్యోతి) : దళితుల ఆర్థిక సాధికారత కోసం ప్రభుత్వం కేటాయించిన అసైన్డ్ భూములు నిజంగా లబ్ధిదారుల చేతుల్లోనే ఉన్నాయా? లేక నిబంధనలకు విరుద్ధంగా ఇతరుల ఆధీనంలోకి వెళ్లాయా? అనే ప్రశ్నలు వరంగల్ జిల్లా పర్వతగిరి మండలంలో తీవ్ర చర్చకు దారితీస్తున్నాయి. గ్రామంలో దళితుల జనాభా అధికంగా ఉన్నప్పటికీ, అసైన్డ్ భూముల్లో గణనీయమైన విస్తీర్ణాన్ని అగ్రవర్ణాలకు చెందిన వ్యక్తులే సాగు చేస్తున్నారనే ఆరోపణలు స్థానికంగా బలంగా వినిపిస్తున్నాయి. ఈ పరిస్థితిపై రెవెన్యూ అధికారులు ఇప్పటివరకు సమగ్ర పరిశీలన చేపట్టకపోవడం పలు అనుమానాలకు తావిస్తోంది.

అసైన్డ్ భూములను ప్రభుత్వం కేవలం భూమిలేని పేద కుటుంబాల జీవనోపాధి కోసం మాత్రమే కేటాయిస్తుంది. అలాంటి భూములను విక్రయించడం, కొనుగోలు చేయడం, కౌలు లేదా ఇతర మార్గాల్లో శాశ్వతంగా బదిలీ చేయడం చట్టవిరుద్ధం. అయినప్పటికీ, పర్వతగిరిలో అసలు పట్టాదారులు పొలంలో కనిపించకపోగా, ఇతరులే ఏళ్ల తరబడి సాగు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్థానికుల అభిప్రాయం ప్రకారం, కొంతమంది లబ్ధిదారులు ఆర్థిక ఇబ్బందులతో భూములను ఇతరులకు అప్పగించగా, మరికొన్ని భూములు ప్రభావశీలుల ఆధీనంలోకి వెళ్లాయని ఆరోపిస్తున్నారు. ఈ ఆరోపణల్లో నిజానిజాలు తేలాల్సి ఉన్నప్పటికీ, అధికార యంత్రాంగం మౌనం పాటించడం అనుమానాలను మరింత పెంచుతోంది. గ్రామంలో మొత్తం ఎన్ని ఎకరాల అసైన్డ్ భూమి ఉంది? అసలు పట్టాదారులు ఎంతమంది? ప్రస్తుతం సాగు చేస్తున్న వారు ఎవరు? ప్రభుత్వ రికార్డులు, క్షేత్రస్థాయి పరిస్థితులు ఒకేలా ఉన్నాయా? అనే ప్రశ్నలకు ఇప్పటికీ స్పష్టమైన సమాధానం లేదు. ఈ నేపథ్యంలో జిల్లా కలెక్టర్ ఆదేశాలతో ప్రత్యేక రెవెన్యూ బృందం క్షేత్రస్థాయిలో సమగ్ర సర్వే నిర్వహించాలని గ్రామస్థులు డిమాండ్ చేస్తున్నారు. ప్రతి సర్వే నంబర్‌ను పరిశీలించి, అసలు లబ్ధిదారులు భూమిని సాగు చేస్తున్నారా లేదా ఇతరుల ఆధీనంలో ఉందా అనే విషయాన్ని ప్రజల ముందుంచాలని కోరుతున్నారు. విచారణలో అనధికార ఆక్రమణలు, నిబంధనలకు విరుద్ధమైన బదిలీలు లేదా బినామీ సాగు జరిగినట్లు తేలితే సంబంధిత వారిపై కఠిన చర్యలు తీసుకుని, భూములను తిరిగి అసలు లబ్ధిదారులకు అప్పగించాలని దళిత సంఘాలు, గ్రామస్థులు కోరుతున్నారు. దళితుల సంక్షేమం కోసం కేటాయించిన భూములు నిజంగా దళితుల చేతుల్లోనే ఉన్నాయా? లేక ప్రభావశీలుల ఆధీనంలోకి జారిపోయాయా? అనే ప్రశ్నకు సమాధానం చెప్పాల్సిన బాధ్యత ఇప్పుడు రెవెన్యూ యంత్రాంగంపైనే ఉందని స్థానికులు అంటున్నారు. ఆరోపణలపై అధికారుల సమగ్ర విచారణ జరిగితేనే వాస్తవాలు వెలుగులోకి వచ్చే అవకాశం ఉందని అభిప్రాయపడుతున్నారు.

# డీఎంహెచ్ఓ డాక్టర్ వెంకటరమణపై తప్పుడు ఆరోపణలు మానుకోవాలి

## ఐఎన్‌టీయూసీ పబ్లిక్ హెల్త్ & మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్

తుంగతుర్తి, ఆగస్టు 1,(ప్రజా జ్యోతి): జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ పై కొందరు చేస్తున్న ఆరోపణలు పూర్తిగా నిరాధారమైనవని, వాటిని తీవ్రంగా ఖండిస్తున్నామని జిల్లా ఐఎన్‌టీయూసీ పబ్లిక్ హెల్త్ & మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ తుంగతుర్తి నియోజకవర్గ నాయకులు పేర్కొన్నారు. విధుల పట్ల నిర్లక్ష్యం ప్రదర్శించిన కొందరు ఉద్యోగులను బాధ్యతాయుతంగా పనిచేయాలని డీఎంహెచ్ఓ సూచించిన విషయాన్ని వక్రీకరించి వ్యక్తిగత ఆరోపణలు చేయడం బాధాకరమని వారు తెలిపారు.జిల్లా వైద్యాధికారి గా బాధ్యతలు స్వీకరించినప్పటి నుంచి ఉద్యోగుల పట్ల సానుకూల దృక్పథంతో వ్యవహరిస్తూ, ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించేందుకు అంకితభావంతో పనిచేస్తున్నారని కొనియాడారు. ప్రతిరోజూ కార్యాలయానికి వచ్చే ఫైళ్లను అదే రోజు పరిశీలించి పరిష్కరిస్తూ పారదర్శక పరిపాలన అందిస్తున్నారని పేర్కొన్నారు. ఉద్యోగుల సంక్షేమం తో పాటు ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించడం డీఎంహెచ్ఓ ప్రధాన లక్ష్యమని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన వారిని ప్రశ్నించడం, క్రమశిక్షణ పాటించేలా చర్యలు తీసుకోవడం ఆయన అధికార పరిధిలోని బాధ్యతేనని స్పష్టం చేశారు. అలాంటి చర్యలను వక్రీకరించి తప్పుడు ప్రచారం చేయడం సమంజసం కాదన్నారు. డీఎంహెచ్ఓ పై చేస్తున్న ఆరోపణలు పూర్తిగా అవాస్తవమని, వాస్తవాలకు విరుద్ధమని పేర్కొంటూ, ఇటువంటి తప్పుడు ప్రచారాలను ప్రజలు, ఉద్యోగులు నమ్మవద్దని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ హెల్త్ & మెడికల్ ఎంప్లాయిస్ యూనియన్ జిల్లా నాయకులు గాజుల సోమన్న, యాదగిరి, నరసింహ చారి, భారతి, కమల, రజిత, ఉపేంద్ర, స్వాతి, ఉమా, జయమ్మ తదితరులు పాల్గొన్నారు.

# రివిరాల గ్రామ పంచాయతీలో 'ఇంటింటికీ దోమల నివారణ' కార్యక్రమం ప్రారంభం

నడిగూడెం, ఆగస్టు 1, ప్రజా జ్యోతి: కరివిరాల గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను నివారించే లక్ష్యంతో కరివిరాల గ్రామ పంచాయతీలో శనివారం 'ఇంటింటికీ దోమల నివారణ' ప్రత్యేక కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీమతి మారోజు పార్వతమ్మ అధికారికంగా ప్రారంభించారు. ఈ



సందర్భంగా పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య శాఖ బృందం గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శించి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వ పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మారోజు పార్వతమ్మ మాట్లాడుతూ, గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామస్తులందరూ పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ, గ్రామంలో దోమల నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తామని, ప్రజలు జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్వర్, ఆశా వర్కర్ రమణ కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉష, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# మహిళల భద్రతపై అవగాహన

నిడమనూరు,ఆగస్టు 01(ప్రజాజ్యోతి: మండలంలోని ఆదర్శ పాఠశాలలో ఎస్ఐ విజయ్ కుమార్ ఆధ్వర్యంలో శనివారం విద్యార్థినులకు 'పోలీస్ అక్క' కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యక్తిగత భద్రత, సైబర్ నేరాల





నివారణ, గుడ్ టచ్ బ్యాడ్ టచ్, బాల్య వివాహాలు, మహిళా చట్టాలపై అవగాహన కల్పించారు. సోషల్ మీడియా వినియోగంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, అత్యవసర పరిస్థితుల్లో పోలీసులను ఎలా సంప్రదించాలో వివరించారు.అత్యవసర పరిస్థితుల్లో ప్రతి విద్యార్థిని ధైర్యంగా, ఆత్మవిశ్వాసంతో ముందుకు సాగాలని సూచించిస్తూ పోలీసులను సంప్రదించాలని, సమస్యలపై భయపడకుండా సమాచారం ఇవ్వాలని సూచించారు. ఈకార్యక్రమంలో మహిళా పోలీసులు నౌషిన్, శ్రీవాణి, లయ పాల్గొన్నారు.

# విద్యార్థులకు నాణ్యమైన పౌష్టికాహారం అందించాలి

## బొల్లం మల్లయ్య యాదవ్

నడిగూడెం, ఆగస్టు 01, ప్రజా జ్యోతి: నడిగూడెం మండలం కరివిరాల మోడల్ స్కూల్, హాస్టల్‌ను కోదాడ మాజీ ఎమ్మెల్యే బొల్లం మల్లయ్య యాదవ్ సందర్శించి మధ్యాహ్న భోజనం, హాస్టల్ వసతి, పరిశుభ్రత, భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి ఆహార నాణ్యతను స్వయంగా పరిశీలించడంతో పాటు వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన పౌష్టికాహారం అందించడం ప్రభుత్వ బాధ్యత అని, విద్యారంగానికి తగిన బడ్జెట్ కేటాయించి ఆహారం, వసతి, తాగునీరు, పరిశుభ్రత వంటి మౌలిక సదుపాయాలను మెరుగుపరచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కరివిరాల మోడల్ స్కూల్‌తో పాటు కోదాడ నియోజకవర్గంలోని అన్ని ప్రభుత్వ విద్యాసంస్థల్లో ప్రత్యేక తనిఖీలు నిర్వహించాలని కోరారు.





# అకాడెమిక్ హైట్స్ స్కూల్, హ్యాపీ మెడోస్ ప్లే స్కూల్‌లో ఘనంగా బోనాల సంబరాలు

భువనగిరి,జులై 1ఆగస్ట్ (ప్రజాజ్యోతి): జగదేవ్‌పూర్ రోడ్డులోని అకాడెమిక్ హైట్స్ స్కూల్ మరియు విద్యా నగర్‌లోని హ్యాపీ మెడోస్ ప్లే స్కూల్లో తెలంగాణ రాష్ట్ర ఆధ్యాత్మిక,సాంస్కృతిక వైభవానికి ప్రతీక అయిన బోనాల పండుగను అత్యంత ఘనంగా నిర్వహించారు.ఈ వేడుకల్లో విద్యార్థులు ఉపాధ్యా యులు,తల్లి దండ్రులు సంప్రదాయ తెలుగు దుస్తుల్లో పాల్గొని పండుగకు ప్రత్యేక శోభను తీసుకువ చ్చారు.ఈ సందర్భంగా పాఠశాల చైర్‌పర్సన్ తీగల జయలక్ష్మి మాట్లాడుతూ "భవిష్యత్ తరాలకు తెలంగాణ గ్రామీణ సంస్కృతి,సంప్రదాయాలు ఆచార వ్యవహారాలపై అవగాహన కల్పించడం ప్రతి విద్యాసంస్థ బాధ్యత.పిల్లలు తమ మూలాలను, సంస్కృతిని గౌరవిస్తూ ఎదగాలనే లక్ష్యంతోనే మా పాఠశాలల్లో ప్రతి సంవత్సరం బోనాల పండుగను నిర్వహిస్తున్నాం. ప్రపంచ వ్యాప్తంగా తెలంగాణ సంస్కృతికి ఒక ప్రత్యేకమైన గుర్తింపు ఉంది. ఆ గొప్ప వారసత్వాన్ని విద్యార్థులకు పరిచయం చేయడం మా ప్రధాన ఉద్దేశ్యం" అని తెలిపారు.విద్యార్థులు అందంగా అలంకరించిన బోనాలను మోసుకుంటూ సంప్రదాయ రీతిలో ఊరేగింపు నిర్వహించగా పాఠశాల ప్రాంగణం భక్తి, ఆధ్యాత్మిక వాతావరణంతో కళకళలాడింది. బోనాల జానపద గీతాలకువిద్యార్థులు ఆకట్టుకునే నృత్యప్రదర్శనలు అందించి ప్రేక్షకులను అలరించారు.ప్రత్యేక ఆకర్షణగా కొంతమంది విద్యార్థులు పోతురాజు వేషధారణలో ఉత్సాహ భరితమైన నృత్యాలు ప్రదర్శించి తెలంగాణ జానపద,కళా వైభవాన్ని సజీవంగా ఆవిష్కరించారు. వారి ప్రదర్శనలు అందరినీ విశేషంగా ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో విద్యార్థులు బోనాల పండుగ విశిష్టత, తెలంగాణ సంప్రదాయాలు, గ్రామీణ సంస్కృతి గురించి ప్రసంగాలు, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొని విద్యార్థులను అభినందించారు.ఈ వేడుకలో పాఠశాల ప్రధానో పాధ్యాయులు,ఉపాధ్యా యులు, సిబ్బందివిద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని తెలంగాణ సంస్కృతి పరిరక్షణకు తమ మద్దతును తెలియజేశారు.



# శాఖాపురంలో సీజనల్ జ్వరాలపై కొనసాగుతున్న హైల్త్ క్యాంపు

నిడమనూరు,ఆగష్టు 01(ప్రజాజ్యోతి)ః నిడమానూరు మండలం శాఖాపురంలో సీజనల్ జ్వరాలు పెరుగుతున్న నేపథ్యంలోకలెక్టర్ చంద్రశేఖర్ ఆదేశాల మేరకు ఆరోగ్యశాఖ అధికారులు అప్రమత్తమయ్యారు. ఈవిషయంపై నిడమానూరు ప్రాథమిక వైద్య అధికారి డాక్టర్ అరవింద్ ఆధ్వర్యంలో రెండో రోజు క్యాంపు శాఖాపురం గ్రామంలో ఇంటింటి సర్వే నిర్వహించి గ్రామంలో ఎంతమంది విష



జ్వరాలు ఉన్నాయో లేదో అని వారి రక్త నమూనాలు సేకరించారు. ఈసందర్భంగా నిడమానూరు తహశీల్దార్ కృష్ణయ్య అకస్మిక తనిఖీ చేశారు.అనంతరం ఆయన మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం అస్తవ్యస్తం గా ఉండడం, ఇంట్లో గాబులల్లో నీరు చాలా రోజులుగా నిల్వ ఉండడం వల్లనే ఇలాంటి వైరల్ ఫివర, డెంగీ లక్షణాలు కనిపిస్తాయి అన్నారు.వెంటనే ప్రతి ఇంట్లో నీరు నిల్వ ఉన్న చోటు వెంటనే ఆ నీటిని తొలగించాలని సూచించారు.ఈ శాఖాపురం గ్రామంలో నెల రోజులలోనే రెండోసారి క్యాంపు నిర్వహించినారు అయినా గ్రామంలో వైరల్ ఫివర జ్వరాలు రావడం ఏమిటని డాక్టర్ అరవింద్ ను ప్రశ్నించారు.ఈ విషయం పై డాక్టర్ అరవింద్ మాట్లాడుతూ గ్రామంలో పారిశుద్ధ్యం,ఇంట్లో నీరు నిల్వలు, వీధుల్లో చెత్తాచెదారం ఎక్కువగా పేరుకపోవడంతో వాటి మీద వాలిన దోమలు ఈగలు సంచరిస్తూ ఇలా వైరల్ ఫివర్ రావడానికి అవకాశం ఉంటుదని తెలియజేశారు.మళ్లీ శాఖాపురం గ్రామంలో వైరల్ ఫివర్ ,డెంగీ లక్షణాలు కనిపించకుండా గ్రామస్థులకు అవగాహన కార్యక్రమం నిర్వహించాలని సూచించారు.

అదేవిధంగా గ్రామంలో రెండో రోజు ఇంటి ఇంటి సర్వే దాదాపు 100 ఇల్లులు సర్వే పూర్తి చేశారు . టోటల్ ఓపి – 35జలుబు, వీక్నెస్ లాంటి లక్షణాలు ఉన్న వాళ్ళు,జ్వరాలు కేస్ – 09, టెస్ట్స్ – 09,సస్పెక్ట్ కేసుల్ – 4 బ్లడ్ శాంపిల్స్ సేకరించి నల్లగొండ ల్యాబ్ కి పంపించినట్లు డాక్టర్ అరవింద్ తెలిపారు.అదేవిధంగా జిల్లా ఆరోగ్య శాఖా ఆదేశాల మేరకు ఆదివారం కూడా సర్వే కొనసాగుతుందని డాక్టర్ అరవింద్ అన్నారు.శాఖాపురం గ్రామంలో అన్ని ఇల్లులు సర్వే పూర్తి నిర్వహించనున్నారని తెలిపారు.ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్వరాల బారిన పడిన వారి నుంచి రక్త







నమూనాలు సేకరించి పరీక్షలకు పంపించారు. అవసరమైన వారికి మందులు పంపిణీ చేస్తూ వైద్య సేవలు అందిస్తున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో సర్పంచ్ చేకూరి సూర్యనారాయణ ,డి ఎల్ పి ఓ రాఘవరావు ,డాక్టర్ అరవింద్, మేరిస్టెల్లా పిహెచ్ ఎన్ ,ఎంఎల్ హెచ్ పిలు మౌనిక ,జ్యోతిక ,యునిక్ ఏఎన్ఎం, ఇన్చార్జి ఎంపిఓ సత్యనారాయణ ,పంచాయతీ కార్యదర్శి సైదులు ,ఎఫ్ఎ శ్రీనివాస్ఆశావర్కర్లు ,బారెడ్డిఅనూషారెడ్డి ,మంగ,పద్మ,దీపికా,పంచాయతీ సిబ్బంది నాగయ్య, సుదర్శన్, తదితరులు ,పాల్గొన్నారు.

# జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా చలిమల్ల వెంకటరత్నం

## నియామక పత్రం అందజేసిన ఎమ్మెల్యే బిఎల్ఆర్

మిర్యాలగూడ, ఆగస్టు 01,( ప్రజాజ్యోతి ): నల్లగొండ జిల్లా కాంగ్రెస్ ఎస్సీ సెల్ ఉపాధ్యక్షుడిగా మిర్యాలగూడ మండలం అవంతిపురం గ్రామానికి చెందిన చలిమల్ల వెంకటరత్నం ను నియమిస్తూ జిల్లా ఎస్సీ సెల్ చైర్మన్ బోడ స్వామి ఉత్తర్వులు జారీ చేశారు. శనివారం పట్టణంలోని స్థానిక క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి (బిఎల్ఆర్) చేతుల మీదుగా వెంకటరత్నంకు నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ సందర్భంగా ఎమ్మెల్యే బిఎల్ఆర్ మాట్లాడుతూ పార్టీ పట్ల వెంకటరత్నం చూపిన అంకితభావం చూసి అధిష్టానం తన సేవలను గుర్తిస్తూ పదవి ఇచ్చి గౌరవించిందన్నారు. పార్టీ



కార్యక్రమాలను, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోయి పార్టీని బలోపేతం చేసేలా కృషి చేయాలన్నారు. వెంకటరత్నం మాట్లాడుతూ తనపై నమ్మకంతో జిల్లా స్థాయి బాధ్యతలు అప్పగించిన జిల్లా అధిష్టానానికి, ఎమ్మెల్యే బిఎల్ఆర్ కి, నియోజకవర్గ నాయకత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ కోసం ఎస్సీ సామాజిక వర్గం కోసం నిరంతరంగా కృషి చేస్తానని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు గుండు నరేందర్ గౌడ్, సర్పంచ్లు వల్దాస్ సుజాత సురేష్, మురళి, జోషే గౌడ, దాసరి కుమార్, చలిమల్ల లక్ష్మియ్య, హరిబాబు, బంగారి మహేష్, కోటేష్, అజయ్,శ్రీను, సైదులు తదితరులు పాల్గొన్నారు.

# తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్లన మధ్య ప్రేమానురాగాలతో పెంపొందుతాయిఃతహశీల్దార్ కృష్ణయ్య

## –నిడమనూరు–3 అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాలు...

నిడమానూరు, ఆగష్టు 01(ప్రజాజ్యోతి): తల్లిపాలు బిడ్డకు ఇవ్వడం వల్లన మధ్య ప్రేమానురాగాలతో పెంపొందుతాయని నిడమానూరు తహశీల్దార్ కృష్ణయ్య అన్నారు.నిడమనూరుమండలంలోని ప్రతి అంగన్వాడి





కేంద్రంలో తల్లి పాలు వారోత్సవాలు కార్యక్రమాలు నిర్వహించాలని తహశీల్దార్ జంగాల కృష్ణయ్య సూచించారు.అదేవిధంగా నిడమనూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం–3లో,ముకుందా పురం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం–1లో శనివారం తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు.ఈ సందర్భంగా ఆగస్టు01–0 7 వరకు ప్రతి అంగన్వాడి కేంద్రంలో ఈ కార్యక్రమాలు నిర్వహించాలి.అదేవిధంగా నిడమనూరు సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం–3లో,ముకుందా పురం సెక్టార్ పరిధిలోని అంగన్వాడీ కేంద్రం–1లో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు భాగంగా తల్లులు పాలు ,గర్భిణీలకు తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించారు.అదేవిధంగా తల్లి పాలలో కొలెస్ట్రం అనే పదార్థం ఉంటుంది.మురుపాలు బిడ్డకు అరగంటలోపు ,వీలైనంత తొందరగా ఇవ్వడం వల్ల వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని



తల్లిపాలు ఇవ్వడం వల్ల తల్లి బిడ్డల మధ్య ప్రేమానురాగాలతో పాటు తల్లికి రొమ్ము క్యాన్సర్ లాంటివి రావని.బిడ్డ ఆరోగ్యం గా ఉంటుందని ఎలాంటి అంటువ్యాధులు సోకకుండా బిడ్డ కు ఆరోగ్యంతో పాటు, తల్లి,తండ్రులకు శ్రమ డబ్బు ఖర్చు లాంటివి ఉండవని తల్లులకు అవగాహన కల్పించారు.

ఈ కార్యక్రమంలో సర్పంచ్ పద్మసత్యం,ఐసిడిఎస్ సూపర్వైజర్ లు సైదా బేగం,ఫరీదా బేగం,బొల్లం బాలయ్య, అంగన్వాడీ టీచర్లు రాజేశ్వరి,అలివేలు,అంబటి మణెమ్మ , గర్భిణీ లు బాలింతలు,తల్లులు , తదితరులు పాల్గొన్నారు .

# బిడ్డ ఎదుగుదలకు తల్లిపాలే ఆధారం

హాలియా,ఆగస్టు1(ప్రజా జ్యోతి) ప్రపంచ తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా ఆగస్టు 1నుంచి 7 వరకు అనుముల ప్రాజెక్టు, హాలియా సెక్టర్ పరిధిలోని ఇబ్రహీంపేట అంగన్వాడీ కేంద్రంలో శుక్రవారం తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సదస్సు





నిర్వహించారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సూపర్వైజర్ రమాదేవి మాట్లాడుతూ బిడ్డ పుట్టిన వెంటనే వీలైనంత త్వరగా లభించే చిక్కటి,ముర్రుపాలను తప్పనిసరిగా పట్టించాలని సూచించారు.ఈ ముర్రుపాలు తాగించడం వల్ల శిశువులకు అద్భుతమైన వ్యాధి నిరోధక శక్తి లభిస్తుందని తెలిపారు.శిశువు పుట్టినప్పటి నుండి ఆరు నెలల వయస్సు వచ్చేవరకు కేవలం తల్లిపాలను మాత్రమే అందించాలని అందులోనే బిడ్డకు అవసరమైన నీరు,అన్ని రకాల పోషకాలు సమృద్ధిగా లభిస్తాయని స్పష్టం చేశారు. ఆరు నెలల తర్వాత పిల్లల ఎదుగుదల వేగంగా ఉంటుందని,కాబట్టి తల్లిపాలతో పాటు అంగన్వాడీ కేంద్రం ద్వారా అందించే బాలామృతం ఇంట్లో తయారు చేసిన పోషకాహారాన్ని తప్పనిసరిగా అందించాలని కోరారు.ఈ విధంగా రెండు సంవత్సరాల వయస్సు వచ్చేవరకు తల్లిపాలను కొనసాగించాలని పేర్కొన్నారు. అలాగే,పిల్లల సరైన ఎదుగుదలను పరిశీలించేందుకు ప్రతి నెలా అంగన్వాడీ కేంద్రంలో వారి బరువు,పొడవులను కొలిపించి వయస్సుకు తగ్గ పెరుగుదల ఉందో లేదో తెలుసుకోవాలని తల్లిదండ్రులకు సూచించారు.అవగాహన సదస్సు అనంతరం గ్రామంలో తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రతిబింబించేలా ర్యాలీ నిర్వహించారు.ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు బాజీదాబేగం, గౌసియా బేగం,ఆశా వర్కర్లు,తల్లులు చిన్నారులు పాల్గొన్నారు.

# కమలా నెహ్రూ ఆసుపత్రిలో పాలకవర్గం సమీక్ష

## వైస్ చైర్మన్ గొడవర్తి రాజా ప్రసాద్

నిడమనూరు,ఆగస్టు01(ప్రజాజ్యోతి)ః నందికొండ మున్సిపాలిటీ పరిధిలోని కమలా నెహ్రూ ఆసుపత్రిని నాగార్జున సాగర్ ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి ఆదేశాల మేరకు



శనివారం మున్సిపాల్ పాలకవర్గం ఆసుపత్రి సూపరింటెండెంట్ ,డాక్టర్ హరికృష్ణతో కలిసి సమీక్షా సమావేశం నిర్వహించారు.అనంతరం ఆసుపత్రిలోని వివిధ విభాగాలను పరిశీలించారు.ఈ సందర్భంగా నందికొండ వైస్ చైర్మన్ గొడవర్తి రాజప్రసాద్ మాట్లాడుతూ ఆసుపత్రికి వచ్చే రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు.డ్యూటీ డాక్టర్లందరూ విధుల్లో ఖచ్చితంగా సమయపాలన పాటించాలని స్పష్టం చేశారు.ఆసుపత్రిలో రోగులకు అందుతున్న వైద్యం,మందుల నిల్వలపై సూపరింటెండెంట్ హరికృష్ణ మాట్లాడుతూ అవసరమైన అన్ని రకాల మెడిసిన్స్ అందుబాటులో ఉన్నాయని వదంతులు నమ్మవద్దని ఆయన స్పష్టం చేశారు.ఆసుపత్రిలో ఏవైనా సమస్యలు ఉంటే వెంటనే ఎమ్మెల్యే జయవీర్ రెడ్డి దృష్టికి తీసుకురావాలని నాయకులు సూచించారు.గత వారం ప్రతిపక్ష నాయకులు అర్థం పర్థం లేని ఆరోపణలు చేసి,కాంగ్రెస్ ప్రభుత్వానికి , ఎమ్మెల్యేకు చెడ్డపేరు తెచ్చే ప్రయత్నం చేస్తున్నారని వైస్ చైర్మన్ రాజప్రసాద్ మండిపడ్డారు.ప్రజలు ఇవన్నీ గమనిస్తున్నారు.వచ్చే ఎన్నికలలో తగిన విధంగా బుద్ధి చెబుతారని హెచ్చరించారు. నాయకుడు అంటే ప్రజలకు ధైర్యం ఇవ్వాలి కానీ,భయభ్రాంతులకు గురిచేయకూడదని ప్రతిపక్షాలకు హితవు పలికారు.ఈ కార్యక్రమంలో చైర్మన్ ముఖ్య సలహాదారుడు సుమన్,ఆరో వార్డు కౌన్సిలర్ చందు లాల్ నాయక్,ఒకటో వార్డు కౌన్సిలర్ సలహాదారుడు రాజగోపాల్ రెడ్డి, నాలుగో వార్డు కౌన్సిలర్ సలహాదారుడు మంద గౌతమీ రఘువీర్ బిన్నీ, ఏడో వార్డు కౌన్సిలర్ సలహాదారుడు వెంకటేశ్వర్లు,పదవ వార్డు కౌన్సిలర్ సలహాదారుడు రాజేష్,ఆసుపత్రి సీఎంవో డాక్టర్ హరికృష్ణ,డ్యూటీ డాక్టర్లు , ఆసుపత్రి సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ మండల జనరల్ సెక్రటరీగా ఉప్పునూతల నరసింహా ఎంపిక

భూదాన్ పోచంపల్లి, ఆగస్ట్ 01 (ప్రజాజ్యోతి): భారతీయ జనతా పార్టీ మండల కమిటీ సమావేశంలో ఉప్పునూతల నరసింహను మండల జనరల్ సెక్రటరీగా ఎన్నికయ్యారు. ఈ సమావేశానికి



రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఏలే చంద్రశేఖర్ ముఖ్య అతిథిగా హాజరుకాగా, మండల అధ్యక్షుడు మేకల రవీందర్ రెడ్డి అధ్యక్షత వహించారు. నూతనంగా బాధ్యతలు స్వీకరించిన నరసింహ మాట్లాడుతూ పార్టీ అభివృద్ధికి ఎల్లప్పుడూ కృషి చేస్తానని, పార్టీ అప్పగించే ప్రతి బాధ్యతను సమర్థవంతంగా నిర్వహిస్తానని తెలిపారు. కార్యక్రమంలో అసెంబ్లీ కన్వీనర్ చిక్క కృష్ణ, జిల్లా కౌన్సిల్ సభ్యుడు పల్లెకాడి బసవయ్య, జిల్లా ఎస్సీ మోర్చా అధ్యక్షుడు చెరుకు వెంకటేష్, జిల్లా కిసాన్ మోర్చా ఉపాధ్యక్షుడు మేకల చొక్కారెడ్డి, గంజి బస్వలింగం, బోదాస్ మల్లేష్, ముద్దం హరీష్, బైరు వెంకటేష్, కేసారం కృష్ణారెడ్డి, మేకల చంద్రవాస్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఇంటి ముందు ఇంకుడు గుంత నిర్మించుకు నేలా మహిళా సంఘాలు కృషి చేయాలి

బాల్కొండ ఆర్ సి, ప్రజా జ్యోతి, ఆగస్టు 1:
నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలంలో ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ భీంగల్ మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఈరోజు ఇందిరా క్రాంతి పథకం



మరియు ఉపాధి హామీ పథకం సిబ్బందితో జలసిరి కార్యక్రమం పై ఎంపీడీవో గంగుల సంతోష్ కుమార్ సమీక్ష సమావేశం నిర్వహించారు జలసిరి కార్యక్రమం ద్వారా గ్రామంలోని ప్రతి ఇంటి దగ్గర ఇంకుడు గుంతల నిర్మించుకో వడానికి స్వయం సహాయక సంఘాల గ్రూపుల ద్వారా ప్రతి ఇంటి దగ్గర నిర్మించుకోవడానికి లబ్ధిదారులను ఐడెంటిఫై చేయాలని కోరడం జరిగింది మొదటి విడతలు మహిళా సంఘాల ద్వారా 50 ఇళ్లకు ఇంకుడు గుంతలు గ్రామ సర్పంచ్ పంచాయతీ సెక్రెటరీ ఫీల్డ్ అసిస్టెంట్ ద్వారా 50 ఇంకుడు గుంతలు మొత్తం 100 ఇంకుడు గుంతలను ఆగస్టు 15వ తేదీ లోపు పూర్తయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు అదేవిధంగా ప్రతి గ్రామంలో రైతుల పొలాల్లో ఫారం పాండ్లు వాటర్ హార్వెస్టింగ్ స్ట్రక్చర్లు నిర్మించాలని అదేవిధంగా కమ్యూనిటీ స్థలాలైన ప్రభుత్వ సంస్థలు పాఠశాలలు మినీ వాటర్ ట్యాంకు దగ్గర కమ్యూనిటీ సోక్ పిట్స్ నిర్మించాలని కోరారు సమీక్షా సమావేశంలో ఏపీఎం ప్రమీల ఏపీఓ నరసయ్యఈసీ చందు సీసీలు టెక్ని అసిస్టెంట్లు కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

## బాధవత్ గోపాల్ నాయక్ కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్

బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఆగస్టు 1:
నిజామాబాద్ జిల్లా భీంగల్ మండలం కారేపల్లి గ్రామానికి చెందిన బాధవత్ గోపాల్ నాయక్ ఇటీవల పదే పదే కాంగ్రెస్ పార్టీపై అనుచిత వ్యాఖ్యలు చేసినందుకు గాను జిల్లా కాంగ్రెస్ పార్టీ క్రమ శిక్షణ చర్యలు తీసుకుంది. గోపాల్ నాయక్ ను కాంగ్రెస్ పార్టీ నుండి సస్పెండ్ చేస్తున్నట్టు జిల్లా కాంగ్రెస్ అధ్యక్షుడు లేఖను విడుదల చేశారు ఇక మీదట గోపాల్ నాయక్ కు కాంగ్రెస్ పార్టీకి ఎటువంటి సంబంధం లేదని లేఖలో తెలిపారు.

## విశారదన్ మహారాజ్ అరెస్ట్ ను తీవ్రంగా ఖండించిన కమ్మర్పల్లి మండల బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నేత గుర్రం నరేష్

బాల్కొండ ఆర్ సి ప్రజా జ్యోతి ఆగస్టు 1 :
నిజామాబాద్ జిల్లా కమ్మర్పల్లి మండల్ జగిత్యాల జిల్లా నూకపల్లి లో అర్బన్ డబుల్ బెడ్రూం కాలనీ వాసుల సమస్యల కోసం వెళ్లి అక్కడ అనేక సమస్యలు




ఉన్నాయని తెలుసుకొని, వాటిని పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ కాలనీ వాసులతో కలిసి శాంతియుత ధర్నా కు కూర్చున్న తెలంగాణ రాష్ట్ర బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ అధ్యక్షులు డా. విశారదన్ మహారాజ్ ను జగిత్యాల పోలీసులు అరెస్ట్ చేయడం పట్ల కమ్మర్పల్లి మండల బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ నాయకుడు గుర్రం నరేష్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ,, ప్రజల సమస్యలకు పరిష్కారం చూపి ప్రజా అవసరాలు మౌలిక వసతులు కల్పించడం ప్రభుత్వం బాధ్యత అని గుర్తు చేస్తూ డా.విశారదన్ మహారాజ్ గారు ప్రజల పక్షాన పోరాడితే అరెస్ట్ చేయడం ఏంటని ప్రశ్నించారు. విశారదన్ మహారాజ్ గారు రాష్ట్రంలో ఎక్కడ సమస్యలు ఉంటే అక్కడికి వెళ్లి న్యాయం కోరిన ప్రతి సారి పోలీసులు అరెస్టులు చేస్తున్నారు ఎందుకు.? ప్రభుత్వాలే ప్రజలకు సరిగా పనులు చేస్తే ఇలాంటి ధర్నాలు ఎవరు ఎందుకు చేస్తారు అని అన్నారు. ఇకనైనా ప్రభుత్వం నూకపల్లి డబుల్ బెడ్రూం ఇండ్ల వాసులకు,ప్రజలకు వసతులు కల్పించడం పట్ల బాధ్యత వహించాలని అన్నారు .అలాగే విశారదన్ మహారాజ్ అరెస్ట్ కు నిరసనగా నేడు జగిత్యాల బంద్ కు బీసీ ఎస్సీ ఎస్టీ జేఏసీ & ధర్మసమాజ్ పార్టీ పిలుపునిచ్చిన విషయాన్ని గుర్తు చేశారు.

## దోంగ్లిలో అన్నాభావు సాఠే జయంతి వేడుకలు

డోంగ్లి ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):
కామారెడ్డి జిల్లా డోంగ్లి మండల కేంద్రంలో లోకశాహీర్ అన్నాభావు సాఠే 106వ



జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఎస్సీ కమ్యూనిటీ హాల్‌లోని అన్నాభావు సాఠే చౌక్‌లో జెండా వందనం కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. గ్రామ నాయకులు విలాస్ పటేల్ మాట్లాడుతూ.... సమాజ అభ్యున్నతికి అన్నాభావు సాఠే చేసిన సేవలను వక్తలు కొనియాడారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ దిగంబర్ పటేల్, శశాంక్ పటేల్, ఓంకార్ పటేల్, మారోతి, లహూజీ యూత్ సభ్యులు సుభాష్, సురేష్, అర్జున్, చంద్రకాంత్, సునీల్, రాంచందర్, నాందేవ్ పాల్గొన్నరు.

## గ్రామ పంచాయితీ రికార్డులను పరిశీలించిన ఎంపీడీవో హరి నందన్ రావు

కల్హే ర్. 1.ఆగష్టు. ప్రజా జ్యోతి
కల్హేర్ మండలంలోని మార్డి, బీబీపేట్ గ్రామాల్లో ఎంపీడీవో హరినందన్ రావు



పర్యటించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల పంచాయతీ కార్యాలయాలను సందర్శించి రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. పంచాయతీ నిర్వహణ, అభివృద్ధి పనుల పురోగతిపై అధికారులకు పలు సూచనలు చేశారు.
అనంతరం మార్డి గ్రామ ప్రభుత్వ పాఠశాలను తనిఖీ చేసి, విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. నాణ్యతా ప్రమాణాలు పాటిస్తూ విద్యార్థులకు మెరుగైన సౌకర్యాలు కల్పించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.

# బర్రెలు అడ్డం రావడంతో ఆటో బోల్తా

**ఇద్దరు మహిళా కూలీలకు తీవ్ర గాయాలు**

**పలువురికి స్వల్ప గాయాలు**

**మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు**

కామారెడ్డి ప్రతినిధి ఆగస్ట్ 1 ప్రజాజ్యోతి:
పొలం నాటు పనులు ముగించుకుని స్వగ్రామానికి తిరిగి వస్తున్న వ్యవసాయ కూలీలను తీసుకెళ్తున్న ఆటో ప్రమాదానికి గురైంది. మార్గమధ్యలో ఒక్కసారిగా బర్రెలు ఆటోకు అడ్డంగా రావడంతో డ్రైవర్ వాహనాన్ని అదుపు చేయలేకపోయాడు. దీంతో ఆటో బోల్తా పడగా అందులో ప్రయాణిస్తున్న కూలీల్లో ఇద్దరు మహిళలు తీవ్రంగా గాయపడగా, మరికొందరు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. వివరాల్లోకి వెళితే... చినురువాడి గ్రామానికి చెందిన వ్యవసాయ కూలీలు నాగిరెడ్డిపేట్ మండలంలోని వదలపర్తి గ్రామంలో నాటు పనులు ముగించుకుని ఆటోలో స్వగ్రామానికి బయలుదేరారు. గ్రామానికి వస్తున్న క్రమంలో రోడ్డుపైకి అకస్మాత్తుగా బర్రెల మంద రావడంతో ఆటో డ్రైవర్ వాటిని తప్పించేందుకు ప్రయత్నించాడు. అయితే వాహనం అదుపుతప్పి రోడ్డుపక్కకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో బసలా చంద్రవ్వ, మాసన్‌పల్లి గంగవ్వ తీవ్రంగా గాయపడగా, ఆటోలో ఉన్న మరికొందరు కూలీలు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు వెంటనే సహాయక చర్యలు చేపట్టి క్షతగాత్రులను బయటకు తీశారు. అనంతరం అత్యవసర సేవలకు సమాచారం అందించారు. సమాచారం అందుకున్న 108 అంబులెన్స్ సిబ్బంది సంఘటన స్థలానికి చేరుకుని క్షతగాత్రులకు ప్రాథమిక చికిత్స అందించారు.







తీవ్రంగా గాయపడిన బసలా చంద్రవ్వ, మాసన్‌పల్లి గంగవ్వలను మెరుగైన వైద్యం కోసం మెదక్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. స్వల్ప గాయాలైన వారికి అవసరమైన వైద్య సేవలు అందించారు. ఈ సందర్భంగా 108 అంబులెన్స్ ఈఎంటీ ప్రశాంత్ కుమార్, పైలట్ దళపతి మాట్లాడుతూ, ప్రమాద సమాచారం అందిన వెంటనే సంఘటన స్థలానికి చేరుకుని బాధితులను సురక్షితంగా ఆసుపత్రికి తరలించినట్లు తెలిపారు. సమయానికి స్పందించిన స్థానికుల సహకారంతో సహాయక చర్యలు వేగంగా చేపట్టినట్లు పేర్కొన్నారు. ఈ ప్రమాదంతో కొంతసేపు ఆ ప్రాంతంలో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. రహదారులపై పశువులు అకస్మాత్తుగా అడ్డం రావడం వల్ల తరచూ ప్రమాదాలు జరుగుతున్నా యని, సంబంధిత అధికారులు తగిన చర్యలు తీసుకుని ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.

# రాఘవపూర్‌లో ఇందిరమ్మ చీరల పంపిణీ

**గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్**

**అర్హులైన మహిళలకు చీరలు అందజేసిన ప్రజాప్రతినిధులు**

**పెద్ద సంఖ్యలో పాల్గొన్న గ్రామస్తులు**

కామారెడ్డి ప్రతినిధి, ఆగస్ట్ 1 ప్రజా జ్యోతి:
కామారెడ్డి మండలం రాఘవపూర్ గ్రామంలో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం కోసం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ చీరల పంపిణీ కార్యక్రమం కామారెడ్డి మండలంలోని రాఘవపూర్ గ్రామంలో ఘనంగా నిర్వహించారు. గ్రామంలోని అర్హులైన మహిళలకు ఉత్సాహభరిత వాతావరణంలో ఇందిరమ్మ చీరలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి గ్రామ సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్ ముఖ్య అతిథిగా హాజరై లబ్ధిదారులకు చీరలను అందజేశారు. ఉప సర్పంచ్ నరేష్, వీఓఏ లావణ్య, గ్రామ సంఘం అధ్యక్షురాలు, సీఏలు, గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి లత, జీపీవో రవి తదితరులు కార్యక్రమంలో పాల్గొని పంపిణీని విజయవంతం చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ ఎడ్ల వీనిల నరేష్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం మహిళల సంక్షేమం, ఆర్థిక భద్రత, సామాజిక అభివృద్ధికి పెద్దపీట వేస్తూ అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తోందని తెలిపారు. ప్రతి అర్హులైన లబ్ధిదారునికి ప్రభుత్వ సంక్షేమ పథకాల ఫలాలు అందేలా గ్రామస్థాయి అధికారులు, ప్రజాప్రతి నిధులు సమన్వయంతో పనిచేస్తున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకుని కుటుంబాభివృద్ధికి తోడ్పడాలని ఆయన సూచించారు. ఉప సర్పంచ్ నరేష్ మాట్లాడుతూ గ్రామంలోని ప్రతి అర్హ మహిళకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఇందిరమ్మ చీరలు అందేలా చర్యలు తీసుకున్నా మని తెలిపారు. అధికారులు, గ్రామ సంఘాల ప్రతినిధులు సమన్వయంతో కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహించినందుకు అభినందనలు తెలిపారు. వీఓఏ లావణ్య మాట్లాడుతూ లబ్ధిదారుల



ఎంపిక నుంచి పంపిణీ వరకు పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మాధవి లత, జీపీవో రవి మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు అన్ని ఏర్పాట్లు చేసి కార్యక్రమాన్ని సజావుగా నిర్వహించినట్లు వెల్లడించారు. కార్యక్రమంలో గ్రామ సంఘం అధ్యక్షురాలు, సీఏలు, మహిళా సంఘాల సభ్యులు, గ్రామ పెద్దలు, ప్రజాప్రతినిధులు, అధికారులు, లబ్ధిదారులు, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

## అర్హులకే ఇందిరమ్మ ఇళ్లు.. మల్కాపూర్‌లో క్షేత్రస్థాయి ధ్రువీకరణ..

**తహసీల్దార్ అశోక్, హౌసింగ్ ఏఈ రాజేశ్వరి లబ్ధిదారుల వివరాల పరిశీలన..**

కొండాపూర్, ప్రజా జ్యోతి:
ప్రభుత్వం ప్రతిష్మాత్మకంగా అమలు చేస్తున్న ఇందిరమ్మ గృహ పథకంలో అర్హులైన లబ్ధిదారులకే ఇళ్ల మంజూరు జరిగేలా అధికారులు క్షేత్రస్థాయిలో తనిఖీలు ముమ్మరం చేశారు. ఇందులో భాగంగా కొండాపూర్ మండలంలోని మల్కాపూర్ గ్రామంలో తహసీల్దార్ అశోక్, హౌసింగ్ శాఖ ,ఏఈ రాజేశ్వరి సంయుక్తంగా లబ్ధిదారుల ధ్రువీకరణ చేపట్టారు.ఈ సందర్భంగా లబ్ధిదారుల



కుటుంబ వివరాలు, అర్హత ప్రమాణాలు, ఇంటి స్థలం, ఆర్థిక పరిస్థితి తదితర అంశాలను పరిశీలించి ప్రభుత్వ నిబంధనలకు అనుగుణంగా ధ్రువీకరణ నిర్వహించారు. అర్హత కలిగిన ప్రతి కుటుంబానికి పారదర్శకంగా గృహ పథకం ప్రయోజనం అందించడమే ప్రభుత్వ లక్ష్యమని అధికారులు తెలిపారు.ధ్రువీకరణ ప్రక్రియలో ఎలాంటి తప్పుడు వివరాలు సమర్పించినా చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. అలాగే నిజమైన అర్హులు మాత్రమే పథకం లబ్ధి పొందేలా ప్రతి దరఖాస్తును క్షుణ్ణంగా పరిశీలి స్తున్నామని పేర్కొన్నారు. లబ్ధిదారులు అవసరమైన పత్రాలు సిద్ధంగా ఉంచి అధికారులకు సహకరించాలని, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై ప్రజలు అవగాహన పెంచుకోవాలని అధికారులు సూచించారు.

# ఆగస్టు 10 'జైల్ భరో'ను జయప్రదం చేయాలి

**క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో దేశవ్యాప్త ఆందోళనకు సీఐటీయూ, రైతు–వ్యవసాయ కార్మిక సంఘాల పిలుపు: సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్**

కామారెడ్డి ప్రతినిధి ఆగస్టు 1 (ప్రజాజ్యోతి);
క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా, కార్మిక, రైతు వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈ నెల 10న



నిర్వహించనున్న దేశవ్యాప్త "జైల్ భరో" కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సెంటర్ ఆఫ్ ఇండియన్ ట్రేడ్ యూనియన్స్ (సీఐటీయూ), అఖిల భారత కిసాన్ సభ (ఏఐకేఎస్), అఖిల భారత వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) పిలుపునిచ్చినట్లు సీఐటీయూ జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్ తెలిపారు. శుక్రవారం కామారెడ్డిలోని సీఐటీయూ జిల్లా కార్యాలయంలో మూడు సంఘాల జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా చంద్రశేఖర్ మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం నాలుగు లేబర్ కోడ్లను అమలు చేస్తూ కార్మికులు సుదీర్ఘ పోరాటాలతో సాధించుకున్న హక్కులను కాలరాస్తోందని విమర్శించారు. పని గంటలను 8 నుంచి 12 గంటలకు పెంచే ప్రయత్నాలు, 'హైర్ అండ్ ఫైర్' విధానాలు, కనీస వేతనాలు, సామాజిక భద్రతపై నిర్లక్ష్యాన్ని తీవ్రంగా ఖండించారు. వెంటనే నాలుగు లేబర్ కోడ్లను ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. విదేశీ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందాల వల్ల దేశీయ వ్యవసాయ ఉత్పత్తులకు గిట్టుబాటు ధరలు లేక రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల మేరకు పంటల ఉత్పత్తి వ్యయానికి 50 శాతం అదనంగా మద్దతు ధర ప్రకటించాలని, రైతుల రుణమాఫీకి చట్టం తీసుకురావాలని కోరారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరిచే చర్యలను విరమించుకోవాలని, ఉపాధి హామీ పథకానికి తగిన నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ బిల్లు–2025ను ఉపసంహరించుకోవడంతో పాటు ఉచిత విద్యుత్ రద్దు కుట్రలను నిలిపివేయాలని, ఆహార భద్రతా చట్టం కింద పేదలకు అందించే బియ్యంలో కోత విధించే చర్యలను విరమించుకోవాలని కోరారు. దేశ స్వాతంత్ర్య పోరాటంలో కీలకమైన క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు, ప్రజలు ఏకమై కేంద్ర ప్రభుత్వ కార్పొరేట్ అనుకూల విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో వేలాదిగా పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో రైతు సంఘం జిల్లా నాయకులు మోతి రామ్ నాయక్, వెంకట్ గౌడ్, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొత్త నరసింహులు, అధ్యక్షుడు వెంకటి, రైతు సంఘం జిల్లా అధ్యక్షుడు మోహన్, కార్యదర్శి దశరథ్, కార్మిక సంఘం నాయకులు అరుణ్, రాజనర్సు, శ్రామిక మహిళ జిల్లా కన్వీనర్ రేణుక తదితరులు పాల్గొన్నారు.

## తల్లిపాల వారోత్సవాల సందర్భంగా తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సమావేశం..

**పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలి**

కొండాపూర్ ప్రజా జ్యోతి:
ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా ఆగస్టు 1 నుంచి 7వ తేదీ వరకు నిర్వహిస్తున్న కార్యక్రమాల్లో భాగంగా శనివారం హరిదాస్‌పూర్–1 అంగన్‌వాడీ కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి గర్భిణీలు, బాలింతలు, చిన్నారుల తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులు, మామలు, అత్తలు తదితరులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు. కార్యక్రమంలో ఏఎన్ఎం విజయలక్ష్మి , ఆశా కార్యకర్త సంపూర్ణ పాల్గొని తల్లిపాల ప్రాధాన్యతపై అవగాహన కల్పించారు.ఈ సందర్భంగా అంగన్వాడీ టీచర్ ఏసుమని మాట్లాడుతూ, పుట్టిన వెంటనే శిశువుకు వచ్చే ముర్రుపాలు (పసుపు రంగు పాలు) తప్పనిసరిగా పట్టించాలని తెలిపారు. ముర్రుపాలలో రోగనిరోధక శక్తిని పెంచే పోషకాలు అధికంగా ఉండటంతో శిశువులు ఆరోగ్యంగా, బలంగా ఎదుగుతారని వివరించారు.
పుట్టినప్పటి నుంచి మొదటి ఆరు నెలల వరకు శిశువుకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఈ కాలంలో తేనె, నీరు లేదా ఇతర ఆహార పదార్థాలు ఎట్టి పరిస్థితుల్లోనూ ఇవ్వకూడదని సూచించారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత తల్లిపాలతో పాటు అదనపు ఆహారం ప్రారంభించాలని తెలిపారు.తల్లిపాలు ప్రకృతి సిద్ధంగా శిశువుకు దేవుడు ప్రసాదించిన అమూల్యమైన వరమని, ప్రతి తల్లి తప్పనిసరిగా తన బిడ్డకు తల్లిపాలు అందించాలని, కుటుంబ సభ్యులందరూ తల్లిపాల ప్రోత్సాహానికి సహకరించాలని పిలుపునిచ్చారు.



## జర్నలిస్టుల సమస్యల పరిష్కారమే ఎజెండాగా...

**3 న టి యు డబ్ల్యూ జే (ఐ జేయు)జిల్లా కార్యవర్గ సమావేశం !**

**జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి**

సంగారెడ్డి ప్రజా జ్యోతి ప్రతినిధి
తెలంగాణ స్టేట్ యూనియన్ ఆఫ్ వర్కింగ్ జర్నలిస్ట్ (టి యు డబ్ల్యూ జే –ఐ జే యు) సంగారెడ్డి జిల్లా శాఖ తొలి కార్యవర్గ సమావేశం సోమవారం నాడు సదాశివపేటలో జరుగుతుందని జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి, ప్రధాన కార్యదర్శి ఆర్ అనిల్ కుమార్,



ఎలక్ట్రానిక్ మీడియా విభాగం జిల్లా అధ్యక్షుడు ఆసిఫ్, ప్రధాన కార్యదర్శి బసవేశ్వర్ శనివారం తెలిపారు. జర్నలిస్టులు అనేక సమస్యలను ఎదుర్కొంటున్న ప్రస్తుత తరుణంలో ,ఈ సమావేశానికి చాలా ప్రాధాన్యత ఉన్నదని వారు అన్నారు.గత నెల 9వ తేదీన సంగారెడ్డిలో జిల్లా మహాసభ ను జర్నలిస్టుల ఆకాంక్షలకు అనుగుణంగా పెద్ద ఎత్తున నిర్వహించినట్లు వారు చెప్పారు. జిల్లా నలు మూలల నుంచి పెద్ద ఎత్తున జర్నలిస్టులు హాజరైనందుకు వారు కృతజ్ఞతలు తెలిపారు.జర్నలిస్టుల సంక్షేమమే లక్ష్యంగా దశాబ్దాలుగా తమ సంఘం పనిచేస్తున్నదని వారు వివరించారు. వర్కింగ్ జర్నలిస్టులకు అక్రిడేషన్ కార్డులను మంజూరు చేయించడంతోపాటు... వాటిని మండల స్థాయి గ్రామీణ జర్నలిస్టులకు కూడా ప్రభుత్వం ఇచ్చే విధంగా పోరాటం చేశామన్నారు. నాడు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో... నేడు తెలంగాణలో కూడా జర్నలిస్టుల అభివృద్ధికి, సంక్షేమానికి, సమస్యల పరిష్కారానికి పాటుపడుతున్న సంఘం గా ఉన్నామని బండారు యాదగిరి వివరించారు. సదాశివపేటలో సోమవారం జరిగే జిల్లా కార్యవర్గ సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం ఏ కే ఫైసల్ హాజరవుతున్నా రని వివరించారు. ఈ సమావేశంలో
అనేక విషయాలపై చర్చించనున్నట్లు వెల్లడించారు. ముఖ్యంగా అర్హులైన జర్నలిస్టులకు ఇంటి స్థలం సాధించేందుకు చర్చిస్తామని అన్నారు. అదేవిధంగా ప్రతి జర్నలిస్టుకు హెల్త్ కార్డు మంజూరు చేసేందుకు ప్రభుత్వంపై ఒత్తిడి చేయనున్నట్లు తెలిపారు. జిల్లాలో ని నియోజకవర్గస్థాయి కమిటీల ఏర్పాటు గురించి చర్చిస్తామని అన్నారు. జర్నలిస్టుల సంక్షేమము, అభివృద్ధికి సంబంధించిన ఇతర అంశాలపై కూడా ఈ సమావేశంలో కార్యాచరణ ప్రకటించనున్నట్లు జిల్లా అధ్యక్షుడు బండారు యాదగిరి పేర్కొన్నారు. కార్యవర్గ సభ్యులు సకాలంలో హాజరుకావాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## గ్రామంలో మద్యం అమ్మకాలు జరుగుతే 5000 రూపాయలు జరిమానా

- స్వచ్ఛ గ్రామమే లక్ష్యంగా తీర్చిదిద్దుతాం
- మద్యం అమ్మకాలపై నోటీసులు జారీ
- పంచాయతీ కార్యదర్శి సంతోష్

మనోహరాబాద్, ఆగస్టు 01 ( ప్రజా జ్యోతి) మనోహరాబాద్ మండలంలోని కొండాపూర్ గ్రామంలో మద్యం నిషేధిత గ్రామంగా తీర్చిదిద్దడమే లక్ష్యంగా గ్రామంలో మద్యం నిషేధించడంతో శనివారం పలు దుకాణాలకు నోటీసులు జారీ




చేశామని పంచాయతీ కార్యదర్శి సంతోష్ తెలిపారు. పంచాయతీ కార్యదర్శి సంతోష్ మాట్లాడుతూ గ్రామంలో యువత తప్పుదోవ పట్టకుండా ఎవరైనా మద్యానికి బానిసలు కాకుండా మద్య నిషేధంతో క్రమశిక్షణ ఏర్పడుతుందని అప్పుడే స్వచ్ఛ గ్రామంగా తీర్చిదిద్దొచ్చని ఆయన అన్నారు. అందుకే గ్రామ సభ తీర్మానం మేరకు గ్రామంలో మద్యం నిషేధిస్తూ గ్రామపంచాయతీ తీర్మానం పేర్కొని నోటీసులు జారీ చేయడం అయిందని ఆయన అన్నారు. గ్రామంలో మద్యం అమ్మకాలు జరుగుతే 5000 జరమాన తప్పదని అయిన అమ్మకాలు జరుగుతే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని పంచాయతీ కార్యదర్శి హెచ్చరించారు. వీరితోపాటు పంచాయతీ సిబ్బంది పలువురు పాల్గొన్నారు.

## బందారంలో ఆషాఢ బోనాలు ఘనంగా

### రెడ్డి సంఘం ఆధ్వర్యంలో మహంకాళి అమ్మవారికి బోనాల సమర్పణ

కొండపాక, ఆగస్టు 1: కొండపాక మండలంలోని బందారం గ్రామంలో ఆషాఢ మాసం సందర్భంగా శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలను రెడ్డి సంఘం ఆధ్వర్యంలో శనివారం సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో ఘనంగా నిర్వహించారు. ఆనవాయితీ ప్రకారం రెడ్డి సంఘ సభ్యులు మహంకాళి అమ్మవారికి బోనాలను సిద్ధం చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ శివశక్తుల పూనకాలు, పోతురాజుల విన్యాసాల మధ్య బోనాల ఊరేగింపు గ్రామ ప్రధాన వీధుల గుండా వైభవంగా సాగింది. మహిళలు తలపై



బోనాలు మోసుకుంటూ భక్తినినాదాల మధ్య ఆలయానికి చేరుకోవడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభను సంతరించుకుంది. మహంకాళి ఆలయానికి చేరుకున్న అనంతరం అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, నైవేద్యం, హారతులు నిర్వహించారు. గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుభిక్షం, పుష్కలంగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని భక్తులు అమ్మవారిని ప్రార్థించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ, ఆషాఢ మాసంలో మహంకాళి అమ్మవారికి బోనాలు సమర్పించడం గ్రామంలో తరతరాలుగా వస్తున్న ఆనవాయితీ అని తెలిపారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, రెడ్డి సంఘ సభ్యులు, మహిళలు, యువకులు, శివశక్తులు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని ఉత్సవాలను విజయవంతం చేశారు.

## ప్రమాదవశాత్తు ట్రాక్టర్ కిందపడి డ్రైవర్ మృతి

నంగునూరు, ఆగస్టు1(ప్రజా జ్యోతి):- రోజూ కుటుంబ పోషణ కోసం శ్రమించే ఓ డ్రైవర్... వ్యవసాయ పనిలో సాయం చేస్తూ విధి వక్రించడంతో ప్రాణాలు కోల్పోయాడు. నంగునూరు మండలం ఘనపూర్ గ్రామంలో చోటుచేసుకున్న ఈ ఘటన గ్రామస్థులను తీవ్ర విషాదంలో ముంచెత్తింది. ఘనపూర్ గ్రామానికి చెందిన బత్తుల బాపురాజు (39) వృత్తిరీత్యా డ్రైవర్. కుటుంబ పోషణ కోసం కష్టపడి పనిచేసే ఆయన, శుక్రవారం వ్యవసాయ భూమిలో ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న సమయంలో అకస్మాత్తుగా ఫిట్స్ రావడంతో ట్రాక్టర్‌పై నుంచి కిందపడిపోయాడు. దురదృష్టవశాత్తు ట్రాక్టర్ వెనుక ఉన్న కేజ్ వీల్స్ ఆయన శరీరంపై నుంచి వెళ్లడంతో తీవ్ర గాయాలయ్యాయి. తోటి రైతులు, గ్రామస్థులు వెంటనే స్పందించి బాపురాజును సిద్దిపేటలోని ప్రభుత్వ ఆసుపత్రి, తరలించారు. అక్కడ పరీక్షించిన వైద్యులు అప్పటికే ఆయన మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ వార్త తెలిసిన వెంటనే కుటుంబ సభ్యులు, బంధువులు ఆసుపత్రికి చేరుకుని కన్నీరుమున్నీరయ్యారు. గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. బాపురాజు సౌమ్య స్వభావం కలిగిన వ్యక్తిగా గ్రామంలో మంచి పేరు సంపాదించుకున్నారని గ్రామస్థులు గుర్తుచేసుకున్నారు. కుటుంబ బాధ్యతల కోసం నిరంతరం శ్రమించే ఆయన అకాల మరణం గ్రామ ప్రజలను తీవ్ర దిగ్భ్రాంతికి గురిచేసింది. మృతుడి కుమారుడు బత్తుల సాయి చరణ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు రాజగోపాల్‌పేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్ఐ టి. వివేక్ తెలిపారు. ఈ విషాద ఘటన మరోసారి వ్యవసాయ పనుల్లో భద్రతా జాగ్రత్తల ప్రాధాన్యతను గుర్తుచేస్తోంది. ముఖ్యంగా ఫిట్స్ వంటి ఆరోగ్య సమస్యలు ఉన్నవారు ట్రాక్టర్లు, భారీ యంత్రాలను నడిపేటప్పుడు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు, నిపుణులు సూచిస్తున్నారు. ఒక కుటుంబానికి ఆధారంగా నిలిచిన వ్యక్తిని కోల్పోవడంతో ఆ ఇంట్లో తీవ్ర విషాదం నెలకొంది.



## స్నేహమేరా జీవితం

### స్నేహితుల దినోత్సవం ప్రత్యేక కథనం



"స్నేహమేరా జీవితం... స్నేహమే శాశ్వత సంపద" అని చెప్పడంలో అతిశయోక్తి లేదు. పుట్టుకతో వచ్చే బంధాలు ఎన్నో ఉన్నా, మనసుకు నచ్చి మనమే ఎంచుకునే బంధం ఒక్కటే... అదే స్నేహం. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి అనే తేడాలు లేకుండా హృదయాలను కలిపే పవిత్రమైన అనుబంధం స్నేహం. జీవితంలో ప్రతి మలుపులో స్నేహితుడి పాత్ర ఎంతో కీలకం. చిన్ననాటి అల్లరుల్లో తోడుగా, యవ్వనంలో కలలకు బలంగా, కష్టకాలంలో ధైర్యంగా, విజయాల్లో అభినందించే వ్యక్తిగా స్నేహితుడు నిలుస్తాడు. కన్నీళ్లు వచ్చినప్పుడు ఓదార్పు, తప్పు చేసినప్పుడు మందలింపు, నిరాశలో ఆశను నింపే వ్యక్తే నిజమైన స్నేహితుడు. ప్రపంచవ్యాప్తంగా ప్రతి సంవత్సరం ఆగస్టు మొదటి ఆదివారం స్నేహితుల దినోత్సవాన్ని జరుపుకుంటారు. ఈ సందర్భంగా స్నేహితులు ఒకరినొకరు కలిసి శుభాకాంక్షలు తెలుపుకోవడం, ఫ్రెండ్‌షిప్ బ్యాండ్లు కట్టుకోవడం, బహుమతులు ఇచ్చిపుచ్చుకోవడం, పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకోవడం ఆనవాయితీగా మారింది. నేటి సోషల్ మీడియా కాలంలో వందలాది పరిచయాలు ఏర్పడుతున్నా, కష్టకాలంలో చేయి పట్టి నిలబెట్టే ఒక నిజమైన స్నేహితుడు ఉంటే చాలు అనే భావన మరింత బలపడుతోంది. నిజమైన స్నేహం లైక్‌లు, కామెంట్‌లతో కాదు... నమ్మకం, నిజాయితీ, పరస్పర గౌరవం, ఆప్యాయతతో నిలుస్తుంది. మానసిక ఒత్తిళ్లు, పోటీ ప్రపంచంలో ఒంటరితనం పెరుగుతున్న ఈ రోజుల్లో మంచి స్నేహితుడు ఒక ఔషధంలా మారుతున్నాడు. సమస్యలను పంచుకునే అవకాశం, మనసులోని మాట చెప్పుకునే వ్యక్తి, మన విజయాన్ని తన విజయంగా భావించే మనిషే నిజమైన స్నేహితుడు. తెలుగు సాహిత్యంలోనూ, భారతీయ సంస్కృతిలోనూ స్నేహానికి విశిష్ట స్థానం ఉంది. శ్రీకృష్ణుడు–కుచేలుడు, కర్ణుడు–దుర్యోధనుడు వంటి స్నేహబంధాలు నేటికీ ఆదర్శంగా నిలిచాయి. స్వార్థం లేని స్నేహం ఎంత గొప్పదో ఈ కథలు తెలియజేస్తాయి. స్నేహితుల దినోత్సవం కేవలం ఒక వేడుక కాదు... మన జీవితంలో విలువైన మనుషులను గుర్తు చేసుకునే రోజు. మనతో నవ్వినవారిని మాత్రమే కాదు, ఏడ్చినప్పుడు భుజం అందించిన వారిని కూడా గుర్తుచేసుకుని కృతజ్ఞత చెప్పే సందర్భం. "సంపదలు శాశ్వతం కావు... పదవులు శాశ్వతం కావు...
కానీ హృదయాలను గెలిచిన నిజమైన స్నేహం మాత్రం జీవితాంతం మనతోనే ఉంటుంది." ఈ స్నేహితుల దినోత్సవం సందర్భంగా ప్రతి ఒక్కరూ తమ స్నేహితులను ఆప్యాయంగా పలకరించి, స్నేహబంధాన్ని మరింత బలోపేతం చేసుకోవాలని కోరుకుందాం. స్నేహమే జీవితానికి బలం... స్నేహమే జీవితానికి వెలుగు.

ప్రజా జ్యోతి కొండపాక
నిమ్మ నరసింహారెడ్డి

## ప్రతి శిశువుకు తల్లిపాలే తొలి రక్షణ




### -జిల్లా కలెక్టర్ హైమావతి

సిద్దిపేట,ఆగస్టు 01 ,(ప్రజాజ్యోతి): ప్రతి శిశువు ఆరోగ్యవంతమైన భవిష్యత్తుకు తల్లిపాలే తొలి రక్షణ కవచమని, పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించి, తొలి ఆరు నెలలు పూర్తిగా తల్లిపాలే అందించడం ద్వారా శిశువుకు సంపూర్ణ పోషణ, రోగనిరోధక శక్తి లభిస్తుందని జిల్లా కలెక్టర్ కె. హైమావతి అన్నారు.ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా శనివారం సిద్దిపేట జిల్లా కలెక్టరేట్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ఆమె అధికారిక ప్రచార పోస్టర్‌ను ఆవిష్కరించి వారోత్సవాలను ప్రారంభించారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తల్లిపాలు శిశువుకు సంపూర్ణ ఆహారమే కాకుండా, అనేక అంటువ్యాధుల నుంచి రక్షణ కల్పించే సహజ రోగనిరోధక శక్తిని అందిస్తాయని తెలిపారు. తల్లిపాలను ఇవ్వడం వల్ల తల్లి ఆరోగ్యానికీ అనేక ప్రయోజనాలు కలుగుతాయని, తల్లి–బిడ్డల మధ్య భావోద్వేగ బంధాన్ని మరింత బలోపేతం చేస్తుందన్నారు.
పుట్టిన గంటలోపు తల్లిపాలు ప్రారంభించడం, తొలి ఆరు నెలలు నీరు కూడా ఇవ్వకుండా పూర్తిగా తల్లిపాలే అందించడం, ఆ తర్వాత వయస్సుకు తగిన అనుబంధ పోషకాహారంతో పాటు రెండేళ్లు,అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించడం ప్రతి కుటుంబం పాటించాల్సిన ఆరోగ్యకరమైన అలవాటని సూచించారు.జిల్లా మహిళా అండ్ శిశు సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో ఆగస్టు 1 నుంచి 7 వరకు జిల్లా వ్యాప్తంగా ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, గ్రామస్థాయి సమావేశాలు, గర్భిణీలు, బాలింతలు, కుటుంబ సభ్యులకు కౌన్సెలింగ్, ఆసుపత్రులు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తల్లిపాల ప్రోత్సాహ కార్యక్రమాలు, పోషణపై అవగాహన సదస్సులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.ఈ కార్యక్రమంలో జిల్లా మహిళా అండ్ శిశు సంక్షేమ అధికారి శారద, జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డా ధనరాజ్ , జిల్లా విద్యాశాఖ అధికారి రమేష్ , జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి జయదేవ్ ఆర్య , జిల్లా పంచాయతీ అధికారి రవీందర్ , పోషణ అభియాన్ సిబ్బంది, మహిళా ,శిశు సంక్షేమ శాఖ అధికారులు, వివిధ శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.

## ఘనంగా పోచమ్మ తల్లికి బోనాలు

- అంగరంగ వైభవంగా అమ్మవారికి బోనాలు సమర్పణ
- పోచమ్మ ఆలయంలో భక్తుల ప్రత్యేక పూజలు
- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తి
- పోచమ్మ ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నరేందర్

దుబ్బాక,ఆగస్ట్ 01 ( ప్రజా జ్యోతి) ఆషాడ మాసంలో అన్ని కుల సంఘాలు పోచమ్మ తల్లికి బోనాలు సమర్పించడం ఆనవాయితీగా రావడం ఎంతో సంతోషకరంగా ఉందని





పోచమ్మ తల్లి ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నరేందర్ అన్నారు. శనివారం రోజున దుబ్బాక పట్టణంలోని ఆయా కుల సంఘాలు పోచమ్మ తల్లికి పెద్ద ఎత్తున బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... దుబ్బాక గ్రామ దేవత అయిన పోచమ్మ తల్లికి భక్తులు పెద్ద ఎత్తున బోనాలు సమర్పించడం ఎంతో సంతోషకరంగా ఉందన్నారు. భక్తుల రాకతో పోచమ్మ ఆలయం మార్మోగిందన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.... అమ్మ దయతో దుబ్బాక ప్రాంత ప్రజలతో పాటు నియోజకవర్గ ప్రాంత ప్రజలు సుఖ సంతోషాలతో పాడిపంటలతో అష్టైశ్వర్యాలతో తులతూగాలని అమ్మవారిని ప్రార్థించడం జరిగిందన్నారు. అనంతరం పోచమ్మ తల్లి నూతన ఆలయ కమిటీ చైర్మన్ శ్రీరామ్ నరేందర్ ను పలు కుల సంఘాలు శాలువాతో సన్మానించారు.

## ఆషాఢ మాస బోనాలతో మహంకాళి ఆలయంలో ఆధ్యాత్మిక శోభ

- రెడ్డి సంఘం ఆధ్వర్యంలో ఘనంగా బోనాల సమర్పణ
- డప్పు వాయిద్యాలు, పోతురాజుల విన్యాసాలతో ఊరేగింపు

మిరుదొడ్డి, ఆగస్టు 1, (ప్రజా జ్యోతి): మిరుదొడ్డి మండల కేంద్రంలో ఆషాఢ మాసాన్ని అమ్మవారి ఆలయంలో పురోహితులు రమేష్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు. రెడ్డి సంఘ సభ్యులు సంప్రదాయ పద్ధతిలో బోనాలను సిద్ధం చేసి అమ్మవారికి సమర్పించే ముందు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం డప్పు వాయిద్యాల నడుమ, శివశక్తుల పూనకాలు, పోతురాజుల ఉత్సాహభరిత విన్యాసాల మధ్య అమ్మవారికి బోనాలు సమర్పించి ప్రత్యేక పూజలు, నైవేద్యం, హారతులు నిర్వహించారు. ఈ సందర్భంగా రెడ్డి సంఘం సభ్యులు మాట్లాడుతూ గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, కుటుంబ సౌఖ్యం, సుభిక్షం కలగాలని, సమృద్ధిగా వర్షాలు కురిసి పంటలు బాగా పండాలని అమ్మవారిని వేడుకున్నారు. బోనాల ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణం భక్తులతో కిక్కిరిసిపోయింది.





పురస్కరించుకొని శ్రీ మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాలు శనివారం సంప్రదాయబద్ధంగా, భక్తిశ్రద్ధలతో అత్యంత వైభవంగా నిర్వహించారు. రెడ్డి సంఘం ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకలు గ్రామంలో పండుగ వాతావరణాన్ని నెలకొల్పాయి. ఈ సందర్భంగా మహంకాళి ఆలయానికి చేరుకున్న భక్తులు మహంకాళి బోనాల ఊరేగింపు గ్రామ ప్రధాన వీధుల గుండా వైభవంగా సాగింది. మహిళలు సంప్రదాయ వస్త్రధారణలో బోనాలు మోసుకుంటూ భక్తినినాదాల మధ్య ఆలయానికి చేరుకోవడంతో గ్రామమంతా ఆధ్యాత్మిక శోభతో కళకళలాడింది. యువకులు, మహిళలు, వృద్ధులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. గ్రామంలో సాంప్రదాయ సంస్కృతిని ప్రతిబింబించేలా జరిగిన ఈ బోనాల వేడుకలు భక్తి, ఐక్యత, ఆనందానికి ప్రతీకగా నిలిచాయి.

## ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించాలి

కొండపాక, ఆగస్టు, 1 (ప్రజా జ్యోతి):- సీపీఎస్ రద్దు, 2003 డీఎస్సీ ఉపాధ్యాయులకు పాత పెన్షన్ అమలు, పీఆర్సీని వెంటనే ప్రకటించాలనే డిమాండ్లతో సెప్టెంబర్ 1న పీఆర్టీయూ–టీఎస్ ఆధ్వర్యంలో నిర్వహించే చలో ఇందిరా పార్క్ మహాధర్నాను విజయవంతం చేయాలని ఎమ్మెల్సీ పింగిలి శ్రీపాల్ రెడ్డి పిలుపునిచ్చారు.




కుకునూరుపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహించిన పీఆర్టీయూ–టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి సంఘం నిరంతరం కృషి చేస్తుందని రాష్ట్ర అధికార ప్రతినిధి వంగ మహేందర్ రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో జిల్లా, రాష్ట్ర, మండల నాయకులు పాల్గొన్నారు.

## రేషన్ కార్డుదారులకు కీలక గడువు

- ఆగస్టు 31లోపు ఈ-కేవైసీ పూర్తి చేయండి
- ఇంచార్జి తహాశీల్దార్ సందీప్


చేర్యాల,ఆగస్టు 1(ప్రజాజ్యోతి): రేషన్ కార్డు కలిగిన ప్రతి ఒక్కరూ ఈ నెలాఖరులోగా తప్పనిసరిగా ఈ–కేవైసీ ప్రక్రియను పూర్తి చేసుకోవాలని చేర్యాల మండల ఇన్‌ఛార్జ్ తహాశీల్దార్ సందీప్ స్పష్టం చేశారు.మండల ప్రజలకు అవగాహన కల్పించేందుకు సందీప్ మాట్లాడుతూ...ఐదు సంవత్సరాలు పైబడిన లబ్ధిదారులందరూ తమ ఆధార్ కార్డు,రేషన్ కార్డులతో సమీపంలోని ఏ రేషన్ డీలర్ వద్దకైనా వెళ్లి ఈ–కేవైసీ చేయించుకోవచ్చని తెలిపారు.ఐదు సంవత్సరాల లోపు పిల్లలకు ఈ–కేవైసీ అవసరం లేదని స్పష్టం చేశారు.అదేవిధంగా మండలంలో 'సర్' నమోదు ప్రక్రియ ఇప్పటివరకు 99 శాతం పూర్తయిందని,మిగిలిన ఒక శాతం నమోదును కూడా త్వరలోనే పూర్తి చేస్తామని చెప్పారు.పొందుపరిచిన వివరాల్లో ఏవైనా పొరపాట్లు,తప్పులు ఉంటే సవరించుకునే అవకాశం ఉందని తెలిపారు.లబ్ధిదారులు చివరి తేదీ వరకు వేచి చూడకుండా వెంటనే తమ వివరాలను అందించి ఈ–కేవైసీ నమోదు చేసుకోవాలని ఆయన కోరారు.



## భూంపల్లి పాఠశాలకు ఎర్త్ ఫౌండేషన్ నుంచి వాటర్ ప్యూరిఫైయర్, జిరాక్స్ కమ్ ప్రింటర్ అందజేత

మిరుదొడ్డి,ఆగస్టు 1, (ప్రజాజ్యోతి): అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి గ్రామంలోని ప్రాథమిక పాఠశాలలో అప్‌గ్రేడ్ మై క్లాస్‌రూమ్ కార్యక్రమం మరియు ఎర్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వాటర్ ప్యూరిఫైయర్, జిరాక్స్ కమ్ ప్రింటర్‌ను శనివారం రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య ప్రారంభించారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించిన ఆయన, విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన, గుణాత్మక విద్య అందుతోందని తెలిపారు. భూంపల్లి ప్రాథమిక పాఠశాల విద్యా, సహపాఠ్య కార్యక్రమాలతో పాటు అన్ని రంగాల్లో ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడారు. పాఠశాల అభివృద్ధికి అవసరమైన మౌలిక వసతుల కల్పనలో గ్రామపంచాయతీ, ప్రజాప్రతినిధులు ఎల్లప్పుడూ సహకరిస్తారని పేర్కొన్నారు. గతంలో భూంపల్లి పాఠశాలను దత్తత తీసుకున్న ఎర్త్ ఫౌండేషన్ పాఠశాల అభివృద్ధికి విశేష సేవలు అందించిందని తెలిపారు. వాలంటీర్ల ద్వారా విద్యార్థులకు కరికులం కార్యకలాపాలు నిర్వహించి విద్యలో మెరుగుదల తీసుకురావడం, తల్లులకు ఉచిత కుట్టు శిక్షణ వంటి కార్యక్రమాలు చేపట్టడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ జెన్నారెడ్డి, మండల విద్యాధికారి దోమకొండ అంజయ్య, ఎర్త్ ఫౌండేషన్ డైరెక్టర్ వెన్నెల, ఉపసర్పంచ్ అనూష, వార్డు సభ్యులు, ప్రధానోపాధ్యాయులు కిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజేశ్వరి, బాలకృష్ణ, ఇందిరా, నవిత, సరిత, నవనీత, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.





## పుట్టిన ప్రతి బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్టం

### - సర్పంచ్ సనాదుల బాలపోచయ్య

నంగునూరు, ఆగస్టు 1(ప్రజా జ్యోతి):- పుట్టిన ప్రతి బిడ్డకు ఆరు నెలల పాటు తల్లిపాలు ఇవ్వాలని నన్ను నువ్వ సర్పంచి సనాదుల బాలపోచయ్య అన్నారు
ప్రతి సంవత్సరం ఆగస్టు 1వ తేదీ నుండి 7వ తేదీ వరకు నిర్వహించే ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా నంగునూరు గ్రామపంచాయతీ ఆవరణంలో శుక్రవారం అవగాహన కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ బాలపోచయ్య, ఐసీడీఎస్ సూపర్వైజర్ టి.రమాదేవి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా తల్లిపాల ప్రాధాన్యత, శిశువుల ఆరోగ్యానికి తల్లిపాలు అందించే పోషక విలువలు, తొలి ఆరు నెలల పాటు శిశువులకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాల్సిన అవసరం, తల్లి మరియు బిడ్డ ఆరోగ్య రక్షణలో తల్లిపాల పాత్రపై అవగాహన కల్పించారు. అనంతరం గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించి ప్రజలకు తల్లిపాల ప్రాముఖ్యతను వివరించారు.
ఈ కార్యక్రమంలో గ్రామపంచాయతీ కార్యదర్శి నితీష్ కుమార్, సీఏ లావణ్య, నంగునూరు అంగన్వాడి ఉపాధ్యాయులు తోట పద్మ, గాజర్ల ఇందిర, ఎం.లక్ష్మి, ఎస్.లక్ష్మి, రాజమల్లవ్వ, విమలతో పాటు వివిధ గ్రామాల అంగన్వాడీ టీచర్లు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అధికారులు మాట్లాడుతూ, ఆగస్టు 1 నుండి 7వ తేదీ వరకు మండలంలోని అన్ని గ్రామాల్లో తల్లిపాల వారోత్సవాల సందర్భంగా అవగాహన కార్యక్రమాలు, ర్యాలీలు నిర్వహించి తల్లులకు తల్లిపాల ప్రాముఖ్యతపై చైతన్యం కల్పించనున్నట్లు తెలిపారు. తల్లిపాలు శిశువుల సంపూర్ణ ఆరోగ్యానికి, మానసిక వికాసానికి ఎంతో అవసరమని వారు పేర్కొన్నారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేస్తూ ర్యాలీ నిర్వహించారు.



## ఔట్‌సోర్సింగ్ డ్రైవర్ ఉద్యోగాలకు దరఖాస్తుల ఆహ్వానం



**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 01(ప్రజాజ్యోతి) :** తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (టీజీఎస్ఆర్టీసీ)లో ఔట్‌సోర్సింగ్ విధానంలో డ్రైవర్ల నియామకానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు హయత్‌నగర్-1 డిపో మేనేజర్ లావణ్య తెలిపారు. హెవీ డ్రైవింగ్ లైసెన్స్ కలిగి ఉండి, కనీసం రెండేళ్లకు పైగా హెవీ వాహనాలు నడిపిన అనుభవం ఉన్న అభ్యర్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆమె కోరారు. ఆసక్తి గల అభ్యర్థులు తమ దరఖాస్తులతో పాటు ఆధార్ కార్డు, హెవీ డ్రైవింగ్ లైసెన్స్, పాస్‌పోర్ట్ సైజు ఫోటోలను జతచేసి హయత్‌నగర్-1 డిపో మేనేజర్ కార్యాలయంలో సమర్పించాలని సూచించారు. దరఖాస్తులను 2026 ఆగస్టు 8లోగా కార్యాలయంలో అందజేయాలని, అర్హతలు కలిగిన అభ్యర్థులు నిర్ణీత గడువులోగా దరఖాస్తు చేసుకోవాలని డిపో మేనేజర్ లావణ్య విజ్ఞప్తి చేశారు.

## చందానగర్‌లో బాలాజీ జ్యువెలరీ షాప్‌లో చోరీ





**శేరిలింగంపల్లి, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గంలోని చందానగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని నూకల శివశంకర్‌కు చెందిన బాలాజీ జ్యువెలరీ షాప్లో నిన్న రాత్రి గుర్తు తెలియని దుండగులు చోరీకి పాల్పడ్డారు. ప్రాథమిక సమాచారం ప్రకారం, దుండగులు షాప్ వెనుక భాగంలో ఉన్న డోర్ ఎగ్జాస్ట్ ఫ్యాన్‌ను తొలగించి రంధ్రం పెద్దగా చేసి లోపలికి ప్రవేశించారు. అనంతరం వెనుక గది నుండి ముందు గదికి మధ్యనున్న తలుపుకు రంధ్రం చేసి, షాప్‌లోని బంగారు, వెండి ఆభరణాలను అపహరించారు. ఈ ఘటనలో సుమారు 7 తులాల బంగారం మరియు 4 కిలోల వెండి చోరీకి గురైనట్లు ప్రాథమికంగా గుర్తించారు. సంఘటన సమాచారం అందుకున్న వెంటనే డీసీపీ చింతమనేని శ్రీనివాస్, ఏసీపీ సిహెచ్.వై. శ్రీనివాస్ కుమార్, సీసీఎస్,ఎస్వోటీ చందానగర్ పోలీసు అధికారులు సంఘటనా స్థలాన్ని సందర్శించి పరిశీలించారు. క్లూస్ టీమ్, ఫోరెన్సిక్ నిపుణులు సంఘటనా స్థలంలో ఆధారాలు సేకరిస్తున్నారు. సీసీటీవీ ఫుటేజ్, సాంకేతిక ఆధారాలు,ఇతర అన్ని కోణాల్లో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. నిందితులను త్వరితగతిన గుర్తించి అరెస్టు చేసేందుకు ప్రత్యేక బృందాలు చర్యలు చేపట్టాయి. చందానగర్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

## అన్నిదానాల్లోకెల్ల అన్నదానం గొప్పది

- పేదల ఆకలి తీర్చడమే నా కర్తవ్యం
- హోప్ పౌండేషన్ అధ్యక్షులు కొండ విజయ్ కుమార్....





**శేరిలింగంపల్లి,ఆగస్టు 01(ప్రజాజ్యోతి):** ఆకలిగొన్న వారి ఉచితంగా అన్న వితరణ చేయడం మానవీయతకు నిదర్శనం అని హోప్ ఫౌండేషన్ అధ్యక్షుడు కొండ విజయ్ కుమార్ అన్నారు. భారీ స్థాయిలో అన్నవితరణ కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిధిగా కొండ విజయ్ కుమార్ హజరై ప్రజలకు అన్నదానం చేశారు. ఈ సందర్భం గా ఆయన మాట్లాడుతూ...గడిచిన కొన్ని ఏళ్లుగా ఉచితంగా పోషక విలువలతో కూడిన భోజనం ఉచితంగా అందజేయడం జరుగుతుందని అన్నారు. చందానగర్ లోని గంగారం హోప్ ఫౌండేషన్ కార్యాలయం వద్ద ఉచిత భోజన అందించడం ద్వారా వేలాది మంది ఆకలిని తీర్చగలగడం గొప్ప పరిణామం అని అన్నారు. ఈ కార్యక్రమంలో హోప్ ఫౌండేషన్ సభ్యురాలు అన్నే అపర్ణ, అన్నె సందీప్,హోప్ ఫౌండేషన్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఎస్‌బిహెచ్ కాలనీలో ఎస్ఐఆర్--2026 పనుల పరిశీలన

**అబ్దుల్లాపూర్ మెట్టు ఆగస్టు 01(ప్రజాజ్యోతి) :** భారత ఎన్నికల సంఘం కార్యదర్శి నవీన్ కుమార్, రంగారెడ్డి జిల్లా స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ డాక్టర్ కిరణ్మయి, ఐఏఎస్,ఎల్‌బీనగర్ జోనల్ కమిషనర్, ఎలక్టోరల్ రిజిస్ట్రేషన్ ఆఫీసర్ (ఈఆర్వో) శ్రీ వికాస్ మహతో (ఐఏఎస్) శుక్రవారం ఎల్‌బీనగర్‌లోని ఎస్‌బిహెచ్ కాలనీలో కొనసాగుతున్న ఎస్ఐఆర్--2026 కార్యక్రమాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ ప్రక్రియ పురోగతి, ఇంటింటి సర్వే, నమోదు, ధృవీకరణ తదితర అంశాలను అధికారులు సమీక్షించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల ప్రకారం కార్యక్రమాలను పారదర్శకంగా, వేగవంతంగా పూర్తి చేసి అర్హులైన ప్రతి ఓటరిని జాబితాలో నమోదు చేసేలా చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించినట్లు సమాచారం.

## కేర్‌లో వీఎన్ఎస్ చికిత్సతో మూర్ఛ వ్యాధికి ఉపశమనం



**హైదరాబాద్, ఆగస్ట్ 01 (ప్రజా జ్యోతి) :** కేర్ హాస్పిటల్స్ లో వరంగల్‌కు చెందిన 34 ఏళ్ల ప్రతిమకు డ్రగ్-రెసిస్టెంట్ ఎపిలెప్సీకి వేగస్ నర్వ్ స్టిమ్యులేషన్(వీఎన్ఎస్) చికిత్సను విజయవంతంగా నిర్వహించినట్లు కేర్ హిస్పిటల్స్ బంజారాహిల్స్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ అభినవ్ జోషి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఎపిలెప్సీ, న్యూరాలజీ కన్సల్టెంట్ డాక్టర్ శశాంక్ జైస్వాల్ తోకలసి ఆయన మాట్లాడుతూ ఈ చికిత్సతో మూర్ఛలు గణనీయంగా తగ్గి ఆమె ఆరోగ్యం మెరుగుపడిందని తెలిపారు.

అత్యాధునిక వీఎన్ఎస్ చికిత్సతో క్లిష్టమైన మూర్ఛ వ్యాధిగ్రస్తులకు మెరుగైన వైద్యం అందిస్తున్నామని పేర్కొన్నారు.

# 13వ వార్డులే ఎస్ఐఆర్ వార్డు సభ

- ఏఎస్‌డీ ఓటర్ల జాబితా సవరణకు ఆమోదం
- పీఎస్-212, 214, 215, 216 పోలింగ్ కేంద్రాల పరిధిలో మరణించిన, చిరునామా మారిన, డబుల్ ఓటర్ల వివరాల పరిశీలన







**పరిగి, ఆగష్టు 01 (ప్రజాజ్యోతి) :** వికారాబాద్ జిల్లా పరిగి పురపాలక సంఘం పరిధిలో శనివారం ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమంలో భాగంగా వార్డు సభ నిర్వహించారు. ఓటరు జాబితాల సవరణ ప్రక్రియలో భాగంగా పోలింగ్ కేంద్రాలు పీఎస్-212, పీఎస్-214, పీఎస్-215, పీఎస్-216లకు సంబంధించిన ఏఎస్‌డీ (ఆబ్సెంట్, షిఫ్టెడ్, డెత్) డబుల్ ఓటర్ల జాబితాలపై సమీక్ష చేపట్టారు.

ఈ వార్డు సభలో స్థానిక ప్రజాప్రతినిధులు, బీఎల్ఏలు, సూపర్వైజర్లు, బీఎల్వోలు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీఎల్వోలు 13వ వార్డులో ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ ఖాన్ కాలనీలోని సిద్ధార్థ పాఠశాల వద్ద ఏర్పాటు చేసిన సహాయ కేంద్రంలో పోలింగ్ కేంద్రాలు 214, 215 పరిధికి చెందిన బీఎల్ఓలు ఓటర్ల నుంచి స్వీకరించిన గణన పత్రాలను, వాటి డిజిటలైజేషన్ అలాగే ధృవీకరణ వివరాలను వెల్లడించారు. అదేవిధంగా సంబంధిత పోలింగ్ కేంద్రాల పరిధిలో మరణించిన ఓటర్లు, శాశ్వతంగా చిరునామా మార్చుకున్న ఓటర్లు, రెండు చోట్ల ఓటు నమోదు చేసుకున్న డబుల్ ఓటర్లు, అందుబాటులో లేని ఓటర్ల వివరాలను బీఎల్వోలు సభలో చదివి వినిపించారు.

స్థానికుల నుంచి వచ్చిన సూచనలు, అభిప్రాయాలు, వాస్తవ పరిస్థితులను పరిగణనలోకి తీసుకుని జాబితాలోని పేర్లను పరిశీలించారు. అనంతరం సభలో చర్చించిన వివరాలకు హాజరైన సభ్యులు ఏకగ్రీవంగా ఆమోదం తెలిపారు. ఎస్ఐఆర్ ప్రక్రియను పారదర్శకంగా, నిష్పక్షపాతంగా నిర్వహిస్తూ అర్హులైన ప్రతి ఓటరు పేరు జాబితాలో ఉండేలా చర్యలు తీసుకుంటున్నట్లు అధికారులు తెలిపారు. ఈ కార్యక్రమంలో పరిగి మున్సిపల్ చైర్‌పర్సన్ కుడుముల రజిత వెంకటేష్, మున్సిపల్ కమిషనర్ కె. మల్లేష్, వార్డు కౌన్సిలర్ సమీనా మీర్ తాహేర్ అలీ, బీజేపీ పరిగి ఇన్‌చార్జ్ మారుతి కిరణ్ బూనేటి, బీజేపీ నాయకురాలు అనూష, ముకుంద నాగేశ్వర్ అలాగే కాంగ్రెస్ పార్టీ నాయకులు రాఘవేంద్ర రెడ్డి, ఖైసర్ బేగ్, ఖదీర్, అక్బర్, తోపాటు సంతోష్, సమీర్, కుర్వ నరేందర్, రఫీ, బీఎల్ఏలు, బీఎల్వో సూపర్వైజర్లు, బీఎల్వోలు, కాలనీవాసులు తదితరులు పాల్గొన్నారు.

# పరిగి నియోజకవర్గంలో ఈఎఫ్ డిజిటైజేషన్ 80 శాతం పూర్తి




- 2.76 లక్షల ఓటర్లలో 2.21 లక్షల ఈఎఫ్‌లు డిజిటైజ్
- పరిగి రూరల్‌లో అత్యధికంగా 87.96 శాతం నమోదు

**పరిగి, ఆగష్టు 01 (ప్రజాజ్యోతి) :** పరిగి అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో ప్రత్యేక ఓటరు జాబితా సవరణ (ఎస్ఐఆర్) కార్యక్రమంలో భాగంగా ఈఎఫ్ (ఎన్యూమరేషన్ ఫారమ్) డిజిటైజేషన్ ప్రక్రియ వేగంగా కొనసాగుతోంది. ఆగస్టు 1వ తేదీ సాయంత్రం 4.00 గంటల వరకు అందిన నివేదికల ప్రకారం నియోజకవర్గంలోని మొత్తం 2,76,260 మంది ఓటర్లకు సంబంధించిన ఈఎఫ్‌లను పంపిణీ చేసి, వాటిలో 2,21,093 ఫారాలను డిజిటైజ్ చేశారు. దీంతో మొత్తం డిజిటైజేషన్ శాతం 80.03కు చేరుకుంది.

నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో 100 శాతం ఈఎఫ్‌ల పంపిణీ పూర్తయింది. దోమ మండలంలో 80.89 శాతం, గండీడ్‌లో 78.72 శాతం, మహమ్మదాబాద్‌లో 78.18 శాతం, కుల్కచర్లలో 82.34 శాతం, చౌడాపూర్‌లో 81.25 శాతం, పరిగి మున్సిపాలిటీలో 71.41 శాతం, పరిగి రూరల్‌లో 87.96 శాతం, పూడూర్ మండలంలో 78.52 శాతం డిజిటైజేషన్ నమోదైంది. మండలాల వారీగా పరిశీలిస్తే పరిగి రూరల్ మండలం 87.96 శాతంతో మొదటి స్థానంలో నిలవగా, కుల్కచర్ల మండలం 82.34 శాతంతో రెండో స్థానంలో ఉంది. పరిగి మున్సిపాలిటీ పరిధిలో 71.41 శాతం డిజిటైజేషన్ మాత్రమే నమోదవడంతో అక్కడ ప్రక్రియను మరింత వేగవంతం చేయాల్సిన అవసరం ఉందని అధికారులు భావిస్తున్నారు. నివేదిక ప్రకారం మొత్తం 305 మంది బీఎల్వోలు శిక్షణ పొంది క్షేత్రస్థాయిలో పనిచేస్తున్నారు. ఇప్పటివరకు 2,47,620 ఈఎఫ్‌లు ధృవీకరించబడగా, ధృవీకరణ శాతం 90కు చేరుకుంది. గైర్హాజరు, శాశ్వత బదిలీ, మరణించిన ఓటర్లు, ఇప్పటికే నమోదైన ఓటర్లకు సంబంధించిన వివరాలను కూడా బీఎల్వోలు సేకరించి వ్యవస్థలో నమోదు చేస్తున్నారు. ప్రత్యేక సవరణ కార్యక్రమాన్ని నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని ఎన్నికల అధికారులు చర్యలు చేపడుతున్నారు.

**...పరిగి మున్సిపాలిటీలో 4,330 యూఈఎఫ్ లు గుర్తింపు :** పరిగి మున్సిపాలిటీలో మొత్తం 27,635 మంది ఓటర్లకు సంబంధించిన ఈఎఫ్‌ల పంపిణీ 100 శాతం పూర్తికాగా, 19,733 ఈఎఫ్‌లు డిజిటైజ్ చేయబడి 71.41 శాతం పురోగతి నమోదైంది.

**డిజిటైజేషన్ ప్రక్రియలో భాగంగా బీఎల్వోలు ధృవీకరించిన వివరాల ప్రకారం :**

నో మ్యాపింగ్ ఓటర్లు: 661
మరణించిన ఓటర్లు: 801
శాశ్వతంగా బదిలీ అయిన ఓటర్లు: 2,202
ఇప్పటికే నమోదు చేసుకున్న ఓటర్లు: 628
గైర్హాజరు ఓటర్లు: 696
ఇతరులు: 3, మొత్తం యూఈఎఫ్ కేసులు: 4,330

అదేవిధంగా పరిగి మున్సిపాలిటీలో 19,731 ఈఎఫ్‌లను బీఎల్వోలు ధృవీకరించగా, మొత్తం 24,061 ఈఎఫ్‌లు (యూఈఎఫ్ తో కలిపి) ధృవీకరించబడి 87 శాతం వెరిఫికేషన్ పూర్తయినట్లు నివేదికలో వెల్లడైంది. అధికారులు మిగిలిన ఈఎఫ్‌ల డిజిటైజేషన్‌ను వేగవంతం చేసి త్వరితగతిన పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటున్నారు.

**...ఎస్ఐఆర్ ప్రక్రియ ఆగస్టు 10 వరకు గడువు పొడిగింపు :** ఎస్ఐఆర్ ప్రక్రియ గడువును ఆగస్టు 10 వరకు పొడిగించిన నేపథ్యంలో బీఎల్ఏలు తమ పరిధిలోని అర్హులైన ప్రతి ఓటరుతో ఎన్యూమరేషన్ ఫారాలు పూర్తి చేయించి, అవసరమైన పత్రాలు సమర్పించేలా చూడాలని ఎన్నికల అధికారులు సూచించారు. ఫారం సమర్పించిన ఓటర్ల ధృవీకరణను కూడా వెంటనే పూర్తి చేసి, ఓటరు జాబితాలో అర్హుల పేర్లు కొనసాగేందుకు సహకరించాలని కోరారు.

# గూడూర్‌లో ఐమాక్స్ లైట్స్ ప్రారంభోత్సవం

- ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించిన మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి
- కొత్తూరు మండలంలోని పలు గ్రామాలకు సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తా
- మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి





**కొత్తూర్ ఆగస్టు 01 (ప్రజా జ్యోతి) :** కొత్తూరు మండలంలోని గూడూరు గ్రామంలో సర్పంచ్ కంటెస్టెంట్ క్యాండిడేట్ పెండ్లిమడుగు రాజు గౌడ్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన ఐమాక్స్ లైట్స్ ప్రారంభోత్సవానికి ముఖ్య అతిథిగా మాజీ ఎంపీపీ పిన్నింటి మధుసూదన్ రెడ్డి హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..కొత్తూరు మండలంలోని పలు గ్రామాలకు సొంత నిధులతో ఐమాక్స్ లైట్లు ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ చిట్టెడి నరసింహారెడ్డి,ఉపసర్పంచ్లు మీసాల ఆరోగ్యం,రాములు గౌడ్,సర్పంచ్ మీనాక్షి దశరత్ నాయక్,మాజీ సర్పంచ్ లు కాట్న రాజు,రవి నాయక్,మాజీ ఎంపిటిసి మోడీ దర్శన్, వార్డు సభ్యులు జయేందర్ రెడ్డి,బోకుల రాజు, సదానందం, అరవింద్ గౌడ్, నాయకులు యాదయ్య, గోపాల్ నాయక్, చందర్ నాయక్, బీటెక్ రాందాస్, దయ్యాల పాండు, బాలయ్య,పోచయ్య, కుమ్మరి రాములు, హరికృష్ణ, శివలింగం, మైలారం నరేందర్, కవాలి మల్లేష్, మైలారం రవి, కావలి కృష్ణ, మహేందర్, మున్నూర్ రాకేష్, మోహన్ నాయక్, బ్యాగరీ పోచయ్య, లింగం గౌడ్, శివరాజ్, మహిపాల్ రెడ్డి, దయానంద్ రెడ్డి,పాపిరెడ్డి,రాజు,గుండు రఘు, యాదగిరి,కుమార్, తదితరులు పాల్గొన్నారు.

# ప్రతి గ్రామంలో జనసేన జెండా ఎగురవేస్తాం

ప్రజా సమస్యలపై పోరాడుతూ పార్టీని క్షేత్రస్థాయిలో బలోపేతం చేస్తాం: రాష్ట్ర నాయకులు





**షాద్‌నగర్, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి) :** తెలంగాణలో గ్రామ స్థాయి నుంచి జనసేన పార్టీని పటిష్ఠం చేస్తూ ప్రతి గ్రామంలో పార్టీ జెండా ఎగురవేయడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నామని జనసేన రాష్ట్ర జనరల్ సెక్రటరీ రామ్ తళ్లూరి, రాష్ట్ర ప్రచార కార్యదర్శి ఆర్కే సాగర్, సినీ నటుడు తనీష్ పేర్కొన్నారు. మహబూబ్‌నగర్ పార్లమెంటరీ పరిధిలో నిర్వహిస్తున్న ఆత్మీయ సమ్మేళనానికి హాజరయ్యేందుకు వెళ్తున్న రాష్ట్ర నాయకులకు రంగారెడ్డి జిల్లా షాద్‌నగర్ బైపాస్ వద్ద స్థానిక నాయకులు, కార్యకర్తలు ఘన స్వాగతం పలికారు. జరుపుల రాజు నాయక్, మహమ్మద్ అష్రఫ్ ఆధ్వర్యంలో రాష్ట్ర నాయకులను పూలమాలలతో సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రాష్ట్ర నాయకులు మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా 17 పార్లమెంటరీ నియోజకవర్గాల్లో ఆత్మీయ సమ్మేళనాలు నిర్వహించి పార్టీని క్షేత్రస్థాయిలో మరింత విస్తరించనున్నట్లు తెలిపారు. గ్రామాల్లో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటి పరిష్కారం కోసం ప్రజలతో కలిసి పోరాటం చేస్తామని, పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ నిర్దేశించిన మార్గదర్శకాల మేరకు తెలంగాణలోని ప్రతి గ్రామంలో పార్టీ నిర్మాణాన్ని బలోపేతం చేసి యువత, కార్యకర్తలను చైతన్యవంతం చేస్తామని చెప్పారు. ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లడంతో పాటు అవసరమైతే ప్రజల తరఫున ఉద్యమాలు చేపట్టేందుకు వెనుకాడబోమని స్పష్టం చేశారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని పార్టీ నిర్మాణాన్ని పటిష్ఠం చేస్తున్నామని, గ్రామ స్థాయిలో బలమైన నాయకత్వాన్ని తీర్చిదిద్ది పార్టీ అభ్యర్థులను ఎన్నికల బరిలో నిలిపేందుకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల విశ్వాసాన్ని పొందే విధంగా ప్రతి కార్యకర్త సేవాభావంతో పనిచేయాలని పిలుపునిచ్చారు.

ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శ్రీశైలం, పవన్ నాయక్, శివ జానీ, శ్రీకాంత్, రామకృష్ణ, మహబూబ్, లింగం నాయక్, మల్లేష్, శివ, కుమార్, చందు, పాపకంటి శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థులకు షూస్ పంపిణీ

- విద్యార్థుల సంక్షేమం కోసం ప్రభుత్వం ప్రత్యేక చర్యలు - ప్రజాప్రతినిధులు



**పరిగి, ఆగస్టు 01 (ప్రజాజ్యోతి):** పరిగి ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థులకు షూస్ పంపిణీ చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష్ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి 8వ వార్డు కౌన్సిలర్ హబీబునిస, మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ అయ్యూబ్, ఆప్షన్ సభ్యుడు అక్బర్ హుసైన్, ఆంజనేయులు ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా విద్యార్థులకు షూస్ పంపిణీ చేసి, ప్రభుత్వం విద్యార్థుల సంక్షేమం కోసం చేపడుతున్న పథకాల గురించి వివరించారు. విద్యార్థులకు అవసరమైన సౌకర్యాలను కల్పించడం ద్వారా వారి విద్యాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని అన్నారు.

అనంతరం వారు మాట్లాడుతూ విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా నాణ్యమైన విద్యతో పాటు అవసరమైన మౌలిక సదుపాయాలను అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకుంటోందన్నారు. ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలల్లో చదువుతున్న విద్యార్థులకు సమాన అవకాశాలు కల్పించడమే లక్ష్యమని తెలిపారు.

ఈ కార్యక్రమంలో మాజీ వార్డు సభ్యుడు, పీఏసీఎస్ డైరెక్టర్ చిన్న నర్సింలు, కళాశాల ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## గ్రామ అభివృద్ధికి అందరం కలిసికట్టుగా పనిచేద్దాం

సర్పంచ్ పోలీస్ శశికళ యాదవ రెడ్డి






**మోమిన్‌పేట ఆగస్టు 1 (ప్రజా జ్యోతి) :** మోమిన్ పేట మండల పరిధిలోని రావులపల్లి గ్రామంలో సర్పంచ్ పోలీస్ శశికళ యాదవ రెడ్డి ఆధ్వర్యంలో శనివారం గ్రామసభ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ అభివృద్ధికి సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. గ్రామంలో మౌలిక వసతుల కల్పన, పారిశుధ్యం, తాగునీరు, రహదారులు తదితర సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని నిర్ణయించారు. గ్రామ అభివృద్ధికి ప్రజలందరూ సహకరించాలని, అందరం కలిసికట్టుగా పనిచేసి గ్రామాన్ని మరింత అభివృద్ధి పథంలోకి తీసుకెళ్లాలని సర్పంచ్ లలిత యాదవ రెడ్డి కోరారు. గ్రామసభలో ప్రజలు తమ సమస్యలను సర్పంచ్ దృష్టికి తీసుకువచ్చారు ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ అపర్ణ, కార్యదర్శి ప్రవీణ్, వార్డు సభ్యులు, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రధానోపాధ్యాయులకు విద్యార్థుల దుస్తులు పంపిణీ చేసిన, ఏపీఎం



**బషీరాబాద్, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి) :** వికారాబాద్ జిల్లా బషీరాబాద్ మండలం కొర్విచేడ్ ఎంపీపీఎస్ పాఠశాలలో శనివారం ప్రధానోపాధ్యాయులు నరసింహారెడ్డికి,ఏపీఎం పద్మారావు విద్యార్థులపాఠశాల దుస్తులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను విద్యార్థులు సద్వినియోగం చేసుకుని విద్యలో రాణించాలని సూచించారు. విద్యార్థులు క్రమశిక్షణతో చదువుతూ ఉన్నత లక్ష్యాలను సాధించాలని, పాఠశాలకు ప్రతిరోజూ హాజరవుతూ ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా అభ్యసించాలని కోరారు. ప్రభుత్వం అందజేసిన యూనిఫాంలను విద్యార్థులు పరిశుభ్రంగా ధరించి పాఠశాల గౌరవాన్ని నిలబెట్టాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు, పాఠశాల సిబ్బంది, సీసీ అంపయ్య, వివో రేణుక ,విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

## జీవీకే హెల్త్‌తో ఫెర్నాండెజ్ ఫౌండేషన్ భాగస్వామ్యం




**హైదరాబాద్, ఆగస్ట్ 01 (ప్రజా జ్యోతి) :** మహిళలు, నవజాత శిశువుల ఆరోగ్య సేవలను విస్తరించేందుకు ఫెర్నాండెజ్ ఫౌండేషన్(ఎఫ్ఎఫ్) జీవీకే హెల్త్‌తో భాగస్వామ్య ఒప్పందం కుదుర్చుకుని ప్రత్యేక ఔట్‌పేషెంట్ క్లినిక్‌ను ప్రారంభించినట్లు ఫెర్నాండెజ్ ఫౌండేషన్ చీఫ్ ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ సమీర్ వీరా శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జీవీకే హెల్త్ చీఫ్ ఆపరేటింగ్ ఆఫీసర్ సుమన్ రాజు జె తోకలసి ఆయన మాట్లాడుతూ ఈ క్లినిక్‌లో గర్భధారణ, గైనకాలజీ, సంతాన సాఫల్య మూల్యాంకనం, కౌమార, రుతుక్రమ ఆరోగ్య సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ప్రారంభోత్సవం సందర్భంగా ఆగస్టు 1 నుంచి 15 వరకు ప్రత్యేక మహిళా ఆరోగ్య ప్యాకేజీని అందిస్తున్నట్లు వెల్లడించారు. ఇందులో గైనకాలజీ కన్సల్టేషన్‌తో పాటు టీసీహెచ్, పెల్విక్ అల్ట్రాసౌండ్, సీబీసీ, పాప్ స్మియర్, హెచ్.బీ ఏవన్.సీ పరీక్షలు ఉంటాయని తెలిపారు.

# సీఎం వ్యాఖ్యలకు నిరసనగా కరీంనగర్‌లో బీజేవైఎం ఆందోళన

కరీంనగర్ కలెక్టరేట్,ఆగస్టు 1( ప్రజాజ్యోతి )
తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఇంజనీరింగ్ గ్రాడ్యుయేట్లపై చేసిన వ్యాఖ్యలను నిరసిస్తూ భారతీయ జనతా యువ మోర్చా (బీజేవైఎం) రాష్ట్ర శాఖ పిలుపు మేరకు కరీంనగర్ జిల్లా బీజేవైఎం ఆధ్వర్యంలో తెలంగాణ చౌక్‌లో శనివారం నిరసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా



సీఎం రేవంత్ రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి, ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సంగ నరేష్ మాట్లాడుతూ, ముఖ్యమంత్రి చేసిన వ్యాఖ్యలు లక్షలాది మంది ఇంజనీరింగ్ విద్యార్థులు, గ్రాడ్యుయేట్ల మనోభావాలను దెబ్బతీసేలా ఉన్నాయని విమర్శించారు. చదువుకున్న యువత ప్రతిభను కించపరిచే విధంగా మాట్లాడడం బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న వ్యక్తికి తగదని అన్నారు. సీఎం తన వ్యాఖ్యలను వెంటనే వెనక్కి తీసుకుని ఇంజనీరింగ్ విద్యార్థులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.
నిరసన కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా నాయకులు నక్క ప్రమోద్, గుర్రం వెంకటేష్ గౌడ్, చిక్కుల కిరణ్, గడ్డం అరుణ్, చుక్కల శ్రీకాంత్ యాదవ్, దయ్యాల రాజు, కొత్తకొండ వెంకటసాయి, ఆకుల మనోహర్, దర్శనాల మణిదీప్, బద్దం రాహుల్ రెడ్డి, బామండ్ల రాజు, ఆవుల తిరుపతి, గణేష్, గాజుల రాజ్‌కుమార్‌తో పాటు పెద్ద సంఖ్యలో బీజేవైఎం కార్యకర్తలు పాల్గొన్నారు.

# మరణించిన మున్సిపల్ కార్మికుడి ఆర్థిక సాయం

మెట్‌పల్లి, ఆగస్టు 1, ప్రజా జ్యోతి:
మెట్‌పల్లి మున్సిపాలిటీలో కార్మికునిగా పనిచేస్తున్న కాంపెల్లి పోచయ్య (57) శనివారం ప్రమాదవశాత్తు కోనేరులో పడి మృతి చెందాడు. ఈ విషాద ఘటనతో ఆయన కుటుంబం తీవ్ర ఆవేదనకు గురైంది.



మరణించిన పోచయ్య కుటుంబ పరిస్థితిని తెలుసుకున్న మున్సిపల్ చైర్మన్ మైలారం లింబాద్రి స్పందించి, ఆయన భార్య లక్ష్మికి వ్యక్తిగతంగా రూ.10,000 ఆర్థిక సహాయం అందజేశారు. అలాగే మున్సిపల్ కార్మిక సంఘం మరియు తోటి కార్మికులు కలిసి మరో రూ.10,000 ఆర్థిక సహాయం అందించి తమ మానవత్వాన్ని చాటుకున్నారు.
ఈ కార్యక్రమంలో మున్సిపల్ సానిటరీ జవాన్లు ముజీబ్, నరేష్, ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి ఉస్మాన్, మున్సిపల్ కార్మిక సంఘం అధ్యక్షుడు లంక శ్రీకాంత్, జిల్లా అధ్యక్షుడు బర్ల లక్ష్మణ్, అనిల్, యు. శ్రీను, సంజీవ్, రమేష్ తదితరులు పాల్గొని పోచయ్య కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.

# అవయవదానంతో ఆరుగురికి పునర్జన్మ

కొడిమ్యాల, ఆగస్ట్ 01,(ప్రజాజ్యోతి):
మండలం పూడూరు గ్రామానికి చెందిన పొన్నం మల్లేశం గౌడ్ (59)



మరణానంతరం చేసిన అవయవదానం ఆరుగురు జీవితాల్లో కొత్త వెలుగులు నింపింది. మూడు రోజుల క్రితం అస్వస్థతకు గురైన ఆయనను చికిత్స కోసం హైదరాబాద్‌లోని అపోలో ఆసుపత్రికి తరలించగా, వైద్యులు బ్రెయిన్‌డెడ్‌గా నిర్ధారించారు. దీంతో భార్య రేణుక, కుమారులు భార్గవ్, భరత్ అవయవదానానికి స్వచ్ఛందంగా అంగీకరించారు. మల్లేశం గౌడ్ గుండె, ఊపిరితిత్తులు, రెండు కిడ్నీలు, రెండు కళ్లను దానం చేయడంతో ఆరుగురు బాధితులకు కొత్త జీవితం లభించనుంది. జీవించి ఉన్నప్పుడే పలువురికి అండగా నిలిచిన ఆయన, మరణానంతరం కూడా అవయవదానం ద్వారా మరెందరికో ఆశాకిరణంగా నిలిచారని కుటుంబ సభ్యులు తెలిపారు. ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన పెంచుకొని ముందుకు రావాలని వారు పిలుపునిచ్చారు.

# ఏం పి డి ఓ ఆఫీసు ముందు వీ _బీ గ్రామ్ జి ఉద్యోగాల నిరసన

ఇల్లంతకుంట ఆగస్టు 1(ప్రజాజ్యోతీ)
తెలంగాణ గ్రామీణాభివృద్ధి ఉద్యోగుల సంక్షేమ సంఘం (వీబీ–గ్రామ్ జి జేఏసీ) పిలుపు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల




ఎంపీడీవో కార్యాలయం ఎదుట శనివారం ఉద్యోగులు పోస్టర్లతో నిరసన వ్యక్తం చేశారు.వేతన స్కేలు అమలు,పదోన్నతులు,సర్వీసు సీనియారిటీ ఖరారు,కార్యాలయ సిబ్బందికి అదనపు నెలవారీ నగదు రూ.5 వేలకు,క్షేత్రస్థాయి ఉద్యోగుల ప్రయాణ భత్యాన్ని రూ.6 వేలకు పెంచడంతో పాటు గ్రాట్యుటీ,ఈపీఎఫ్,ఆరోగ్య పథకం అమలు సహా 12 డిమాండ్లను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని కోరారు.లేనిపక్షంలో పెన్‌డౌన్,ధర్నా,షట్‌డౌన్ వంటి ఆందోళనలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏపీఓ పులి చంద్రయ్య,టిఏలు శ్రీనివాస్,పుష్పలత,కరుణాకర్,హరీష్ కుమార్,సిఓలు తబిత,శేఖర్ తదితరులు పాల్గొన్నారు

# కరీంనగర్ లో గల్లీగల్లీని అభివృద్ధి చేస్తా

- మరిన్ని నిధులు తీసుకొస్తా..
- కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్
- మేయర్, డిప్యూటీ మేయర్ లతో అభివృద్ధి పనులకు శ్రీకారం

కరీంనగర్ బ్యూరో, ఆగస్టు 1( ప్రజాజ్యోతి )
కరీంనగర్ కార్పొరేషన్ పరిధిలోని గల్లీగల్లీని అభివృద్ధి చేస్తానని కేంద్రహోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. కరీంనగర్ కార్పొరేషన్ తోపాటు తన పార్లమెంట్ నియోజకవర్గ అభివృద్ధి కోసం కేంద్రం నుండి మరిన్ని నిధులు తీసుకొస్తానని స్పష్టం చేశారు. కరీంనగర్ పర్యటనలో భాగంగా కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శనివారం పలు అభివృద్ధి కార్యక్రమాలకు సంబంధించి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు, పరామర్శలతో బిజీబిజీగా గడిపారు. ఉదయం 9 గంటలకు తన నివాసం వద్దకు వచ్చిన సందర్శకులను కలుసుకుని వారి సమస్యలను అడిగి తెలుసుకున్న బండి సంజయ్ ఆ తరువాత 10.30 గంటలకు స్థానిక కార్పొరేటర్లు, బీజేపీ నాయకులతో కలిసి పలు అభివృద్ధి కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారు. తొలుత 48వ డివిజన్ లోని విద్యానగర్ కురుమవాడలో కోటి రూపాయల అంచనా వ్యయంతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, మున్సిపల్ కమిషనర్ ప్రఫుల్ దేశాయ్ తోపాటు స్థానిక కార్పొరేటర్ కర్ర పద్మ అనిల్ తో కలిసి కేంద్ర మంత్రి శంకుస్థాపన చేశారు. ఈ నిధుల్లో రూ.80 లక్షలు యూఐడీఎఫ్ నిధులు కాగా, మిగిలిన రూ.20 లక్షలు మున్సిపల్ సాధారణ ఫండ్ కు సంబంధించినవి. అనంతరం 19వ డివిజన్ లోని రేకుర్తి ముదిరాజ్ కాలనీకి వెళ్లిన కేంద్ర మంత్రి రూ.40 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అట్లాగే లక్ష్మీ నరసింహ కాలనీలో రూ.57 లక్షల అంచనా వ్యయంతో సీసీ రోడ్డు, పైప్ లైన్ పనులకు శ్రీకారం చుట్టారు. అక్కడి నుండి మొగ్దుంపూర్ వెళ్లిన కేంద్ర మంత్రి రూ.10 లక్షల జాతీయ ఉపాధి హామీ నిధులతో నిర్మించిన మహిళాశక్తి ధరణి గ్రామైఖ్య సంఘ భవనాన్ని స్థానిక సర్పంచ్ శివకుమార్ తో కలిసి ప్రారంభించారు. అట్లాగే రూ.15 లక్షల అంచనా వ్యయంతో నిర్మించిన సీసీ రోడ్డు, డ్రెయిన్ ను ప్రారంభించారు. అంతకుముందు చింతకుంట వెళ్లిన కేంద్ర మంత్రి బండి సంజయ్ అంబేద్కర్ భవన్ సమీపంలో నిర్వహించిన "వన మహోత్సవం–2026"లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా బండి సంజయ్ కు అధికారులతోపాటు మహిళలు పెద్ద ఎత్తున ఘన స్వాగతం పలికారు. వారితో కలిసి స్వయంగా మొక్కలను నాటారు. మేయర్, డిప్యూటీ మేయర్, కమిషనర్, అధికారులు సైతం మొక్కలు నాటారు.
దుష్ప్రచారం చేస్తే లీగల్ నోటీసులు ఇవ్వండి: మేయర్, డిప్యూటీ మేయర్‌కు బండి సంజయ్ సూచన
యూఐడీఎఫ్ (UIDF) నిధుల టెండర్ల వ్యవహారంలో తమకు ఎలాంటి సంబంధం లేదని, అది పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోని అంశమని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ స్పష్టం చేశారు. తమపై అవాస్తవ ఆరోపణలు చేస్తూ దుష్ప్రచారం చేసే వారిపై లీగల్ నోటీసులు జారీ చేసి, క్షమాపణ చెప్పకపోతే న్యాయపరమైన చర్యలు తీసుకోవాలని కరీంనగర్ మేయర్, డిప్యూటీ మేయర్‌కు సూచించారు.శనివారం కరీంనగర్ పర్యటనలో



భాగంగా అభివృద్ధి కార్యక్రమాల్లో పాల్గొన్న బండి సంజయ్, మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావులతో యూఐడీఎఫ్ నిధులు, టెండర్ల వ్యవహారంపై చర్చించారు.ఈ సందర్భంగా మేయర్, డిప్యూటీ మేయర్ మాట్లాడుతూ కొందరు బీఆర్ఎస్ నేతలు కావాలనే బీజేపీ ప్రతిష్టను దెబ్బతీయాలనే ఉద్దేశంతో అవాస్తవ ప్రచారం చేస్తున్నారని బండి సంజయ్ దృష్టికి తీసుకెళ్లారు.దీనిపై స్పందించిన బండి సంజయ్, "యూఐడీఎఫ్ టెండర్ల వ్యవహారం రాష్ట్ర ప్రభుత్వ పరిధిలోనిది. ఇందులో తమకు ఎలాంటి పాత్ర లేదని, అయినప్పటికీ బట్టకాల్చి మీద వేసే ప్రయత్నం చేస్తున్నారని" అన్నారు. గత పాలనలో అవినీతి, అక్రమాలతో మున్సిపల్ కార్పొరేషన్‌ను భ్రష్టుపట్టించిన వారే ఇప్పుడు తమపై ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.ప్రజలు అవినీతికి విసిగిపోయి బీజేపీకి అధికారాన్ని అప్పగించారని, పారదర్శక పాలన అందిస్తున్నందుకే కొందరు తప్పుడు ప్రచారం చేస్తున్నారని పేర్కొన్నారు. తప్పు చేయనప్పుడు భయపడాల్సిన అవసరం లేదని, అయితే నిరాధార ఆరోపణలు చేసి వ్యక్తిగత ప్రతిష్టను దెబ్బతీయాలనుకునే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని మేయర్, డిప్యూటీ మేయర్‌కు సూచించారు. క్షమాపణ చెప్పకపోతే కోర్టును ఆశ్రయించాలని స్పష్టం చేశారు.

# ప్రత్యామ్నాయ పంటల సాగును విస్తరించాలి..

- రైతులను చైతన్యపరచడంలో అధికారులు సమన్వయంతో పనిచేయాలి..
- జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా

కరీంనగర్ బ్యూరో,ఆగస్టు 1 (ప్రజాజ్యోతి )
జిల్లాలో తక్కువ నీటితో సాగయ్యే ఆరుతడి, ప్రత్యామ్నాయ పంటల విస్తరణకు ప్రత్యేక




కార్యాచరణ చేపట్టాలని జిల్లా కలెక్టర్ చిత్రా మిశ్రా అధికారులను ఆదేశించారు.శనివారం రాత్రి కలెక్టరేట్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఎంపీడీవోలు, తహసీల్దార్లు, వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులతో నిర్వహించిన సమీక్ష సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు, ఎంపీడీవోలు, తహసీల్దార్లు సమన్వయంతో పనిచేసి ప్రత్యామ్నాయ పంటల సాగుపై రైతులను ఒప్పించాలని సూచించారు. స్థానిక ప్రజాప్రతినిధుల సహకారంతో గ్రామాల వారీగా అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, తక్కువ నీటితో అధిక లాభదాయకమైన పంటల సాగుపై రైతులను ప్రోత్సహించాలని తెలిపారు.ప్రతి మండలంలో గత ఏడాది సాగైన పంటలు, ఈ ఏడాది సాగు ప్రతిపాదనలు, ఆరుతడి పంటల విస్తీర్ణంపై మండలాల వారీగా సమీక్ష నిర్వహించారు. కందులు, పెసలు, సన్‌ఫ్లవర్, కూరగాయలు, పూల సాగు, పప్పుధాన్యాలు, పండ్ల తోటలు, ఆయిల్‌పామ్ వంటి ప్రత్యామ్నాయ పంటల సాగును పెంచేలా రైతులకు విస్తృతంగా అవగాహన కల్పించాలని ఆదేశించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాల సాధనకు వ్యవసాయ, ఉద్యానవన శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో చురుకుగా పనిచేయాలని కలెక్టర్ సూచించారు. గ్రామాల వారీగా ఆరుతడి, ప్రత్యామ్నాయ, సేంద్రీయ పంటల సాగుపై కార్యాచరణ ప్రణాళిక రూపొందించి అమలు చేయాలని తెలిపారు. ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా అన్ని శాఖలు సమన్వయంతో ముందుకు సాగాలని పేర్కొన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు అశ్విని తానాజీ వాకడే, శ్రీనివాస్ రెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారి భాగ్యలక్ష్మి, డీఆర్‌డీఓ, జడ్పీ డిప్యూటీ సీఈవో పవన్ కుమార్, ఏడీఏలు, మండల వ్యవసాయ అధికారులు, ఎంపీడీవోలు, ఇతర జిల్లా అధికారులు పాల్గొన్నారు.

## గొల్లపల్లి మండల కేంద్రంలో రూ.74 లక్షలతో విద్యుత్ తీగల సిప్టింగ్ పనులకు శ్రీకారం:

గొల్లపల్లి ఆగష్టు 1 ప్రజాజ్యోతి
గొల్లపల్లి మండల కేంద్రంలో 11 కేవీ, 33 కేవీ విద్యుత్ తీగల సిప్టింగ్ పనుల ప్రారంభోత్సవ కార్యక్రమంలో తెలంగాణ రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. అనంతరం అధికారులతో కలిసి పనులను ప్రారంభించి, వాటి వివరాలను తెలుసుకున్నారు ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, గొల్లపల్లి మండల కేంద్రంలో విద్యుత్ సౌకర్యాల మెరుగుదల కోసం సుమారు రూ.74 లక్షలతో విద్యుత్ తీగల సిప్టింగ్ పనులను చేపట్టినట్లు తెలిపారు. ధర్మపురి నియోజకవర్గంలో విద్యుత్ మౌలిక వసతుల అభివృద్ధికి ప్రభుత్వం సుమారు రూ.4 కోట్లను మంజూరు చేసిందని, అందులో గొల్లపల్లి మండలానికే దాదాపు రూ.2.3 కోట్ల నిధులు కేటాయించినట్లు వెల్లడించారు
విద్యుత్ వ్యవస్థను మరింత బలోపేతం చేసి, ప్రజలకు నాణ్యమైన అంతరాయం లేని విద్యుత్ సరఫరా అందించడమే ప్రభుత్వ లక్ష్యమని మంత్రి పేర్కొన్నారు అభివృద్ధి పనులను నాణ్యతతో నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు
ఈ కార్యక్రమంలో మార్కెట్ చెర్మెన్ బీమా సంతోష్ ఎం ఆర్ ఓ మాజీద్ ఎంపీడీఓ



రావేందరావు సర్పంచులు నల్ల నీరజ ఎం రాంరెడ్డి రాజేశ్వర్ అరవింద్ గౌడ్ ఎం స్వామి బుర్ర బుమన్న గౌడ్ ఆకుల సుమన్ గౌడ్ కాంగ్రెస్ పార్టీ జిల్లా వైస్ ప్రెసిడెంట్ ముస్కు నిశాంత్ రెడ్డి గొల్లపెల్లి మండల్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు రాపెల్లి గంగన్న ప్రధాన కార్యదర్శి జెల్ల అనిల్ ఉప సర్పంచ్ గురుజెలా బుచ్చి రెడ్డి ప్రజా ప్రతినిధులు విద్యుత్ శాఖ అధికారులు కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు మరియు స్థానిక ప్రజలు తదితరులు పాల్గొన్నారు

## ఆగస్టు 10న జరిగే జైల్ భరోను జయప్రదం చేయాలి: సీఐటీయూ పిలుపు

ముస్తాబాద్, ఆగస్టు 1: ( ప్రజా జ్యోతి ):
రాజన్న సిరిసిల్ల జిల్లా ముస్తాబాద్ మండల కేంద్రంలో శనివారం సీఐటీయూ, రైతు సంఘం, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా నిర్వహించనున్న



జైల్ భరో కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని పిలుపునిస్తూ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సీడబ్ల్యూఎఫ్ఐ రాష్ట్ర కమిటీ సభ్యుడు గీస బిక్షపతి మాట్లాడుతూ, దేశంలోని కార్మికులు, రైతులు, శ్రమజీవులు ఎన్నో పోరాటాల ద్వారా సాధించుకున్న కార్మిక హక్కులను కేంద్రంలోని భారతీయ జనతా పార్టీ ప్రభుత్వం బలహీనపరిచే విధంగా చర్యలు తీసుకుంటోందని విమర్శించారు. ప్రభుత్వ రంగ బీమా వ్యవస్థను ప్రైవేటు బీమా సంస్థలకు అప్పగించే ప్రయత్నాలు జరుగుతున్నాయని, దీనివల్ల సంఘటిత, అసంఘటిత రంగాల కార్మికుల హక్కులు దెబ్బతింటాయని అన్నారు. రైతులకు ఉచిత విద్యుత్‌పై భారం మోపేలా బోరు బావుల వద్ద స్మార్ట్ మీటర్ల ఏర్పాటు ప్రయత్నాలు జరుగుతున్నాయని, భవిష్యత్తులో మొబైల్ సిమ్‌కు రీచార్జ్ చేసినట్లే విద్యుత్ వినియోగానికి రైతులు ముందుగానే చెల్లింపులు చేయాల్సిన పరిస్థితులు తీసుకురావాలని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రయత్నిస్తున్నాయని ఆరోపించారు. అలాంటి ప్రజావ్యతిరేక విధానాలను ఐక్యంగా ప్రతిఘటించాలని రైతులకు పిలుపునిచ్చారు.
కేంద్ర ప్రభుత్వం అమలు చేయదలచిన నాలుగు కార్మిక కోడ్‌ల వల్ల కార్మికుల హక్కులు తీవ్రంగా దెబ్బతింటాయని ఆయన అన్నారు. ఎనిమిది గంటల పనివేళలను పన్నెండు గంటలకు పెంచే అవకాశం కల్పించడం, సమ్మె హక్కుపై ఆంక్షలు విధించడం, కార్మిక సంఘాల నమోదు, గుర్తింపును కష్టతరం చేయడం, ఉద్యోగ భద్రతను బలహీనపరచడం వంటి నిబంధనలు కార్మిక వర్గానికి తీవ్ర నష్టం కలిగిస్తాయని పేర్కొన్నారు.
అలాగే 300 మంది లోపు ఉద్యోగులు పనిచేసే సంస్థల్లో కార్మికులను ముందస్తు నోటీసు లేకుండానే తొలగించే అవకాశం కల్పించడం, "హైర్ అండ్ ఫైర్" విధానాన్ని ప్రోత్సహించడం, కనీస వేతనాల అమలును బలహీనపరచడం వంటి చర్యలను వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. భవన నిర్మాణ కార్మికులు, హమాలీలు, బీడీ కార్మికులు, అంగన్‌వాడీ, ఆశా, మధ్యాహ్న భోజన పథకం, ఐకేపీ తదితర రంగాల్లో పనిచేసే కార్మికుల సంక్షేమాన్ని నిర్లక్ష్యం చేస్తున్నారని ఆరోపించారు. కార్మికులు, రైతులు, వ్యవసాయ కార్మికులు, శ్రమజీవులు అందరూ ఐక్యంగా ఆగస్టు 10న నిర్వహించే జైల్ భరో కార్యక్రమంలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల అధ్యక్షుడు కట్కూరి నరేష్, ఎడ్ల రమేష్, సీఐటీయూ మండల శాఖ కమిటీ సభ్యుడు జక్కుల యాదగిరి, సునుగూరి బాలయ్య, ఎడ్ల ప్రవీణ్, రంజాన్, రాజయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.

# వాణినికేతన్ హైస్కూల్లో ఘనంగా పోచమ్మ బోనాలు

ఇల్లంతకుంట ఆగస్టు 1(ప్రజాజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండల కేంద్రంలోని వాణి నికేతన్ హై స్కూల్లో శనివారం రోజు పోచమ్మ బోనాలు ఘనంగా నిర్వహించారు. పాఠశాల ఆవరణలో పోచమ్మ చిత్రపటం వద్ద పూజలు నిర్వహించారు. సాంప్రదాయ దుస్తులు ధరించి వచ్చిన విద్యార్థినిలు పోచమ్మ బోనాలు ఎత్తుకున్నారు.
డప్పు చప్పుళ్ళు, పోతరాజుల విన్యాసాల మధ్య బస్టాండ్ వరకు ర్యాలీ కొనసాగింది. ఈ సందర్భంగా విద్యార్థుల సంస్కృతిక కార్యక్రమాలు





ఆకట్టుకున్నాయి. అనంతరం పోచమ్మ ఆలయానికి చేరుకొని నైవేద్యం సమర్పించారు. ఈ సందర్భంగా పాఠశాల కరస్పాండెంట్ తూముకుంట శ్రీనివాస్ రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతికి ప్రతీక అయిన బోనాల పండుగను పాఠశాలలో నిర్వహించడం గర్వకారణం అన్నారు. పిల్లలకు చదువుతోపాటు సాంప్రదాయాలు, ఆచారాలపై అవగాహన కల్పించాలని లక్ష్యంతో కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. బోనాల పండుగ ఐక్యమత్యానికి, సంస్కృతికి నిదర్శనం అన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపల్ తూముకుంట శ్రీనిధి, ఉపాధ్యాయనీలు సుమంగళి, శోభ, మహాలక్ష్మి, లావణ్య, సునంద, మౌనిక, కళ్యాణి, శమీమా, రేణుక, జలజ, శాంత, పద్మ, స్వాతి, రేణుక, సునీత, ఉష, ఉపాధ్యాయులు శ్రీనివాస్, రాజు, సంతోష్, రమేష్, రాజు, తిరుపతి లతోపాటు విద్యార్థులు పాల్గొన్నారు.

# కందికట్కూర్ ముదిరాజ్ సంఘం 2 అధ్యక్షుడిగా తూటి పరశురాం

ఇల్లంతకుంట ఆగస్టు 1 (ప్రజజ్యోతి)
రాజన్న సిరిసిల్ల జిల్లా ఇల్లంతకుంట మండలంలోని కందికట్కూర్ గ్రామ ముదిరాజ్ సంఘం 2 ఎన్నికలు శనివారం రోజు నిర్వహించారు ఈ కార్యక్రమంలో సంగసభ్యులందరూ పాల్గొని



అధ్యక్షునిగా తూటీ పరశురాంను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు ఉపాధ్యక్షులుగా జంగిటి మల్లేశం కోశాధికారిగా బత్తిని పర్శరామ్ డైరెక్టర్లు అంజయ్య దేవరాజు రాజయ్యలు ఏకగ్రీవంగా ఎన్నికైనారు.

# ఎల్నినో ప్రభావం పై సమీక్ష సమావేశం

చొప్పదండి, ఆగస్టు 1 (ప్రజాజ్యోతి):
చొప్పదండి ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘంలో సహకార సంఘం ఛైర్మన్ ఇప్ప శ్రీనివాస్ రెడ్డి ఆధ్వర్యంలో ఎల్ నినో ప్రభావ తీవ్రత తగ్గించేందుకు తీసుకోవాల్సిన ప్రత్యామ్నాయ మార్గాల గురించి మండల రైతులతో శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాభావ పరిస్థితుల్లో తీసుకోవాల్సిన జాగ్రత్తల




గురించి అవగాహన కల్పించారు.కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్ పర్సన్ పెరుమండ్ల మానస గంగయ్య గౌడ్, అత్మ ఛైర్మన్ కౌన్సిలర్ గుర్రం రాజేందర్ రెడ్డి, కౌన్సిలర్ లు ముద్దం రాజేశ్వరి తిరుపతి గౌడ్, గుర్రం సుజీత్ రెడ్డి, సొసైటీ డైరెక్టర్ మారు తిరుపతి రెడ్డి, కుర్ర రాజయ్య, వ్యవసాయ అధికారులు, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

# పాపటపల్లి గ్రామంలో మత్స్యకారుల సహకార సంఘం ఏకగ్రీవం ఎన్నిక

రఘునాధపాలెం ప్రజా జ్యోతి:
కరివిరాల గ్రామ ప్రజల ఆరోగ్య పరిరక్షణకు ప్రాధాన్యత ఇస్తూ, దోమల ద్వారా వ్యాపించే డెంగ్యూ, మలేరియా, చికున్‌గున్యా వంటి సీజనల్ వ్యాధులను నివారించే లక్ష్యంతో కరివిరాల గ్రామ పంచాయతీలో శనివారం 'ఇంటింటికీ దోమల





నివారణ' ప్రత్యేక కార్యక్రమాన్ని సర్పంచ్ శ్రీమతి మారోజు పార్వతమ్మ అధికారికంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా పంచాయతీ సిబ్బంది, ఆరోగ్య శాఖ బృందం గ్రామంలోని ప్రతి వీధి, ప్రతి ఇంటిని సందర్శించి దోమల నివారణ మందును పిచికారీ చేశారు. ఇళ్ల పరిసరాల్లో నిల్వ నీరు ఉండకుండా చూసుకోవాలని, నీటి నిల్వ పాత్రలను ఎప్పటికప్పుడు శుభ్రం చేయాలని, చెత్తను ఎక్కడపడితే అక్కడ వేయకుండా పరిశుభ్రత పాటించాలని గ్రామస్తులకు అవగాహన కల్పించారు. సర్పంచ్ మారోజు పార్వతమ్మ మాట్లాడుతూ, గ్రామంలో ప్రజల ఆరోగ్య పరిరక్షణే తమ ప్రధాన లక్ష్యమని, సీజనల్ వ్యాధులను అరికట్టేందుకు గ్రామస్తులందరూ పంచాయతీ అధికారులకు సహకరించాలని కోరారు. ప్రతి కుటుంబం తమ ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవడం ద్వారా దోమల వ్యాప్తిని సమర్థవంతంగా నివారించవచ్చని తెలిపారు. పంచాయతీ కార్యదర్శి అన్వర్ మాట్లాడుతూ, గ్రామంలో దోమల నివారణ చర్యలను నిరంతరం కొనసాగిస్తామని, ప్రజలు జ్వరం లక్షణాలు కనిపిస్తే వెంటనే సమీప ప్రభుత్వ ఆరోగ్య కేంద్రాన్ని సంప్రదించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి అన్వర్, ఆశా వర్కర్ రమణ కుమారి, ఫీల్డ్ అసిస్టెంట్ ఉష, గ్రామ పంచాయతీ సిబ్బంది, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

# తల్లిపాలు అమృతంతో సమానం సూపర్వైజర్ రజిని

సత్తుపల్లి ఆగస్టు01(ప్రజా జ్యోతి )
తల్లిపాలలో పోషక విలువలు మెండుగా ఉంటాయని, అమృతంతో సమానమని ఐసిడిఎస్ సూపర్వైజర్ రజని అన్నారు. మండల పరిధిలోని చెరుకుపల్లి గ్రామంలో నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో కిష్టారం సెక్టార్ సూపర్వైజర్





రజని మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంటలోపే ముర్రుపాలు పట్టించాలని, తల్లిపాలలో ఉండే పోషక విలువలకు సమానమైన ఆహారం మరొకటి లేదన్నారు. అందువల్ల అందరూ పిల్లలకు తల్లపాలు తప్పనిసరిగా పాటించాలన్నారు.గర్భిణీగా గుర్తించిన దగ్గర నుంచి పోషక విలువలు కలిగిన ఆహారాన్ని తీసుకోవడం ద్వారా పుట్టబోయే బిడ్డ ఆరోగ్యంగా పుడతాడని,బిడ్డకు సమృద్ధిగా పాలు అందించవచ్చు అని, సుఖ ప్రసవం అవుతాన్నారు.అనంతరం తల్లిపాల ప్రాముఖ్యతను తెలియజేసే విధంగా రూపొందించిన బ్యానర్ తో ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చెరుకుపల్లి గ్రామ సర్పంచ్, ఉప సర్పంచ్ ఏఎన్ఎం, అంగనవాడి టీచర్లు , ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.


## ఉచిత ఆరోగ్య శిబిరంలో పాల్గొన్న డాక్టర్ నవీన్ కుమార్

చింతకాని ఆగస్టు 01 ప్రజాజ్యోతి : మండలం నాగిలిగొండ గ్రామంలో చర్చ్ ఆఫ్ గాడ్ పాస్టర్. ఎల్డర్ డేవిడ్ రాజు సహకారంతో మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఉచిత హెల్త్ క్యాంపు నిర్వహించినారు..ఈ సందర్భంగా డాక్టర్ నవీన్ కుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ సమతుల్యమైన ఆహారం తీసుకోవాలి అని ఆకుకూరలు, కూరగాయలు, పండ్లు, పప్పులు వంటి పోషకాహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి అని ఉప్పు, చక్కెర, నూనె పదార్థాలను వీలైనంత వరకు తగ్గించి,బీపీ, షుగర్ వంటి సమస్యలు ఉన్నవారు క్రమం తప్పకుండా పరీక్షలు చేయించుకుని, వైద్యుల సూచనల ప్రకారం మందులు వాడాలి అని సూచనలు చేసినారు. ఈ యొక్క కార్యక్రమంలో స్థానిక దైవజనులు ఎల్డర్. డేవిడ్ రాజ్, డాక్టర్ నవీన్ కుమార్, హాస్పటల్ సిబ్బంది మరియు స్థానికులు పాల్గొన్నారు.

## ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా జి. రాజేంద్ర ప్రసాద్

### పదోన్నతిపై ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా నియామకం

కొత్తగూడెం (సింగరేణి), ఆగస్టు 1, ప్రజాజ్యోతి:
సంస్థలో కార్పొరేట్ పర్సనల్ విభాగంలోని పీఎం విభాగంలో ఏజీఎం (పర్సనల్)గా పనిచేస్తున్న జి. రాజేంద్ర ప్రసాద్ పదోన్నతిపై సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ సెక్రటరీగా శనివారం బాధ్యతలు స్వీకరించారు. సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన కొత్త బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా సింగరేణి ఎడ్యుకేషన్ సొసైటీ అధికారులు, ఉద్యోగులు ఆయనకు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. కొత్త బాధ్యతల్లో విజయవంతం కావాలని ఆకాంక్షించారు.



# శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్ డయాబెటిక్ వైట్ రైస్ షో రూమ్ ను ప్రారంభించిన త్రునివ షుగర్ మంత్ర ఫౌండర్ భువన ప్రసాద్

ఖమ్మం ప్రతినిధి: ఆగస్టు:1(ప్రజా జ్యోతి)
ఖమ్మం నగరంలోని కృషి భవన్ రోడ్, ఓల్డ్ వెంకటేశ్వర థియేటర్ సర్కిల్ వద్ద జాగర్లముడి వెంకటేశ్వర్లు,పవిత్ర వారిచే నూతనంగా ఏర్పాటు చేసిన 'శ్రీ వెంకటేశ్వర ట్రేడర్స్' (డయాబెటిక్ వైట్ రైస్) కార్యక్రమమునకు షుగర్ మంత్ర ఫౌండర్ భువన ప్రసాద్, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ శాసనసభ్యులు సండ్ర వెంకట వీరయ్య, హైదరాబాద్ తెలంగాణ డిస్ట్రిబ్యూటర్ మనోహర్ ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు.





అనంతరం వారు మాట్లాడుతూ మధుమేహ బాధితులకు మేలు చేసే ఆరోగ్యకరమైన బియ్యాన్ని అందుబాటులోకి తీసుకురావడం అభినందనీయమని వారిని కొనియాడారు. అనంతరం షుగర్ మంత్రా ఫౌండర్ భువన ప్రసాద్ మాట్లాడుతూ ఈ బియ్యం రెండు మూడు సంవత్సరముల నుండి సాగులో ఉందని దీనిని షుగర్ ఫ్రీ బియ్యమని, ఈ బియ్యంను పంట పండగానే కోసి ప్యాక్ చేసేవి కావని, సుమారు 18 నెలలు బియ్యం నిలువ చేసి మరలా తీసి బియ్యం ను లైట్ మిల్లింగ్ చేసి వాటిని ప్యాక్ చేస్తామని ఇందులో తౌడు, జింకు, ఫైబర్ శాతం ఎక్కువగా ఉంటాయని, సాధారణంగా పండించే బియ్యంను పాలిష్ చేస్తే కంటెన్స్ అన్ని పోతాయని, అలాగని ఈ బియ్యం బ్రౌన్ రైస్ కాదని, సులభంగా అరుగుదల ఉంటుందని, దీనిలో ఫైబర్ కంటెంట్ ఎక్కువగా ఉంటాయి అని వారు తెలియజేశారు. అలాగే ఈ బియ్యం వండిన తరువాత త్వరగా పాడు కాకుండా ఉంటుందని, ఈ రైస్ గుంటూరు జిల్లా బాపట్ల, కర్ణాటక సరిహద్దులలో ఒక కుటుంబం వారు సుమారు 300 ఎకరాలలో సాగు చేస్తున్నారని, ఈ పంటకు ఎరువులు వాడకుండా సేంద్రియ పద్ధతుల్లో పంట పండిస్తున్నారని, ఇది పూర్తిగా ఆర్గానిక్ పంట అని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఖమ్మం రూరల్ మాజీ మండల పార్టీ అధ్యక్షులు బెల్లం వేణుగోపాల్, నాయకులు బలుసు మురళీకృష్ణ మరియు ఇతర ముఖ్య నాయకులు, ప్రముఖులు పాల్గొని శుభాకాంక్షలు తెలిపారు.

# సత్తుపల్లిలో వెల్నెస్ సెంటరు ఏర్పాటు చేయాలి

సత్తుపల్లి ఆగస్టు01(ప్రజా జ్యోతి)
పెన్షనర్లు ఉద్యోగులకు ఉపయోగపడేలా సత్తుపల్లి కేంద్రంగా వెల్ నెస్ సెంటరు ఏర్పాటు చేయాలని తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల సంఘం ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసింది. శనివారం సత్తుపల్లి



లోని సంఘ భవనంలో కేశవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యవర్గ సమావేశంలో కార్యదర్శి నివేదికను ప్రకాశరావు, ఆర్థిక కార్యదర్శి నివేదికను జి.కృష్ణయ్య ప్రవేశ పెట్టారు. అనంతరం జరిగిన సమావేశంలో పలు అంశాలపై జరిగిన చర్చలో పెన్షనర్లు మాట్లాడుతూ జిల్లాకొక వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేస్తామని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిందని అన్నారు.జిల్లా కేంద్రమైన ఖమ్మానికి సత్తుపల్లి 80కి.మీ.దూరంలో ఉన్నదని,ఇక్కడి సబ్ ట్రెజరీ కార్యాలయ పరిధిలో వేలాదిమంది ఉద్యోగులు,పెన్షనర్లు ఉన్నారని అన్నారు.జిల్లా కేంద్రం దూరంలో ఉన్నందున అందరికీ ఉపయోగపడే విధంగా సత్తుపల్లి లోనే వెల్ నెస్ సెంటర్ ఏర్పాటు చేయాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు.

హెల్త్ కార్డులపై అయోమయ స్థితి:
ఉద్యోగులు,విశ్రాంత ఉద్యోగులకు ఉపయోగకరమైన హెల్త్ స్కీమ్ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న విధానం పట్ల సమావేశంలో నిరసన వ్యక్తం చేసారు.ముందుగా విధివిధానాలు లేకుండానే జూన్ నెలనుండి వేతనాలు, పెన్షన్లలో 1.5శాతం మినహాయిస్తున్నారని మూడు నెలలైనా వైద్య చికిత్స అందించే ఆసుపత్రుల విషయంలో అయోమయ స్థితి నెలకొన్నదని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం హెల్త్ కార్డులపై చికిత్స అందించే ఆసుపత్రుల పేర్లు విడుదల చేసింది.కానీ,ఆ ఆసుపత్రులలో చాలా వరకు హెల్త్ కార్డులను అనుమతించడం లేదని అన్నారు.ఇప్పటి వరకు హెల్త్ కార్డులే అందించలేని నిస్సహాయ స్థితిలో ప్రభుత్వం ఉన్నదని అన్నారు.రాష్ట్ర కేంద్రం హైదరాబాదు లో సమావేశాలు జరుగుతున్నా ఫలితాలు ఆశాజనకంగా లేవని ఆవేదన వ్యక్తం చేసారు.ఫ్యామిలీ పెన్షనర్లు మాట్లాడుతూ తమకు వచ్చే పెన్షన్ తక్కువ అని అందులో 1.5 శాతం వైద్యం కొరకు మినహాయించడం వలన తమకు అర్థికంగా భారమౌతున్నదని అన్నారు.ఫ్యామిలీ పెన్షనర్లకు ఉచితంగా వైద్యం అందించాలని కోరారు.
డిఏలు,పీఆర్సీ వెంటనే అమలు చేయాలి. ఉద్యోగులు,పెన్షనర్లకు రావలసిన ఆరు ఇంక్రిమెంట్లు వెంటనే విడుదల చేయాలని సమావేశం డిమాండ్ చేసింది. పీఆర్సీ నివేదికను వెంటనే తెప్పించుకుని అమలు ఉత్తర్వులు సత్వరం విడుదల చేయాలని కోరారు.సమస్యలు వెంటనే పరిష్కరించ నట్లయితే ఉద్యమించక తప్పదని సమావేశంలో తీర్మానం చేసారు.ఈ సమావేశంలో అధ్యక్ష,కార్యదర్శులు కేశవరెడ్డి, ప్రకాశరావులతోపాటు రామిశెట్టి సుబ్బారావు,అద్దంకి వెంకటరత్నం, ఎన్.నర్సయ్య, జి.కృష్ణయ్య,యోగానంద్, మహమూద్,కమలకుమారి,వాణి,సాంబశివ రెడ్డి,బూరుగు దాసు,సుందరరావు,మధుసూదన రాజు తదితరులు పాల్గొన్నారు.

# 24×7 కంట్రోల్ రూమ్ ద్వారా ప్రజలకు తక్షణ సేవలు

## వర్షాల అత్యవసర పరిస్థితులపై నిరంతర పర్యవేక్షణ అన్ని శాఖలు సమన్వయంతో పనిచేయాలి: జిల్లా కలెక్టర్ అంకిత్

కొత్తగూడెం కలెక్టరేట్ , ఆగస్టు 01(ప్రజా జ్యోతి):
వర్షాకాల పరిస్థితుల దృష్ట్యా జిల్లాలో ఎలాంటి అత్యవసర పరిస్థితులు తలెత్తినా వెంటనే స్పందించేలా జిల్లా యంత్రాంగం పూర్తిస్థాయిలో సిద్ధంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ ఆదేశించారు. వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను సమర్థవంతంగా ఎదుర్కొనేందుకు జిల్లా కేంద్రంలోని ఐ టి ఓ సి కార్యాలయంలో జీ–19 గదిలో 24×7 జిల్లా కంట్రోల్ రూమ్‌ను ఏర్పాటు చేసినట్లు జిల్లా కలెక్టర్ అంకిత్ శనివారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆగస్టు 3, సోమవారం నుంచి వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఉద్యోగులను మూడు షిఫ్టుల్లో విధులు నిర్వహించేలా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేసినట్లు వెల్లడించారు,ఉదయం 7.00 గంటల నుంచి మధ్యాహ్నం 2.00 గంటల వరకు, మధ్యాహ్నం 2.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు, రాత్రి 9.00 గంటల నుంచి మరుసటి రోజు ఉదయం 7.00 గంటల వరకు మూడు షిఫ్టుల్లో కంట్రోల్ రూమ్ నిరంతరాయంగా పనిచేస్తుందని తెలిపారు. ప్రజల నుంచి కంట్రోల్ రూమ్‌కు అందే ఫిర్యాదులు, సమాచారం, వర్షాల కారణంగా తలెత్తే అత్యవసర పరిస్థితులను వెంటనే నమోదు చేసి సంబంధిత శాఖలకు సమాచారం అందిస్తూ తక్షణ చర్యలు చేపట్టేలా సమన్వయం చేయాలని విధుల్లో ఉన్న సిబ్బందిని ఆదేశించారు. అందిన ప్రతి ఫిర్యాదును ప్రత్యేక రిజిస్టర్‌లో నమోదు చేసి, దానిపై తీసుకున్న చర్యల వివరాలను కూడా నమోదు చేయాలని సూచించారు. జిల్లాలో వర్షాల పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని శాఖలు సమన్వయంతో ముందస్తు చర్యలు చేపట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఎక్కడైనా రహదారులు దెబ్బతినడం, లోతట్టు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉండడం, వాగులు, వంకలు పొంగిపొర్లడం వంటి పరిస్థితులు తలెత్తిన వెంటనే సంబంధిత శాఖలు స్పందించి సహాయక చర్యలు చేపట్టాలని సూచించారు. సంబంధిత శాఖల జిల్లా అధికారులు తమ శాఖలకు కేటాయించిన అధికారులు, ఉద్యోగులు విధులకు తప్పని సరిగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని, ఎవరైనా సెలవులో ఉన్నట్లయితే వారి స్థానంలో వెంటనే ప్రత్యామ్నాయ సిబ్బందిని నియమించాలని కలెక్టర్ ఆదేశించారు. అత్యవసర పరిస్థితుల దృష్ట్యా




కంట్రోల్ రూమ్‌లో విధులు నిర్వహించే అధికారులు, సిబ్బంది ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని, విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహించినా లేదా ప్రభుత్వ ఆదేశాలను ఉల్లంఘించినా కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ అంకిత్ హెచ్చరించారు. వర్షాల కారణంగా అత్యవసర పరిస్థితులు లేదా ఇతర సమస్యలు ఎదురైనప్పుడు ప్రజలు జిల్లా కంట్రోల్ రూమ్ 08744-241950 నంబర్‌కు సమాచారం అందించాలని జిల్లా కలెక్టర్ అంకిత్ కోరారు. ప్రజల నుంచి అందే ప్రతి సమాచారంపై వెంటనే స్పందించి అవసరమైన చర్యలు చేపట్టేందుకు జిల్లా యంత్రాంగం అన్ని వేళలా సిద్ధంగా ఉంటుందని తెలిపారు.

# పొంచి ఉన్న ప్రమాదం.. తక్కువ ఎత్తు కాజ్‌వేతో నిత్యం ప్రాణభయం

## సూచిక బోర్డులు లేవు.. రక్షణ గోడలు లేక ప్రమాదాల ముప్పు

అన్నపురెడ్డిపల్లి, ఆగస్టు 1 (ప్రజా జ్యోతి):
అన్నపురెడ్డిపల్లి నుంచి బుగ్గపాడు మీదుగా సత్తుపల్లి వెళ్లే ప్రధాన రహదారిలో రాళ్లవాగుకు పక్కన ఉన్న తక్కువ ఎత్తు కాజ్‌వే వాహనదారులకు, ప్రజలకు నిత్యం ప్రాణభయాన్ని కలిగిస్తోంది. ఇటీవల ఈ రహదారిని అభివృద్ధి చేసినప్పటికీ కాజ్‌వేను మాత్రం తక్కువ ఎత్తులోనే నిర్మించారు. అంతేకాకుండా కాజ్‌వేకు ఇరువైపులా రక్షణ గోడలు (రెయిలింగ్స్) ఏర్పాటు చేయకపోవడంతో ప్రమాదాల ముప్పు పొంచి ఉందని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారీ వర్షాలు కురిసినప్పుడు రాళ్లవాగులో వరద నీటి ప్రవాహం పెరిగి కాజ్‌వే వరకు చేరుతోంది. దీంతో రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడుతోంది. బుగ్గపాడు, పరిసర గ్రామాల ప్రజలు, రైతులు, విద్యార్థులు, ఉద్యోగులు గంటల తరబడి నిరీక్షించాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. అత్యవసర పరిస్థితుల్లో కూడా ప్రయాణాలు నిలిచిపోతుండటంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రస్తుతం ఉన్న తక్కువ ఎత్తు కాజ్‌వే స్థానంలో ఎత్తైన బ్రిడ్జిని నిర్మించాలని స్థానికులు కోరుతున్నారు. కాజ్‌వే వద్ద ప్రమాదకర ప్రాంతమని హెచ్చరించే సూచిక బోర్డులు లేకపోవడం, రాత్రి వేళల్లో లైటింగ్ సౌకర్యం లేకపోవడం, ఇరువైపులా రక్షణ గోడలు లేకపోవడంతో ప్రమాదాల ముప్పు మరింత పెరుగుతోంది. ఎదురెదురుగా వచ్చే వాహనాలు దాటే సమయంలో చిన్న పొరపాటు జరిగినా





వాహనాలు అదుపుతప్పే ప్రమాదం ఉందని స్థానికులు చెబుతున్నారు. గత కొంతకాలంగా ఈ కాజ్‌వే వద్ద ద్విచక్ర వాహనాలు, కార్లు, ఇతర వాహనాలు ప్రమాదాలకు గురైన ఘటనలు చోటుచేసుకున్నాయని గ్రామస్థులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా సంబంధిత రోడ్లు–భవనాల శాఖ అధికారులు స్పందించి కాజ్‌వేకు ఇరువైపులా బలమైన రక్షణ గోడలు ఏర్పాటు చేయడంతో పాటు ప్రమాద హెచ్చరిక సూచిక బోర్డులు, రాత్రి లైటింగ్ సౌకర్యం కల్పించాలని వాహనదారులు, ప్రయాణికులు కోరుతున్నారు. అలాగే భారీ వర్షాల సమయంలో రాకపోకలకు అంతరాయం కలగకుండా శాశ్వత పరిష్కారంగా ప్రస్తుతం ఉన్న తక్కువ ఎత్తు కాజ్‌వే స్థానంలో ఎత్తైన బ్రిడ్జిని నిర్మించాలని గ్రామ ప్రజలు విజ్ఞప్తి చేస్తున్నారు.

# బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి

## ఐసిడిఎస్ సూపర్వైజర్ సంధ్యారాణి

చింతకాని ఆగస్టు1(ప్రజా జ్యోతి):
బిడ్డ పుట్టిన వెంటనే వీలైనంత త్వరగా ముర్రు పాలు పట్టించాలని చింతకాని సెక్టార్ సూపర్వైజర్ సంధ్యారాణి అన్నారు. చింతకాని మండల పరిధిలోని కోదుమూరు 1,2 అంగన్వాడీ కేంద్రాల పరిధిలో అంగన్వాడి టీచర్లు గౌస్య బేగం ,అచ్చమాంబ ఆధ్వర్యంలో





నిర్వహించిన తల్లిపాల వారోత్సవాలలో సంధ్యారాణి మాట్లాడుతూ ముర్రుపాలు తాగిన పిల్లల్లో చురుకుదనంతోపాటు ఉత్సాహంగా, ఉల్లాసంగా, ఆరోగ్యంగా ఉంటారని అన్నారు. డాక్టర్ వెంకటేశ్వర రావు మాట్లాడుతూ గర్భిణీగా గుర్తించిన దగ్గర్నుంచి అంగన్వాడి కేంద్రాల ద్వారా ఆరోగ్య శాఖ అందించే సేవలను సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీ అవ్వాలని సూచించారు. సర్పంచ్ నాగరాణి ,ఉపసర్పంచ్ రాంబాబు మాట్లాడుతూ అంగన్వాడి కేంద్రాల ద్వారా అందిస్తున్న సేవలు అందరూ సద్వినియోగం చేసుకోవాలని, కేంద్రాల బలోపేతానికి కృషి చేస్తామని అన్నారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాస కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ కార్యదర్శి రాజేష్, ఆయా రమాదేవి,ఆశా వర్కర్లు రేణుక, వరమ్మ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవీ విరమణ అనంతరం సామాజిక సేవ చేయాలి

### డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్ కొత్వాల

కొత్తగూడెం కలెక్టరేట్ ,ఆగస్టు 01,(ప్రజా జ్యోతి):
ప్రభుత్వ ఉద్యోగులు తమ పదవి విరమణ అనంతరం సమాజ సేవ



చేస్తూ అందరికీ సహాయ పడాలని డీ.సీ.ఎం.ఎస్ మాజీ చైర్మన్, రాష్ట్ర మార్క్ఫెడ్ మాజీ డైరెక్టర్, పాల్వంచ సొసైటీ అధ్యక్షులు కొత్వాల శ్రీనివాసరావు అన్నారు. పాల్వంచ కె.టి.పి.ఎస్ 5, 6 దశలలోని 7 వ దశలోని ఉద్యోగులు శనివారం పదవీ విరమణ చేశారు. కె.టి.పి.ఎస్ 5, 6 దశల్లో అసిస్టెంట్ అకౌంట్స్ ఆఫీసర్ గా పని చేస్తున్న పర్వత రామారావు, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ గా పనిచేస్తున్న కొల్లు వెంకటేశ్వరరావు, 7వ దశలో 1గ్రేడ్ ఫోర్ మెన్ గా పనిచేస్తున్న సముద్రాల రాంబాబు, 2 గ్రేడ్ ఫోర్ మెన్ గా పనిచేస్తున్న సయ్యద్ యాకూబ్, ప్లాంట్ అటెండెంట్ గా పనిచేస్తున్న చిటికెన నాగేశ్వరరావు లు పదవి విరమణ పొందారు. వీరి పదవీ విరమణ సందర్భంగా కె.టి.పి.ఎస్ కర్మాగారాల్లో జరిగిన రిటైర్మెంట్ ఫంక్షన్ లో కొత్వాల తో పాటు 46వ డివిజన్ కార్పొరేటర్ కొత్వాల విమలదేవి దంపతులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కొత్వాల మాట్లాడుతూ ఉద్యోగులు సంపాదించిన దానిలో కొంతమేర తోటి వారికి సహాయ పడాలన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ కార్మిక సంఘాల నాయకులు, పలువురు ఇంజనీర్లు, కార్మికులు పాల్గొన్నారు.

## దర్యాప్తు పూర్తయ్యే వరకు రేగపై అసత్య ప్రచారం ఆపాలి: బీఆర్ఎస్ నాయకులు

ఆళ్ళపల్లి,ఆగస్టు1(ప్రజా జ్యోతి):
మాజీ ఎమ్మెల్యే రేగ కాంతారావుపై సోషల్ మీడియా, కొన్ని మీడియా వేదికల్లో జరుగుతున్న అసత్య ప్రచారాన్నిఆళ్ళపల్లి మండల బీఆర్ఎస్ నాయకులు ఖండించారు. ఫిర్యాదు నమోదు కావడం చట్టపరమైన ప్రక్రియలో భాగమేనని, దర్యాప్తు పూర్తికాకముందే నిర్ధారణ కాని ఆరోపణలను ప్రచారం చేయడం సరికాదన్నారు. ప్రతి ఒక్కరూ చట్టపరమైన ప్రక్రియను గౌరవిస్తూ సంయమనం పాటించాలని, నిజానిజాలను దర్యాప్తు సంస్థలే వెలికితీస్తాయనే విశ్వాసం వ్యక్తం చేశారు.ఈ కార్యక్రమం లో బి ఆర్ ఎస్ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు

# మహంకాళి నగర్ లో ఘనంగా ఆషాడ మాసం బోనాలు..

కుత్బుల్లాపూర్ 1 ఆగస్టు (ప్రజా జ్యోతి)



ఎల్లమ్మ బండ మహంకాళి నగర్ లో స్థానిక మహిళా నాయకురాలు, బస్తీ వ్యవస్థాపకురాలు అనసూయమ్మ ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గత 33 సంవత్సరాల నుండి అమ్మవారి వేడుకలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కుల మతాలక తీతంగా తమ బస్తీలో అంగరంగ వైభవంగా ప్రతి సంవత్సరం వేడుకలను నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. వారి కుమారుడు నర్సింగరావు మాట్లాడుతూ అమ్మవారి ఆశీస్సులతో బస్తీ ప్రజలు ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని వేడుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బస్తీ ప్రజలు యువకులు మహిళలు పాల్గొని విజయవంతం చేయాలని అన్నారు

# జిల్లా వ్యాప్తంగా 30 పోలీస్ యాక్ట్ అమలు

**జిల్లా ఎస్పీ అఖిల్ మహాజ న్**
**ముందస్తు అనుమతులు లే కుండా ప్రజా బహిరంగ కార్యక్రమాలు,సభలు, ర్యాలీ లు నిషేధం**
**ఆగస్టు నెల 31 తారీఖు వ రకు నిబంధనలు వర్తిస్తా యి**
**నిబంధనలు ఉల్లంఘించిన వారిపై కఠిన చర్యలు**
**ఉత్తర్వులు జారీ చేసిన జిల్లా ఎస్పీ**

ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 1 (ప్రజా జ్యోతి): శాంతి భద్రతల పరిరక్షణ దృష్ట్యా, జిల్లాలో ఎలాంటి అసాంఘిక కార్యక్రమాలు, అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా, ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగం గా, జిల్లాలో ఉన్న ప్రశాంత వాతావరణంకు భంగం కల గకుండా, సవ్యంగా కొనసా గించడానికి ఆగస్టు ఒకటి నుండి 31 వరకు జిల్లా వ్యా ప్తంగా 30 పోలీస్ ఆక్ట్ అమ లులో ఉంటుందని జిల్లా ఎ స్పీ అఖిల్ మహాజన్ ఐపీఎ స్ తెలిపారు. ఈ మేరకు శనివారం స్థానిక పోలీసు ముఖ్య కార్యాలయం నుండి ఒక ప్రకటన విడుదల చేస్తూ వివరాలను వెల్లడించారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ 30 పోలీస్ ఆక్ట్ – 1861 అమల్లో ఉన్నం దున జిల్లాలో డి ఎస్పి లేదా ఆ పై స్థాయి అధికారుల నుండి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి ప్రజా స మావేశాలు,



ఊరేగింపులు, ధర్నాలు, బహిరంగ సభలు, ప్రజలు గుమి గుడి ఉండే వి ధంగా కార్యక్రమాలు నిర్వ హించరాదని, సన్నాహాలు కూడా చేయరాదని తెలిపా రు. నిషేధిత ఆయుధాలు, కత్తులు, కర్రలు, దుడ్డు కర్ర లు, తుపాకులు, పేలుడు ప దార్థాలు, దురుద్దేశంతో నేరా లను ఉసి గొలిపేటు వంటి ఆయుధాలు కలిగి ఉండరా దని తెలిపారు. ప్రజా జీవ నానికి ఇబ్బందికి దారి తీసే ప్రజా సమావేశాలు, జన సమూహం లాంటివి పూర్తి గా నిషేధించబడ్డాయని తె లిపారు. అధిక శబ్దం వచ్చే స్పీకర్లు, డీజే లు వంటివి వా టికి అనుమతులు లేవని తె లిపారు. ప్రచార రథాలు, మై కులు, తదితర అధిక శబ్దం పరికరాలు నిషేధించబడ్డా యని సూచించారు. చట్ట ప్రకారం జారీ చేసిన ఆదేశా లను ఎవరైనా ఉల్లంఘిస్తే 30 పోలీస్ ఆక్ట్ ప్రకారం శిక్షకు అర్హుల వుతారని సూచిం చారు. నిషేధంలో ఉన్న ని బంధనలను తప్పనిసరిగా ప్రతి ఒక్కరు పాటించాలని తెలిపారు. ఎలాంటి కార్యక్ర మాలు నిర్వహించాలన్న ముందస్తుగా దరఖాస్తు చే సుకొని అనుమతులను పొందాలని సూచించారు. నిబంధనలను అతిక్రమించి ఉల్లంఘించిన వారిపై చట్ట ప్రకారం చర్యలు తీసుకోబడ తాయని హెచ్చరించారు.

# సోషల్ మీడియాతో పాత్ర మరువలేనిది

**మొదటిపేజీ తరువాయి..**

పరిస్థితి లేదా..? ఒక అమ్మాయి మీద లైంగిక దాడి జరిగింది.. కేంద్ర మంత్రి కుమారుడు ఈ దుర్మార్గమైన పని చేశాడని ఆ అమ్మాయి తల్లీదండ్రులు వచ్చి ఫిర్యాదు చేస్తే వారం రోజులు ఏ మీడియా రిపోర్ట్ చేసింది..? సోషల్ మీడియానే లేకపోతే ఆ అమ్మాయికి న్యాయం జరిగే పరిస్థితి ఉందా..? అని కేటీఆర్ ప్రశ్నించారు. నవతెలంగాణ దినపత్రిక 11వ వార్షికోత్సవం సందర్భంగా హైదరాబాద్‌లో బాగ్ లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో నిర్వహిస్తున్న సెమినార్‌లో 'రాజ్యాంగం ? ప్రజాస్వామ్యం ? పత్రికా స్వేచ్ఛ' అంశంపై కేటీఆర్ ప్రసంగించారు. లగచర్లలో గిరిజనుల మీద అకృత్యాలు జరిగితే ఏ మీడియా రాసింది.. నేను ఈ మాట అంటున్నందుకు దయచేసి ఎవరూ ఏం అనుకోవద్దు.. వాస్తవాలు చెబితే చేదుగానే ఉంటాయి. ఈ రోజున్న పరిస్థితుల్లో డైరెక్టుగా శాసనసభలో, బయట ప్రభుత్వంలో ఉన్న పెద్దలు జర్నలిస్టుల పట్ల అసహనం వ్యక్తం చేస్తే కూడా ఏ మీడియా ప్రశ్నించింది.. ? హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో 400 ఎకరాల భూమి విషయంలో విద్యార్థులు కదం తొక్కే దాకా ఏ మీడియా రాసింది..?ఎక్కడుంది పరిశోధనాత్మక జర్నలిజం.. ఉందా..? నేను ఈ మాట అంటే మీలో చాలా మందికి మళ్లీ నాలో అహంకారం కనబడొచ్చు. నేను ఉన్నది ఉన్నట్టుగా అడుగుతున్నా.. ఉన్నదా రాసే పరిస్థితి.. చెప్పే పరిస్థితి ఉన్నదా..? అందరి ముందటే అడుగుతున్నా స్వేచ్ఛగా, నిర్భీతిగా పరిశోధనాత్మక కథనాలు వస్తున్నాయా..? వాస్తవాలు చెబితే నచ్చవన్నారు.

## గ్రూప్ నోటిఫికేషన్ రాకపోవడంపై మనస్తాపం

**ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డ యువకుడు**

ఖమ్మం,ఆగస్ట్ 1(ప్రజాజ్యోతి): గ్రూప్స్ నోటిఫికేషన్ రావడం లేదని యువకుడు ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన ముదిగొండ మండలంలో కలకలం రేపింది. యువతకు ఉద్యోగాలు హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం.. కాలయాపన చేస్తుండడంతో విసిగిపోయిన న్యూ లక్ష్మీపురంవాసి గడ్డం వేణు కుమార్ ఎలుకల మందు, ఇతర మాత్రలు తీసుకొని ఆత్మహత్యకు యత్నించాడు. ప్రస్తుతం ఐసీయూలో చావుబతుకుల మధ్య కొట్టుమిట్టాడుతున్న అతడు తాను ఎందుకు ఆత్మహత్యకు ప్రయత్నించాడో సూసైడ్ లేఖలో వెల్లడించాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. ప్రస్తుతం ముత్తారం శివారులోని ప్లలె చెరువులోని మిషన్ భగీరథ ప్లాంట్‌లో ఔట్ సోర్సింగ్ ఉద్యోగిగా పనిచేస్తున్న వేణు కుమార్ పీజీ వరకూ చదివాడు. గత అయిదేళ్లుగా గ్రూప్స్ కోసం ప్రిపేర్ అవుతున్నాడు. ప్రతి రోజు ఎ÷-లాంటు వద్దకు వెళ్లి.. పని చూసుకుంటూ.. అక్కడే చదువుకుని సాయంత్రం ఇంటికి వస్తాడు. రోజులానే శనివారం కూడా ఇంట్లో నుంచి వెళ్లాడు. అయితే.. సాయంత్రం సమయంలో నిరుద్యోగుల వాట్సాప్ గ్రూప్‌లో సూసైట్ నోట్ పోస్ట్ చేసి అతడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. గ్రూపులో ఉన్నవారు అప్రమత్తమై వెంటనే అతడి తండ్రికి సమాచారం ఇవ్వగా.. వెళ్లి చూసేసరికి వేణు అపస్మారక స్థితిలో ఉన్నాడు. హుటాహుటిన అతడిని వైద్య చికిత్స నిమిత్తం ఖమ్మంలో ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. వేణు ఆత్మహత్యకు ప్రయత్నించిన చోట ఎలకల మందు, గుర్తు తెలియని మాత్రలను గుర్తించారు.

# ఆదిలాబాద్ జిల్లా కాంగ్రెస్ 'పొలిటికల్ అఫైర్స్ కమిటీ' (పీఏసి)తొలి సమావేశం

**పార్టీ బలోపేతం, జిల్లా అభి వృద్ధి ప్రాజెక్టులు, సంక్షేమ ప థకాల అమలుపై సుదీర్ఘ చ ర్చ**
**తలమడుగు (కజ్జర్ల)లో 800 ఎకరాల్లో వర్సిటీ ఏ ర్పాటుకు ప్రతిపాదన**
**'కుప్టి ప్రాజెక్ట్' సామర్థ్యం 6.5 టీఎంసీలకు పెంచాలని స మావేశంలో తీర్మానం**

ఆదిలాబాద్ బ్యూరో,ఆగష్టు 1 (ప్రజా జ్యోతి): ఆదిలాబాద్ జిల్లా కేంద్రం లో ని చిలుకూరి లక్ష్మీ గార్డెన్‌లో జిల్లా కాంగ్రెస్ కమిటీ ఆధ్వ ర్యంలో నూతనంగా నియ మించబడిన పొలిటికల్ అ ఫైర్స్ కమిటీ (పిఏసి) మొట్ట మొదటి సమావేశం విజయ వంతం గా నిర్వహించారు. జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్య క్షులు డాక్టర్



నరేష్ జాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ స మావేశంలో నియోజకవర్గ ఇన్చార్జిలు, ప్రజాప్రతినిధు లు, మార్కెట్ కమిటీ చైర్మ న్ లు, అనుబంధ సంఘాల నాయకులు పాల్గొన్నారు.

పార్టీ బలోపేతం, నూతన డి సిసి కార్యాలయనిర్మాణం, మండల కమిటీల ఏర్పాటు, జిల్లాలో తెలంగాణ ప్రభు త్వం అమలు చేస్తున్న సంక్షే మ పథకాలు, అభివృద్ధి కా ర్యక్రమాలపై సుదీర్ఘంగా చ ర్చించారు. ఈ సందర్భంగా ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జి కంది శ్రీనివాస రెడ్డి మాట్లాడుతూ జైనథ్-బేలా సంయుక్త మార్కెట్ కమిటీ నుంచి విడదీసి, బేలా కు ప్ర త్యేకంగా మార్కెట్ కమిటీ ఏర్పాటు చేయాలని పిఏసి సమావేశంలో ప్రతి పాదిం చామని అన్నారు.కాంగ్రెస్ ప్రభుత్వం మంజూరు చేసి నిర్మిస్తున్న 'ఇందిరమ్మ ఇండ్ల ను' స్థానిక ఎమ్మెల్యే తానే ఇ స్తున్నట్లు ప్రచారం చేసుకోవ డం సిగ్గుచేటని, 'ఇందిరమ్మ' అంటేనే కాంగ్రెస్ పార్టీ అని గుర్తుంచుకోవాలని తెలిపా రు. తదనంతరం జిల్లా కాం గ్రెస్ పార్టీ అధ్యక్షులు డాక్టర్ నరేష్ జాదవ్ మాట్లాడుతూ ఆదిలాబాద్ జిల్లా విద్యార్థు లు ఉన్నత విద్య కోసం హైదరాబాద్ సుదూర ప్రాంతా లకు వెళ్లడం వల్ల పేద వి ద్యార్థులకు భారం అవుతోం ది. కాబట్టి, తలమడుగు మండలం కజ్జర్ల గ్రామ శివా రులోని 800 ఎకరాల ప్రభు త్వ భూమిలో 'విశ్వవిద్యాల యం' (యూనివర్సిటీ),జె ఎ న్ టి యు కళాశాల ఏర్పా టు చేయాలని పి ఎ సి స మావేశంలో తీర్మానించాం అని తెలిపారు. ఈ విషయా న్ని ప్రభుత్వం దృష్టికి తీసు కెళ్తాం అని అన్నారు. బోథ్ నియోజకవర్గ వరప్రదాయిని అయిన 'కుప్టి ప్రాజెక్ట్' జీవో నంబర్లు 18, 34లను సవ రించి, నీటి నిల్వ సామర్థ్యా న్ని 6.5 టీఎంసీలకు పెంచి సాగు, తాగునీరు అందించా లని సమావేశంలో తీర్మానిం చాం అన్నారు. ఈ ప్రాజెక్టు పై ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్ రెడ్డి ఇరిగేషన్ అధి కారులను ఆదేశించారు. ప్రక్రియ కొనసాగుతోందని తెలి పారు. అలాగే రాష్ట్ర, జిల్లా స్థాయి నామినేటెడ్ పోస్టుల భర్తీపై చర్చించామని, సంక్షే మ పథకాలు, ఇందిరమ్మ ఇండ్ల మంజూరులో కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలను భాగస్వాములను చేయాల ని తీర్మానించామని తెలిపా రు. ఆదిలాబాద్ లో ఎయిర్ పోర్ట్ భూసేకరణ కోసంప్రజా ప్రభుత్వం ₹2000 కోట్లు కే



టాయించిందని, ఆదిలాబా ద్– ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మా ణానికి కూడా రాష్ట్ర ప్రభు త్వం పూర్తి సహకారం అంది స్తోందని అన్నారు. ఈ కార్యక్రమంలో పిఏసి సభ్యులై న సోయం బాపురావు (మాజీ ఎంపీ) కంది శ్రీనివాస రెడ్డి (ఆదిలాబాద్ నియోజకవర్గ ఇన్చార్జ్)ఆడే గజేందర్, (బోథ్ నియోజకవర్గ ఇన్చార్జ్) మల్లెపూల నరసయ్య (జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్) బోరంచు శ్రీకాంత్ రెడ్డి (ఆది లాబాద్ మార్కెట్ కమిటీ చై ర్మన్)సాజిద్ ఖాన్ (మాజీ డిసిసిఅధ్యక్షులు)అల్లూరి సంజీవరెడ్డి(మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్)దిగంబర్ రా వు పాటిల్ (మాజీ మున్సి పల్ చైర్మన్) మల్లెపూల స త్యనారాయణ (బోథ్ మార్కెట్ కమిటీ చైర్మన్), అల్లూ రి అశోక్ రెడ్డి (జైనథ్ మార్కె ట్ కమిటీ చైర్మన్) కొమరం కోటేష్ (ఇచ్చోడ మార్కెట్ క మిటీ చైర్మన్), బండారి అ నూష సతీష్ (ఆదిలాబాద్ మున్సిపల్ చైర్‌పర్సన్) అడ్డి భోజ రెడ్డి(మాజీ డిసిసిబి చై ర్మన్) ముడుపు దామోదర్ రెడ్డి (మాజీ డిసిసిబి చైర్మన్) గోక గణేష్ రెడ్డి (మాజీ జె డ్పీటీసీ) బాలురి గోవర్ధన్ రె డ్డి(జిల్లా కాంగ్రెస్ అధికార ప్ర తినిధి) ఏలేటి అశ్విన్ రెడ్డి, ఖిజార్ పాషా (పట్టణ కాంగ్రె స్ అధ్యక్షులు)బెజ్జంకి అనిల్ కుమార్(మాజీ టిటిడి బోర్డు మెంబర్)గౌలి సంజీవ్ కుమా ర్, (మాజీ మున్సిపల్ ఫ్లోర్ లీడర్) అంబకంటి అశోక్, (జిల్లా ఓబిసి చైర్మన్) అన్న పూర్ణ (జిల్లా మహిళా కాంగ్రె స్ అధ్యక్షురాలు)సయ్యద్ షాహీద్ అలీ(జిల్లా కాంగ్రెస్ మైనారిటీ విభాగ చైర్మన్) మంగేష్ కుమార్ (జిల్లా కాం గ్రెస్ లీగల్ సెల్ చైర్మన్) చర ణ్ గౌడ్ (జిల్లా యూత్ కాంగ్రె స్ అధ్యక్షులు)కపిల్ (జిల్లా ఎన్ఎస్‌యుఐ అధ్యక్షులు) మునిగేల నర్సింగ్ (ఐ ఎన్ టి యు సి జిల్లా అధ్యక్షులు, మోతీరామ్ (సేవాదళ్ జిల్లా అధ్యక్షులు) పార్టీ వివిధ వి భాగాల నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు పె ద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఆపద వస్తే నేనున్నాను అంటు భరోసా ఇచ్చేదే నిజమైన స్నేహం

**కష్టం వస్తే నీకేమి కాదు అని భుజం తట్టేది -ఎవరు లేనప్పుడు అండగా నిలిచేదే స్నేహం**
**నేడే స్నేహితుల దినోత్సవం**
**సంస్కృతి సేవా సమితి అధ్యక్షుడు సేనాపతి ఆచార్య కృష్ణచంద్ర.**

నిర్మల్ జిల్లా ప్రతినిధి ,అగష్టు 1 ,( ప్రజాజ్యోతి ): ఆపద వస్తే నేనున్నాను అంటు భరోసా ఇచ్చేది,కష్టం వస్తే నీకేమి కాదు అని భుజం తట్టేది, ఎవరు లేనప్పుడు అండగా నిలిచేది స్నేహితుడు,




అందుకే స్నేహం అంత గొప్పది అని సంస్కృతి సేవా సమితి అధ్యక్షుడు సేనాపతి అచార్య కృష్ణచంద్ర అన్నారు.ఈరోజు స్నేహితుల దినోత్సవం సందర్భంగా ఆయన ప్రజాజ్యోతి తో మాట్లాడుతూ జీవితంలో వందలాది పరిచయాలు ఉండటం గొప్ప విషయం కాదని మన ఆనందంలో నవ్వే వారు ఎంతోమంది ఉంటారు, కానీ కష్టకాలంలో మనతో పాటు నిలబడే ఒక్క నిజమైన స్నేహితుడే అమూల్యుడు అని అంటూ అలాంటి విలువైన స్నేహమే జీవితానికి సరైన దారి చూపుతుందని తెలిపారు. మనల్ని మంచి మార్గంలో నడిపించి, ధర్మాన్ని గుర్తుచేసి, అవసరమైనప్పుడు నిజాన్ని చెప్పగల స్నేహితుడే నిజమైన సంపద అని కృష్ణ చంద్ర సూచించారు. అందుకే శ్రీకృష్ణ పరమాత్మ తన జీవితంతో స్నేహానికి ఆదర్శంగా నిలిచాడని తెలిపారు. సుదామునితో ఆయన స్నేహం మనకు తెలియజేసేది అదేననీ నిజమైన స్నేహానికి ధనం, స్థానం, హోదా కాదు; ప్రేమ, విశ్వాసం, ఆప్యాయతలే పునాది అని అన్నారు.



ఎక్కువ మంది పరిచయాల కంటే, హృదయపూర్వకంగా తోడుండే ఒక్క నిజమైన స్నేహితుడు ఉంటే చాలు అదే జీవితానికి దారి చూపే దైవానుగ్రహం అని ఆయన వివరించారు.

# తెలంగాణ రైజింగ్-2047'లో భాగస్వామ్యం అవ్వండి

**మొదటిపేజీ తరువాయి..**

శనివారం ఆయన లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి శ్రీధర్ బాబు మాట్లాడుతూ... 'తెలంగాణ రైజింగ్-2047' అనేది కేవలం ప్రభుత్వ కార్యక్రమం కాదని, సమాజంలోని అన్ని



వర్గాల భాగస్వామ్యంతో సాకారమయ్యే అభివృద్ధి విజన్ అని వివరించారు. ఆర్థిక వృద్ధితో పాటు సామాజిక పురోగతి సమాంతరంగా సాగేలా... ఆవిష్కరణల ద్వారా ఉపాధి అవకాశాలు సృష్టించేలా... అభివృద్ధి ప్రతి నియోజకవర్గానికి, దాని ఫలాలు సమాజంలోని ప్రతి వర్గానికి చేరేలా ఈ బృహత్తర ప్రణాళికను రూపొందించామన్నారు. ఈ లక్ష్య సాధనలో ప్రభుత్వం... పరిశ్రమలు, విద్యాసంస్థలు, స్వచ్ఛంద సంస్థలు, కార్పొరేట్ రంగం భాగస్వామ్యానికి అత్యంత ప్రాధాన్యమిస్తోందన్నారు. సీఎస్ఆర్ ద్వారా సమాజంలో మార్పు తెచ్చే కార్యక్రమాల అమలుకు, పరిశ్రమల స్థాపనకు సంబంధించి ప్రతి దశలోనూ ప్రభుత్వం కార్పొరేట్ సంస్థలకు భాగస్వామిగా, సహాయకారిగా ఉంటుందని మంత్రి శ్రీధర్ బాబు భరోసానిచ్చారు. ఏఐ, డేటా గవర్నెన్స్, సైబర్ భద్రత వంటి అంశాలు కార్పొరేట్ ప్రపంచంలో కొత్త సవాళ్లుగా మారుతున్న నేపథ్యంలో కంపెనీ సెక్రటరీలు... కేవలం కంప్లయన్స్ నిపుణులుగా కాకుండా స్ట్రాటజిక్ బోర్డ్ అడ్వైజర్లుగా మారాల్సిన అవసరం ఉందన్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో కంపెనీలు కేవలం లాభార్జనే కాకుండా... సస్టైనబుల్, ఎథికల్ వ్యాపార వృద్ధిపై దృష్టి సారించాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్ఠాత్మకంగా ప్రారంభించిన కాన్‌స్టిట్యూయెన్సీ డెవలప్‌మెంట్ ప్రోగ్రామ్(సీడీఎక్స్)కు నాలెడ్జ్ పార్ట్ నర్ గా ఉండేందుకు ముందుకొచ్చిన ' ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ కంపెనీ సెక్రటరీస్ ఆఫ్ ఇండియా' ప్రతినిధులను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఇదే స్ఫూర్తితో మరిన్ని కార్పొరేట్ కంపెనీలు, సంస్థలు రాష్ట్ర ప్రభుత్వంతో కలిసి పని చేసేందుకు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో ఐసీఎస్ఐ ప్రతినిధులు మహదేవ్ తిరునగరి, ఎం.దామోదరన్, శిల్పా, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

## రెచ్చగొట్టే వ్యాఖ్యలు, క్రైం బిల్లుపై సెలక్ట్ కమిటీ చర్చ

**మొదటిపేజీ తరువాయి..**

దానం నాగేందర్, మధుసూదన్ రెడ్డి, యశస్విని రెడ్డి, కవ్వంపల్లి సత్యనారాయణ, కోవా లక్ష్మి, కూనంనేని సాంబశివరావు, మాణిక్ రావు పాల్గొన్నారు. మరోసారి హేట్ బిల్, స్పీచ్ బిల్లు కాపీలను సభ్యులందరికీ చైర్మన్ పొన్నం ప్రభాకర్ ఇచ్చారు. అనంతరం మంత్రి పొన్నం మీడియాతో మాట్లాడారు. వారం రోజుల్లో మరోసారి తమ కమిటీ సమావేశం కానుందని తెలిపారు. వచ్చే సమావేశంలో సభ్యులందరి నుంచి సూచనలను తీసుకుంటామని చెప్పుకొచ్చారు. అసెంబ్లీలో విద్వేషపూరిత ప్రసంగాల నిరోధానికి చట్టం తీసుకువస్తామని స్పష్టం చేశారు. శాసనసభలో విద్వేషపూరిత ప్రసంగాలు చేయకుండా తమ కమిటీ నివేదిక సిద్ధం చేస్తుందని తెలిపారు. ఆయా రాజకీయ పార్టీలతో పాటు సమాజంలో పేరొందిన వారి సలహాలు తీసుకుంటామని అన్నారు. వ్యక్తుల గౌరవం కాపాడే విధంగా తమ కమిటీ నివేదిక ఉంటుందని వివరించారు. భావప్రకటన స్వేచ్ఛకు భంగం కలిగించబోమని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# ఎస్సారెస్పీ ప్రాజెక్ట్ తెలంగాణ రాష్ట్రానికే గర్వకారణం

**మొదటిపేజీ తరువాయి..**

సుమారు 56 ఏళ్ల చరిత్ర కలిగిన ఈ ప్రాజెక్ట్ ఆయకట్టు రైతులకు జీవనాడిగా నిలిచిందని ఆయన పేర్కొన్నారు. ఎస్సారెస్పీ ప్రాజెక్ట్‌లో పూడిక వల్ల నీటి నిల్వ సామర్థ్యం తగ్గుతుండడాన్ని గుర్తించి, ప్రాజెక్ట్ పూడికతీతకు సంబంధించి ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేస్తున్నట్లు మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. రాబోయే రెండు రోజుల్లో ప్రాజెక్ట్ నుండి సాగునీటి విడుదలపై స్పష్టమైన ప్రకటన చేస్తామన్నారు. అయితే, గత సంవత్సరంతో పోలిస్తే ప్రస్తుతం ప్రాజెక్ట్‌లో నీటి నిల్వలు కొంత తక్కువగా ఉన్నాయని, ఈ పరిస్థితిని రైతులు గమనించి సహకరించాలని విజ్ఞప్తి చేశారు. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో నీరు నింపకపోవడంపై బీఆర్ఎస్ పార్టీ కావాలనే తప్పుడు ప్రచారం చేస్తోందని మంత్రి మండిపడ్డారు. సాంకేతిక లోపాలు, డిజైన్ వైఫల్యాల వల్ల దెబ్బతిన్న ఈ మూడు ప్రాజెక్టుల పునరుద్ధరణ విషయంలో తమ ప్రభుత్వం తీసుకుంటున్న శాస్త్రీయ చర్యలను సెంట్రల్ వాటర్ కమిషన్ కూడా ఏకీభవించిందని వివరించారు. ఈ మూడు బ్యారేజీల పునరుద్ధరణకు కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తి కట్టుబడి ఉందన్నారు. ఎల్లంపల్లి ప్రాజెక్టును నిర్మించింది కాంగ్రెస్ ప్రభుత్వమని, అది ప్రాణహిత-చేవెళ్ల పథకంలో భాగమని స్పష్టం చేసిన మంత్రి.. దాన్ని కూడా తామే కట్టినట్లు బీఆర్ఎస్ తప్పుడు ప్రచారం చేసుకుంటోందని విమర్శించారు. కాంగ్రెస్ హయాంలో నిర్మించిన డ్యాములు 60 ఏళ్లు పూర్తయినా ఇప్పటికీ చెక్కుచెదరకుండా ఉన్నాయని, కానీ బీఆర్ఎస్ నిర్మించిన ప్రాజెక్టులు మాత్రం కొద్ది ఏళ్లకే ధ్వంసం అయ్యాయని ఎద్దేవా చేశారు. కేవలం ఉమ్మడి నిజామాబాద్ జిల్లానే కాకుండా దక్షిణ తెలంగాణ సాగునీటి పరిస్థితులను కూడా ప్రభుత్వం ఎప్పటికప్పుడు నిశితంగా పరిశీలిస్తోందని మంత్రి వెల్లడించారు. ప్రస్తుతం నాగార్జున సాగర్‌కు కూడా ఎగువ నుండి నీళ్లు వచ్చే పరిస్థితులు కనిపిస్తున్నాయని, రైతాంగానికి సాగునీటి కొరత లేకుండా చూసేందుకు ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకుంటోందని ఆయన ధీమా వ్యక్తం చేశారు.



# స్వేచ్ఛ అంటే ఇష్టం వచ్చినట్లు చేయడం కాదు

**మొదటిపేజీ తరువాయి..**

చట్టబద్ధమైన పరిధిలోనే ఉండాలని నొక్కి చెప్పారు. ప్రజాస్వామ్యంలో శాంతిభద్రతలను కాపాడటం, చట్టాన్ని



గౌరవించడం పౌరుల ప్రాథమిక విధి అని గుర్తు చేశారు. స్వేచ్ఛను ఇష్టానుసారంగా ఏమైనా చేసే అనియంత్రిత హక్కుగా భావించవద్దని యువతను హెచ్చరించారు. దేశ భద్రత, ఇంటెలిజెన్స్ రంగాలలో చేసిన అసమాన సేవలకు గాను అజిత్ దోవల్ ప్రతిష్టాత్మక లోకమాన్య తిలక్ జాతీయ పురస్కారానికి ఎంపికయ్యారు. ఈ మేరకు శనివారం మహారాష్ట్రలోని పుణెలో జరిగిన అవార్డు ప్రదానోత్సవ కార్యక్రమంలో కేంద్ర హోం శాఖ మంత్రి అమిత్ షా చేతుల మీదుగా దోవల్ ఈ అవార్డు అందుకున్నారు. స్వాతంత్ర్య సమరయోధుడు లోక్‌మాన్య బాలగంగాధర్ తిలక్ 106వ వర్ధంతి సందర్భంగా లోక్‌మాన్య తిలక్ స్మారక్ ట్రస్ట్ ఈ పురస్కారాన్ని అందజేసింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్వాతంత్ర్య పోరాట సమయంలో ఉద్యమకారులు చేసిన త్యాగాలను యువ భారతీయులు స్మరించుకోవాలని సూచించారు. భారతదేశ జాతీయ చైతన్యాన్ని తీర్చిదిద్దడంలో తిలక్ పోషించిన పాత్ర.. ఆయన జీవితం నుంచి యువతరం స్ఫూర్తి పొందాలని కోరారు. నీట్ యూజీ 2026 క్వశ్చన్ పేపర్ లీకేజీకి వ్యతిరేకంగా దేశవ్యాప్తంగా యువత పెద్ద ఎత్తున నిరసనలు తెలిపిన విషయం తెలిసిందే. నీట్ పేపర్ లీక్‌కు నైతిక బాధ్యత వహిస్తూ అప్పటి కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేస్తూ కాక్రోచ్ జనతా పార్టీ చలో పార్లమెంట్?కు పిలుపునిచ్చింది. అఅయితే, ఈ చలో పార్లమెంట్ కార్యక్రమం తీవ్ర హింసాత్మకంగా మారింది. యువత నిరసనలను అణిచివేసేందుకు పోలీసులు దమనకాండ కొనసాగించారు. యువతపై లాఠీచార్జ్ చేయడంతో పాటు టియర్ గ్యాస్, పె÷-లలెట్ గన్స్ ఉపయోగించారు. కొన్ని చోట్ల పోలీసుల బలప్రయోగంపై యువత తిరగబడ్డారు. దీంతో సీజేపీ తలపెట్టిన చలో పార్లమెంట్ తీవ్ర హింసాత్మకంగా మారింది. విద్యార్థులపై పోలీసుల బలప్రయోగంపై తీవ్ర విమర్శలు వెల్లువెత్తాయి. ప్రతిపక్షాలు కూడా విద్యార్థుల దాడిని తీవ్రంగా ఖండించాయి. యువత, ప్రతిపక్షాల నుంచి ఒత్తిడి పెరగడంతో ధర్మేంద్ర ప్రధాన్ విద్యాశాఖ మంత్రి పదవికి రాజీనామా చేశారు. ఆయన స్థానంలో మరో కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి తాత్కాలికంగా విద్యాశాఖ బాధ్యతలు చేపట్టారు.

Printed and Published by V. SRINIVAS REDDY on behalf of M/S SAI KRISHNA PUBLICATIONS Owned by M/S SAI KRISHNA PUBLICATIONS Printed at Sree Seshasai Enterprises, Plot No. 98/1, Co-operative Industrial Estate, IDA, Gandhinagar, Quthbullapur Mandal, Medchal-Malkajgiri Dist, Telangana. Published at H.No. 1-2-79/4/A, Shanthi Nagar, Adilabad, Adilabad Dist, Telangana. Editor: V. SRINIVAS REDDY, RNI No. TELTEL/2008/24799, Ph No: 9440231967